అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
మంగళవారం 17-10-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 237 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50



ప్రజాస్వామ్యంలో చీకటి కాలం

- పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు జోక్యం చేసుకోవాలి : రాష్ట్రపతికి వివిధ సంఘాల సంయుక్త లేఖ
- న్యూస్‌క్లిక్‌పై కేంద్ర ప్రభుత్వ దాడికి నిరసనగా పీసీఐలో ధర్నా

వివరాలు 11లో..



గుండె చప్పుడు ఆపలేం..

గర్భవిచ్ఛిత్తికి సుప్రీం నో

న్యూఢిల్లీ: తన 26 వారాల గర్భాన్ని వైద్యపరంగా విచ్ఛిత్తి చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ ఒక మహిళ చేసిన విజ్ఞప్తిని అంగీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. గర్భం దాల్చిన కారణంగా సదరు మహిళ ప్రాణాలకు తక్షణ ప్రమాదం లేదని, గర్భంలోని పిండం ఆరోగ్యంగా ఉందని ఎయిమ్స్ మెడికల్ బోర్డు ఇచ్చిన నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టు ఈ తుది నిర్ణయానికి వచ్చింది. ప్రసవానికి అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే తగిన సమయంలో చెల్లిస్తుందని కోర్టు తెలిపింది. తల్లిదండ్రులు కోరుకుంటే పుట్టే బిడ్డను దత్తత ఇచ్చేందుకు అవకాశం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపి) చట్ట ప్రకారం వివాహిత స్త్రీలు, ప్రత్యేక కేటగిరి కిందకు వచ్చే అత్యాచార బాధితులు, వికలాంగులు, మైనర్లు, అనారోగ్యం, శారీరక బలహీన మహిళలు తమ గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకోవడానికి గరిష్ఠ కాల వ్యవధి 24 వారాలుగా ఉంది. ప్రస్తుత కేసులో ...11లో



సుప్రీంకోర్టుకు ప్రబీర్, అమిత్

ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కేసులో తమ అరెస్టును, రిమాండ్‌ను రద్దు చేసేందుకు నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, హెచ్ ఆర్ విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్ధివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీం కోర్టు ...11లో





ఊచకోతలోనూ... రాజకీయమేనా?

పాలస్తీనాలో ఇంతటి దమనకాండ కొనసాగుతున్నప్పటికీ మోడీ ప్రభుత్వం మాత్రం ఇజ్రాయిల్‌కే బాసటగా నిలుస్తోంది. ఈ వైఖరి పశ్చిమాసియాలో అనేక ప్రశ్నలు లేవనెత్తేందుకు అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా పాలస్తీనా ప్రజలు, దేశంలోని ప్రజాస్వామ్యవాదులు సంధిస్తున్న ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. మోడీ ప్రభుత్వ వైఖరి కారణంగా పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికాలోని పౌర సమాజంలో దేశ ప్రతిష్ఠ దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. అయినప్పటికీ ఇదేమీ మోడీ సర్కారుకు పట్టడం లేదు. హమాస్ దాడులు జరిగిన తర్వాత మోడీ ఓ ప్రకటన చేస్తూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నప్పటికీ దానిని భారత్ వ్యతిరేకిస్తుందని చెప్పారు. అయితే అదే సమయంలో దశాబ్దాల తరబడి ఇజ్రాయిల్ సాగిస్తున్న హింసను ఆయన విస్మరించారు.

ఇజ్రాయిల్ దుశ్చర్యలకు బీజేపీ ప్రభుత్వం బాసట

- వేలాది మంది సమిధలవుతుంటే ప్రేక్షక పాత్ర
- ప్రపంచ దేశాలలో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట

న్యూఢిల్లీ : హమాస్ మిలిటెంట్ల ఏరివేత పేరుతో పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ విషయంలో భారత ప్రభుత్వ వైఖరి అమానుషంగా ఉంది. ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న ఇజ్రాయిల్ దాడులను సమర్థిస్తూ మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. ఒకవైపు ఇజ్రాయిల్ దళాలు పాలస్తీనాలో మానవ హక్కులను కాలరాస్తూ, వైమానిక దాడులతో నగరాలను నామరూపాలు లేకుండా చేస్తూ, భవనాలను నేలమట్టం చేస్తూ ప్రజలను... చివరికి చిన్నారులను సైతం పెద్ద సంఖ్యలో పొట్టన పెట్టుకుంటున్నాయి. పాలస్తీనా ప్రజలు ఆహారం, తాగునీరు, మందుల కోసం అలమటిస్తుంటే వారికి ఆ నిత్యావసరాలు అందకుండా అడ్డుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నాయి. పాలస్తీనీయులు విద్యుత్ సౌకర్యం కూడా లేక గాఢాంధకారంలో బిక్కుబిక్కుమంటూ భయంతో కాలం ...2లో

గాజా ఉక్కిరిబిక్కిరి!

- 24గంటల్లో నీరు, విద్యుత్ నిల్వలు ఖాళీ
- ఆస్పత్రుల్లో పరిస్థితులు దయనీయం
- పొంచివున్న ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధులు
- సాయం కోసం ప్రజల ఎదురుతెన్నులు

వివరాలు 2లో

బంగాళాఖాతంలో కలిపేయండి..

కాంగ్రెస్ వస్తే దళారుల రాజ్యం వస్తుంది

- మూడు గంటల కరెంట్ కావాలా? 24 గంటల కరెంట్ కావాలా?
- జనగామలో చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- భువనగిరి జిల్లాకే యాదాద్రి ఒక బంగారు తునక : జనగామ, భువనగిరి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



బీఆర్ఎస్‌లో చేరిన పొన్నాల లక్ష్మయ్య

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/జనగామ/భువనగిరి

"కాంగ్రెస్ పార్టీ మళ్లీ కౌలు రైతుల దుకాణం మొదలుపెట్టిందని.. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామంటోందని.. అలా మాట్లాడుతున్న పార్టీనే బంగాళాఖాతంలో కలిపేయాలని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం జనగామ, భువనగిరి నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. "మళ్లీ కౌలు రైతుల ముచ్చట మాట్లాడుతాండ్రు.. బంజారా హిల్స్‌లో కూడా బంగళాలను కౌలుకు ఇస్తరు.. అక్కడ ఎందుకో కబ్జా కాలమ్ పెడతలేరు..? రైతులను ...11లో

మరో 29 మందికి బీఆర్ఎస్ బీ-ఫామ్‌లు

- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందజేత
- మొత్తం 98కి చేరిన సంఖ్య

వివరాలు 10లో

ఆడబిడ్డ చనిపోతే ఆరోపణలా?

మీ చెల్లి చనిపోతే ఇలానే మాట్లాడతారా..? : కేటీఆర్‌ను నిలదీసిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి


- ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తాం
- డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం : వికారాబాద్‌లో కాంగ్రెస్ బహిరంగ సభ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి, వికారాబాద్ ప్రతినిధి

'ఆడ బిడ్డ ఆత్మహత్య చేసుకుంటే అవమానిస్తూ.. ఏ పరీక్ష రాయలేదంటావా.. అది నీకు తగునా, మీ చెల్లినో మీ కాక బిడ్డనో చనిపోతే ఇలానే మాట్లాడతారా..' అంటూ గ్రూపు-2 అభ్యర్థి ప్రవళిక ఆత్మహత్యపై కేటీఆర్‌ను టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నిలదీశారు. డిసెంబర్ నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తోందని, ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తామని, డిసెంబర్ 9వ తేదీన తొలి సంతకం దానిపైనే చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రేవంత్ మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ చేవేళ్ల ప్రాణహిత ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. కానీ కేసీఆర్ పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్ళు తెస్తానని చెప్పి నేటికీ తేలేదన్నారు. వికారాబాద్



వరకు ఎంఎంటీఎస్ తెచ్చేందుకు జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. దానికి కేసీఆర్ అడ్డుపడటంతోనే రాలేదని తెలిపారు. ఏ రోజు కూడా ఈ ప్రాంతంలో రాళ్లతో, కర్రలతో కొట్టుకోలేదన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, సోదరి సునీతారెడ్డి కారుపై రాళ్ల దాడి చేయించి ఆ సంస్కృతికి తెర లేపిన ఘనత వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, ...11లో



మణిపూర్ మండుతుంటే.. ఇజ్రాయిల్ వైపు మోడీ చూపు

- రాహుల్ గాంధీ ఆగ్రహం

న్యూఢిల్లీ : ఓవైపు మణిపూర్ మండుతుంటే ప్రధాని మోడీ మాత్రం ఇజ్రాయిల్-హమాస్ యుద్ధం పట్ల అధిక ఆసక్తి కనబరుస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. మిజోరాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ మాట్లాడుతూ మణిపూర్ హింసాకాండను విస్మరించి ఇజ్రాయిల్‌లో ఏం జరుగుతుందనే దానిపై ప్రధాని, భారత ప్రభుత్వం ఆసక్తి చూపుతుండటం తనకు విస్మయం కలిగిస్తోందని అన్నారు.

ఈ ఏడాది జూన్‌లో తాను మణిపూర్ సందర్శించినప్పుడు అక్కడ చూసిన విషయాలను నమ్మలేకపోయానని చెప్పారు. మణిపూర్‌ను బీజేపీ నాశనం చేసిందని, ఇప్పుడది ఓ రాష్ట్రం కాదని, రెండు రాష్ట్రాలని మైతీ, ...11లో


మంత్రిగారూ... సాక్ష్యాలివిగో...

గ్రూప్స్‌కు దరఖాస్తు చేసిన ప్రవళిక

- సమాచారం తెలుసుకోకుండా మాట్లాడిన కేటీఆర్



(ఫైల్)







నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ప్రవళిక గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4 రాతపరీక్షలకు దరఖాస్తు చేసింది. ఆమె ఆ పరీక్షలకు దరఖాస్తు చేసిన వివరాలు దరఖాస్తు ఫారం, హాల్‌టికెట్లు వెలుగులోకి వచ్చాయి. అయితే ఆమె అసలు గ్రూప్స్‌కే దరఖాస్తు చేయలేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. నిరుద్యోగులు, ఓయూ జేఏసీ నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. కేటీఆర్ గారూ... సాక్ష్యాలివిగో అంటూ ప్రవళిక గ్రూప్స్‌కు దరఖాస్తు చేసిన వివరాలను వారు ...11లో



ఓటరు జాబితాపై స్పష్టత ఇవ్వాలి

- రాజకీయ పార్టీలకు చేర్పులు, తొలగించిన పేర్ల జాబితా అందుబాటులో ఉంచాలి : కేంద్ర ఎన్నికల సంఘానికి సీపీఎం, సీపీఐ, ఎస్పీ బృందం వినతి 2లో..

బీఆర్ఎస్‌కు దళిత బంధు గండం?

బడ్జెట్లో ఘనంగా రూ.17,700 కోట్లు కేటాయింపు

- ఒక్కరికి కూడా పథకం అమలు కాని వైనం
- ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న పేదలు, దరఖాస్తుదారులు
- ఆశల పల్లకిలో ఆశావహులు
- మొదటి విడతలో కొందరికిచ్చి అందరినీ నమ్మించే ప్లాన్..
- ఎన్నికల షెడ్యూల్ వస్తుందని తెలిసినా సర్కార్ తాత్సారం
- అమలుకు రాష్ట్రంలోనే ఇబ్బందులు
- దేశంలో ఏటా 25 లక్షల మందికి ఇస్తామన్న కేసీఆర్ మాట నీటి మూటేనా?

పైసాకూడా ఖర్చుచేయని సర్కారు

అనుకున్నదే జరిగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. కొత్త పథకాలు, ప్రారంభోత్సవాలకు బ్రేకులు పడ్డాయి. కేవలం ప్రచారం చేసుకోవడానికే తప్ప, జనాలకు , పథకాల లబ్ధి చేకూర్చేందుకు దారులు మూసుకుపోయాయి. ఇంతకు ముందే ప్రవేశ పెట్టిన పథకాలు అమలు చేయవచ్చు. కానీ వాటి అమలు తీరు ఓటరును ప్రలోభపెట్టేదిగా ఉండకూడదు. అలా జరిగితే.. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవడం, వాటిని నిలిపేయటం ఖాయం. జనాలకు ఇక ఎన్నికలే తప్ప.. పథకాల అమలు ఉండబోదు.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇప్పుడు చర్చలోకి వస్తున్న పథకం.. దళితబంధు. మొదటి విడతగా తూతూ మంత్రంగా కొంత మందికి ఇచ్చి దీనిపై పెద్ద ప్రచారం చేశారు. రెండో విడతకు లిస్టు రెడీ అయ్యింది. ఎంక్వైరీ పూర్తయ్యింది. కలెక్టర్ వద్దకు ...11లో

కారు బేకార్..

రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన

- కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను మోసం చేశాయి: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

నవతెలంగాణ - జమ్మికుంట/బడంగ్‌పేట్

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేశాయని, కారు బేకార్ అవుతోందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సోమవారం కరీంనగర్, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించిన బీజేపీ జన గర్జన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు.



ఆత్మ బలిదానాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరుగలేదన్నారు. దేశమంతా అభివృద్ధి ...2లో

ఎన్జీఓల పన్ను మినహాయింపులు రద్దు

నాలుగు సంస్థలపై ఐటీ శాఖ వేటు

- అదానీ గ్రూపును వ్యతిరేకించడమే నేరమట



న్యూఢిల్లీ : నాలుగు ప్రభుత్వేతర సంస్థలకు (ఎన్‌జీఓలు) అందిస్తున్న పన్ను మినహాయింపులను ఆదాయ పన్ను శాఖ రద్దు చేసింది. వీటిలో ఆక్స్‌ఫామ్ ఇండియా, కేర్ ఇండియా, లీగల్ ఇనిషియేటివ్ ఫర్ ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (లైఫ్), ఎన్విరానిక్స్ ట్రస్ట్ ఉన్నాయని విశ్వసనీయ వర్గాలను, ఆయా సంస్థల అధికారులను ఉటంకిస్తూ స్వతంత్ర మీడియా సంస్థ న్యూస్‌లాండ్రీ తెలిపింది. రెండు వారాల క్రితమే ఈ సంస్థల పన్ను మినహాయింపు ప్రతిపత్తి రద్దయింది. ఈ సంవత్సరం జూలైలో సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్ సంస్థ పన్ను మినహాయింపులపై వేటు పడిన విషయం తెలిసిందే.

ఆక్స్‌ఫామ్ ఇండియా, ఎన్విరానిక్స్ ట్రస్ట్ సంస్థలకు కల్పించిన పన్ను మినహాయింపులను రద్దు చేయడానికి చూపిన కారణాలలో ఒక దానికి అదానీ గ్రూపుతో సంబంధం ఉన్నదని ఆ సంస్థలకు ఐటీ శాఖ రాసిన లేఖల్లో తెలియజేశారు.

అదానీ గ్రూపుతో ముడిపెట్టి...

ఈ సంస్థల కార్యకలాపాలకు, వాటి లక్ష్యాలకు పొంతన కుదరడం లేదని ఐటీ శాఖ ఆరోపించింది. ఐరాస గ్లోబల్ ఇంపాక్ట్ జాబితా నుండి అదానీ పోర్ట్స్‌ను తొలగించే విధంగా ఆక్స్‌ఫామ్ ఇండియా వివరాలు అందించిందని, ఇలా చేయడం ఆ సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా లేదని ఐటీ శాఖ తెలిపింది. ఇక ఎన్విరానిక్స్ ట్రస్ట్ సంస్థ మినరల్ ఇన్ హెరిటర్స్ రైట్ అసోసియేషన్‌తో కలిసి ఒడిసాలో జిందాల్ స్టీల్ వర్క్, అదానీ బొగ్గు ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించిందని ఆరోపణ మోపింది. ఇది ట్రస్ట్ లక్ష్యానికి విరుద్ధంగా ఉన్నదని తెలిపింది. ఐటీ శాఖ ఆదేశాలను న్యాయస్థానంలో సవాలు చేస్తామని ఎన్విరానిక్స్ ట్రస్ట్ చెప్పింది. అదానీ గ్రూపు సహా భారతీయ సంస్థలు విదేశాల్లో ప్రాజెక్టులు నిర్వహించడాన్ని వ్యతిరేకించిందన్న కారణంతో లైఫ్ సంస్థ పన్ను మినహాయింపులు రద్దు చేశారు.

విద్య, ఆరోగ్య ప్రాజెక్టులు నిర్వహించడమే నేరమా?

ఇదిలావుండగా ఐటీ శాఖ చూపిన కారణాలలో తమకు దేనితోనూ ప్రమేయం లేదని కేర్ ఇండియా సంస్థ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'మమ్మల్ని ప్రభుత్వం ఎందుకు లక్ష్యంగా చేసుకుందో తెలియడం లేదు. మేము చాలా కాలంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకొని పని చేస్తున్నాము. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ప్రాథమిక విద్యా ప్రాజెక్టును నిర్వహిస్తున్నాము. బీహార్‌లోని అన్ని జిల్లాల్లో ఆరోగ్య ప్రాజెక్టులు నడుపుతున్నాం. కోవిడ్ సమయంలో కూడా గోరఖ్‌పూర్, లక్నోలో సేవలు అందించాం' అని ఆయన వివరించారు.

ప్రభుత్వ సమగ్రతను ప్రశ్నించడమే తప్పట

ఆక్స్‌ఫామ్ సంస్థకు కల్పించిన పన్ను మినహాయింపులు రద్దు చేయడానికి ఐటీ శాఖ మరికొన్ని కారణాలు కూడా చూపింది. ఈ సంస్థ ప్రభుత్వ సమగ్రతను ప్రశ్నించిందని, సమావేశంలో రాజకీయ అంశాలు చర్చించిందని వివరించింది. అంతేకాక ఈ సంస్థ ఒక సమూహం (కమ్యూనిటీ) యొక్క ప్రయోజనాల కోసం పనిచేస్తోందని ఆరోపించింది. ఇక ఎన్విరానిక్స్ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్లకు వ్యతిరేకంగా ధింకియా గ్రామంలో నిరసన తెలిపిందని పేర్కొంది. అసలు విషయం ఏమంటే 13.2 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టీల్ ప్లాంట్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు జిందాల్ స్టీల్ వర్క్స్‌కు వెయ్యి హెక్టార్ల భూమిని బదలాయింపు చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఒడిసాలోని ధింకియా గ్రామ ప్రజలు ఆందోళన జరిపారు.

గాజా ఉక్కిరిబిక్కిరి!

(మొదటిపేజీ తరువాయి)

జెరూసలేం, గాజా : హమాస్ ఆధీనంలో వున్న గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు నీరు, విద్యుత్ నిల్వలు తరిగిపోతుండడంతో గాజా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. పలు దేశాల నుండి వచ్చిన వందలాది మెట్రిక్ టన్నుల ఆహారం, ఇతర సాయం ఈజిప్ట్‌లోని సినాయ్ ద్వీపకల్పంలో రోజుల తరబడి నిలిచిపోయింది. బాంబులతో మోత మోగుతున్న గాజాకు సురక్షితంగా చేరవేయడం పెద్ద సాహస కృత్యంగా మారింది. గాజాకు సాయం అందించడం, విదేశీ పాస్ట్‌పోర్టు గల వారందరినీ రాఫా క్రాసింగ్ ద్వారా తరలించడానికి ఒప్పందం కుదిరేవరకు ఈ సాయం ఆగిపోయింది. బాధితులకు సాయమందించడం కోసం దౌత్య ప్రయత్నాలు కూడా ఉధృతమయ్యాయి. ఈ తరుణంలో గాజాతో గల సరిహద్దును ఈజిప్ట్ తెరుస్తుందని భావిస్తు న్నారు. ప్రాణాధారమైన సాయం రాఫా క్రాసింగ్ వద్ద ఎదురు చూస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) పేర్కొంది. వైద్య సరఫరాలు, ఇంధనం, పరిశుభ్రమైన నీరు, ఆహారం, ఇతర మానవతా సాయాన్ని రాఫా క్రాసింగ్ ద్వారా గాజాకు వెళ్లేందుకు అనుమతించాలంటూ డబ్ల్యుహెచ్ఒ ఇప్పటికే పలు విజ్ఞప్తులు చేసింది. ఇదిలావుండగా, మరోవైపు గాజావ్యాప్తంగా అస్పత్రిల్లో ఇంధన నిల్వలు తరిగిపోతున్నాయి. మరో 24గంటలు మాత్రమే వస్తాయని భావిస్తున్నారు. దీంతో వేలాదిమంది రోగుల ప్రాణాలు ముప్పు బారిన పడనున్నాయని ఐక్యరాజ్య సమితి మానవతా కార్యకలాపాల కార్యాలయం (ఒసిహెచ్ఎ) సోమవారం తెలిపింది. గాజాలో పరిమిత నీటి నిల్వలు మాత్రమే వుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే పారిశుధ్యం కూడా దారుణంగా వుందని, ముఖ్యంగా ఆస్పత్రుల్లో పరిస్థితి ఘోరంగా వుందని, దీనివల్ల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు చెలరేగే ప్రమాదముందని ఆందోళన వెలిబుచ్చింది. ఒకవేళ ఆరోగ్య సంక్షోభం తలెత్తిన పక్షంలో వెంటనే స్పందించేందుకు వీలుగా లెబనాన్ కు కీలకమైన వైద్య సరఫరాలను పంపించడాన్ని వేగిరపరిచినట్లు తెలిపింది.

'నీరు, విద్యుత్ లేక గాజా ఉక్కిరిబిక్కిరి అవుతోంది, ప్రస్తుత తరుణంలో ప్రపంచం తన మానవత్వాన్ని మరిచిపోయినట్లు కనిపిస్తోంది.' అని ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా శరణార్థుల కమిషనర్ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) జనరల్ ఫిలిప్ లాజారిని వ్యాఖ్యానించారు.

వైమానిక దాడుల వల్ల రాఫా క్రాసింగ్‌ను మూసివేశారు. కాగా ఒప్పందానికి అమెరికా మధ్యవర్తిత్వం నెరపడం కోసం ప్రయత్నిస్తోంది. కాగా, ఇప్పటివరకు ఇజ్రాయిల్ దాడుల్లో గాజాలో 2670 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. వీరిలో నాల్గోవంతు మంది చిన్నారులే, మరో 10వేల మంది గాయపడ్డారు. ఇంకో వెయ్యిమంది గల్లంతయ్యారు. వీరు శిధిలాల కింద చిక్కుకుని వుంటారని భయపడుతున్నారు.

కాల్పుల విరమణ లేదు

రాఫా సరిహద్దు క్రాసింగ్‌కు అనుమతించేందుకు గాజాలో కాల్పుల విరమణ జరిగిందని వచ్చిన వార్తలను ఇజ్రాయిల్ తోసిపుచ్చింది. ఈ మేరకు ప్రధాని బెంజామిన్ నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటన చేస్తూ, 'గాజాకు సాయమందేందుకు, విదేశీయులను తరలించేందుకు ప్రస్తుత తరుణంలో ఎలాంటి కాల్పుల విరమణ లేదు' అని స్పష్టం చేసింది. అంతకుముందు రాఫా తెరిచేందుకు ఒప్పందం కుదిరిందంటూ ఈజిప్ట్ భద్రతా వర్గాలు తెలిపాయని వార్తలు వెలువడ్డాయి. దక్షిణ గాజాలో కాల్పుల విరమణకు ఈజిప్ట్, అమెరికా, ఇజ్రాయిల్ అంగీకరించాయని ఆ వార్తలు తెలిపాయి. పలు గంటల పాటు ఈ కాల్పుల విరమణ వుండవచ్చని కానీ కచ్చితంగా ఎప్పుడు ప్రారంభమయేది తెలియదని పేర్కొన్నాయి.

హమాస్ చెరలో 199 మంది బందీలు

హమాస్ అదుపులోకి తీసుకున్న వారు 199మంది వున్నారని ఇజ్రాయిల్ మిలటరీ సోమవారం స్పష్టం చేసింది. ఆ 199 బందీల కుటుంబాలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నామని సైనిక ప్రతినిధి డేనియల్ హగారి మీడియాకు తెలిపారు. అంతకుముందు 155 బందీలని ప్రకటించింది. ఇజ్రాయిలీలతో పాటూ విదేశీయులు కూడా బందీల్లో వున్నారు.

తక్షణమే బందీలను విడిచిపెట్టి గాజాకు మానవతా సాయాన్ని అందేలా చూడాల్సిందిగా యుఎన్ చీఫ్ విజ్ఞప్తి చేశారు. అరబ్ లీగ్ చీఫ్ కూడా ఇదే విజ్ఞప్తి చేశారు.

విద్యుద్ఘాతానికి గురై అన్‌మ్యాన్డ్ ఉద్యోగి మృతి

నవతెలంగాణ-గణపురం



సబ్ స్టేషన్ ఆపరేటర్ నిర్లక్ష్యంతో విద్యుద్ఘాతానికి గురై విద్యుత్ స్తంభం పోల్‌పై నుంచి కిందపడి తీవ్ర గాయాల పాలైన అన్ మ్యాన్డ్ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఆదివారం జరిగింది. అన్‌మ్యాన్డ్ ఉద్యోగి జనగాని కిరణ్ (32) గణపురం మండలం అప్పయ్యపల్లి సమీపంలోని మోరంచ వద్ద ఎల్‌సీ తీసుకుని కరెంటు స్తంభం ఎక్కాడు. ట్రాన్స్‌ఫార్మర్ హెడ్ ఫ్యూజ్ వైర్ వేస్తుండగా విద్యుద్ఘాతానికి గురయ్యాడు. దాంతో కిరణ్ విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడటంతో తల, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో వరంగల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు శాంక్షన్ చేయాలి

- డీహెచ్‌కు జీవో 142పై టీఎంఎల్టీఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అర్బన్ హెల్త్ సెంటర్లు 235కు గానూ ఒక్కో దాంట్లో రెండు చొప్పు పోస్టులను మంజూరు చేయాలని తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ (టీఎంఎల్‌టీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ నిజాముద్దీన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిశంకర్, కంచర్ల శ్రీకాంత్, విజయభాస్కర్, చంద్రశేఖర్, మోహన్‌రావు తదితరులు సోమవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించారు.

300 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్, పరారీలో ముగ్గురు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు గంజాయి అక్రమ రవాణా పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాలోని ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, ఎల్కతుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారి నుంచి రూ.75 లక్షల విలువగల 300 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని వూన్, కార్గావ్ జిల్లాకు చెందిన కోలి రాజా వర్మ, మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లా అకులోదేడకు చెందిన పార్థిల్ నామ్‌దేవ్‌ని అరెస్టు చేశారు. ముఠా సభ్యుల్లోని మరో ముగ్గురు రాహుల్ సబులే, శుభం గోలీరామ్ సబులే, శేషుకుమార్ పరారీలో ఉన్నారు. వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ వెల్లడించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో నిందితులిద్దరు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో 300 కిలోల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని రెండుకిలోల ప్యాకెట్ల రూపంలో తయారు చేసి డీసీఎం వ్యాన్‌లో తరలించేందుకు సిద్ధం చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి ప్యాకెట్లపై తాడిపత్రితో కప్పి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఎల్కతుర్తి మండలం పెంచికలపేట వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. డీసీఎంను తనిఖీ చేయగా గంజాయి రవాణా గుట్టు రట్టయింది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, కాజీపేట ఏసీపీ పి.డేవిడ్ రాజ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, ఎల్కతుర్తి సీఐ, ఎస్ఐలను, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, తదితరులను సీపీ అభినందించారు.

ఓటరు జాబితాపై స్పష్టత ఇవ్వాలి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపు, సవరించే ప్రక్రియకు సంబంధించి స్పష్టత ఇవ్వాలని సీపీఐ(ఎం), సీపీఐ, ఎస్పీ డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ కు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు, సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ.రాజా, ఎస్పీ ఎంపీలు రాం గోపాల్ యాదవ్, జావిద్ అలీ ఖాన్‌ల బృందం వినతి అందజేశారు. 2024 లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా 2023 జనవరి 6న, 2023 అక్టోబర్ 27న ప్రచురించే ఓటరు జాబితాలతో పాటుగా ఓటరు జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, సవరించడాలను రాజకీయ పార్టీలకు అందజేసి, జాబితాపై స్పష్టత ఇవ్వాలని కోరారు. "లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న శాసనసభ నియోజకవర్గాల్లోని ప్రతి బూత్ (పోలింగ్ స్థలం) ఓటరు జాబితాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా మేజిస్ట్రేట్ ప్రచురించారు. 2023 జనవరి 6 నుండి 2023 అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో పెద్ద సంఖ్యలో పేర్లు చేర్చబడ్డాయి. అలాగే చాలా పేర్లు తొలగించబడ్డాయి. చాలా పేర్లు సవరించబడ్డాయి. తొలగించిన పేర్లను ఇంటింటికీ వెళ్లి ధ్రువీకరించడం చాలా ముఖ్యం. దీని కోసం తొలగించబడిన పేర్ల జాబితా డ్రాఫ్ట్ రోల్ / మదర్ రోల్, జాబితాను చేర్చబడిన పేర్లతో పాటు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలి. ఇది చాలా అవసరం. ఎన్నికల సంవత్సరంలో ఓటరు జాబితాను సరిదిద్దడం చాలా ముఖ్యం. తద్వారా స్వేచ్ఛగా, నిష్పక్ష పాతంగా ఎన్నికల నిర్వహణకు ఆస్కారం ఉంటుంది" అని పేర్కొన్నారు.

అయితే ఓటరు జాబితాలో చేర్చిన పేర్ల జాబితా, తొలగించిన పేర్ల జాబితా, సవరించిన పేర్ల జాబితాను రాజకీయ పార్టీలకు ఇవ్వవద్దని ఆదేశాలు ఇచ్చారని, ఈఆర్‌వో ముద్రించకూడదని నిబంధనలు, సూచనలు ఇచ్చారని, ఇది దారుణమని అన్నారు. అయితే ఈఆర్‌వో జాబితాను ముద్రించడానికి, చేర్చిన, తొలగించిన, సవరించిన ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచడానికి నియమాలు, సూచనలు ఉన్నాయని తెలిపారు."లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎలాంటి రాజకీయ పార్టీల సమావేశం, చర్చలు లేకుండానే ఎలక్టోరల్ రోల్స్ 2023 మార్చిలో (పత్రం- 10, ఎడిషన్- 2) కేంద్ర ఎన్నికల సంఘం కొత్త మాన్యువల్‌ను విడుదల చేసింది. ఓటరు జాబితాలో చేర్చిన, సవరించిన, తొలగించిన పేర్లను మేము కోరుతున్నాము. అన్ని రాజకీయ పార్టీల పేర్లను చేర్చాలి. ఇది పార్టీలకు అందుబాటులో ఉంచాలి. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు-2024 స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించబడేలా పై సవరణలు, కొత్త నిబంధనలను రద్దు చేయాలి" అని కోరారు.

ప్రవళిక ఆత్మహత్యపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం : దాసు సురేశ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలవుతామనే ప్రవళిక ఆత్మహత్య ఉదంతాన్ని ప్రభుత్వం తొక్కి పెడుతున్నదని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ విమర్శించారు. ఆమె ఆత్మహత్యపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవళికది ప్రేమ వ్యవహారమనీ, గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తు చేయలేదన్న మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితమని తెలిపారు. ప్రభుత్వ అసమర్థతను ఒప్పుకోలేకనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. సీబీఐ విచారణ కోసం త్వరలోనే హైకోర్టులో పిటిషన్ వేస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి సమాజం అండగా ఉండాలని కోరారు.

కారు బేకార్..

(మొదటిపేజీ తరువాయి)

చెందుతుంది కానీ హైదరాబాద్ మాత్రం అభివృద్ధి చెందడం లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి కోసం బీజేపీ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో రెండుసార్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నిం చారు. కేసీఆర్ కుటుంబ సభ్యులే అధికారం చెలాయిస్తున్నారని, కుటుంబ పరిపాలనను అంగీకరించే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ధరణి పేరుతో అవినీతి జరిగిందన్నారు. ఈటల రాజేందర్‌ను మంచి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని వేల కోట్లు డబ్బులు ఖర్చు చేసినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పోకతప్పదని అన్నారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కేజీ టు యూనివర్సిటీ వరకు ఉచిత విద్యను బీజేపీ అందిస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఈటల జమునా రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ పాల్గొన్నారు.

కేసీఆర్ ఒక్కరి వల్ల తెలంగాణ రాలేదు

కేసీఆర్ ఒక్కరి వల్ల తెలంగాణ రాష్ట్రం రాలేదని, రాష్ట్ర ఏర్పాటులో యువకులదే ప్రముఖ పాత్ర అని రాజ్‌నాథ్‌సింగ్ రంగారెడ్డి జిల్లా సభలో అన్నారు. దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. పదేండ్ల కాలంలో రాష్ట్రంలో కుటుంబ అవినీతి పాలన సాగిందని విమర్శించారు. నిరుద్యోగులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకొని పరిక్షలు రాస్తే పేపర్ లీకేజీలు చేసి ఎంతో మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులయ్యారన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతి ఢిల్లీ వరకు పాకిందన్నారు. కాంగ్రెస్ పాలన పూర్తిగా స్కాంలతో కూడుకున్నదని ఆరోపించారు. ఈ సభలో కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి జవదేకర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ వాసుదేవ ఆచార్యను పర్యామర్శించిన సీఐటీయూ, వ్యకాస నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ ఎంపీ సీఐటీయూ అఖిల భారత మాజీ ఉపాధ్యక్షులు వాసుదేవ ఆచార్యను అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పరామర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని యాప్రాల్‌లో గల ఆచార్య ఇంటికి వారు వెళ్లారు. ఇటీవల మరణించిన ఆయన సతీమణి రాజ్యలక్ష్మి చిత్రపటానికి వారు పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాసుదేవ ఆచార్యకు ధైర్యం చెప్పారు. ఆయన ఆరోగ్య పరిస్థితుల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ప్రధానోపాధ్యాయులకు ఏజీ జీపీఎఫ్‌ను అనుమతించాలి

- ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి టీఎస్‌జీహెచ్ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రధానోపాధ్యాయులకు ఏజీ జీపీఎఫ్‌ను అనుమతించాలని టీఎస్‌జీహెచ్ఎంఏ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె రామకృష్ణారావును సోమవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజు గంగారెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రధానోపాధ్యాయుల పోస్టులను మల్టీజోన్ క్యాడర్‌గా రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అనుగుణంగా ప్రభుత్వం 317 జీవో ద్వారా నిర్ణయించిందని తెలిపారు. మల్టీజోన్-1 పరిధిలో 19 జిల్లాలు, మల్టీజోన్-2 పరిధిలో 14 జిల్లాలున్నాయని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుల బదిలీల్లోనూ, స్కూల్ అసిస్టెంట్లు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందారని తెలిపారు. బదిలీలు, పదోన్నతులు పొందిన ప్రతిసారి జిల్లా స్థాయిలోని జెడ్పీ జీపీఎఫ్ అకౌంట్‌లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చుకోవడం వ్యయ ప్రయాసలు, వృథా కాలయాపనతో కూడుకున్న అంశమని వివరించారు. అకౌంట్ల బదిలీ అయ్యేంత వరకు మిస్సింగ్ క్రెడిట్లుగా మారే అవకాశముందని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు మిస్సింగ్ క్రెడిట్లుగా మారి ఉపాధ్యాయులు, ఉద్యోగులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు 010 ద్వారా వేతనాలు పొందుతున్నారని వివరించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులను సకాలంలో చెల్లించాలని సూచించారు.

ఊచకోతలోనూ రాజకీయమేనా?

(మొదటిపేజీ తరువాయి)

గడపాల్సిన దుస్థితిలో సాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

పాలస్తీనా- ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధంపై ఈ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరిని వివిధ కోణాల నుండి పరిశీలిం చాల్సిన అవసరం ఉంది. దేశంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి వెనుక రాజకీయ ప్రయోజ నాలు ఉన్నాయన్న విషయం సుస్పష్టం. పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య ఘర్షణలు ప్రారంభం కాగానే హిందూత్వ వాదులు పెద్ద సంఖ్యలో ఇజ్రాయిల్‌కు మద్దతుగా సామాజిక మాధ్యమాలలో సందేశాలు పెట్టారు. పనిలో పనిగా అనేక ఆంగ్ల, హిందీ వార్తా ఛానల్స్ అత్యుత్సాహంతో యుద్ధ వార్తల సేకరణ కోసం తమ పాత్రికేయులను ఇజ్రాయిల్‌కు పంపా యి. సామాజిక మాధ్యమాలలో వచ్చే కథనాలు సరే సరి. ప్రధాన స్రవంతి మీడియా కూడా పనిగట్టుకొని ఇజ్రాయిల్‌కు మద్దతుగా ప్రచారం సాగిస్తోంది. మణిపూర్ మారణహోమం మాత్రం ఈ మీడియాకు పట్టడం లేదు. పశ్చిమాసియాలో జరుగుతున్న ఘర్షణలకే భారతీయ ఛానల్స్ ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమే మంటే ఈ మీడియా సంస్థలన్నీ మోడీ, బీజేపీలకు వంత పాడుతున్నాయి. కేంద్రం తీసుకున్న వైఖరి సరైనదేనంటూ కితాబు ఇస్తున్నాయి.

మారిన విదేశాంగ విధానం

పాలస్తీనా విషయంలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిలో మోడీ ప్రభుత్వం మార్పు తీసుకొచ్చింది. 1930లలో ఘర్షణలు ప్రారంభమైనప్పుడు కాంగ్రెస్ పార్టీ పాలస్తీనా వాదనలను సమర్థించింది. తద్వారా మన దేశంలో నివసిస్తున్న ముస్లింల మనోభావాలను గౌరవించింది. 1980లలో రాజీవ్ గాంధీ ప్రధాని అయిన తర్వాత ఇజ్రాయిల్‌తో ఆయన బలమైన సంబంధాలు నెలకొల్పారు. అయినప్పటికీ పాలస్తీనా ఏర్పాటుపై భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. మోడీ ప్రధాని అయిన తర్వాత పాలస్తీనాలో పర్యటించారు కూడా. అయితే ముస్లింల మనోభావాలను ఆయన ఎన్నడూ గౌరవించిన పాపాన పోలేదు. బీజేపీకి కావాలంటే హిందువుల ఓట్లు ముస్లిం వ్యతిరేకతే ఆధారం అని ఆయనకు తెలుసు. కాబట్టి ఇజ్రాయిల్‌కు బాసటగా నిలుస్తున్నారు.

ఓటర్లపై ప్రభావం ఉంటుందా?

ప్రజల మద్దతు పొందడంలో సైద్ధాంతిక పోరు కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇజ్రాయిల్-పాలస్తీనా ఘర్షణలు భారత ఓటర్లపై ప్రభావం చూపుతాయా లేదా అన్నది మాత్రం ఇంకా అస్పష్టంగానే ఉంది. సామాజిక మాధ్యమాలలో మాత్రం దీని ప్రభావం బలంగానే ఉండవచ్చు. ఏదేమైనా భారత ఓటర్లు విజ్ఞులు. ఏ పార్టీ విధానం ఏమిటో, రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రయోజనాలను ఎవరు తాకట్టు పెడతారో, ఎవరు దేశ ప్రయోజనాలను పరిరక్షిస్తారో వారికి బాగా తెలుసు. చిల్లర, సంకుచిత రాజకీయాలను ఓటర్లు ఛీకొడతారన్న వాస్తవం గతంలో పలు సందర్భాలలో రుజువైంది.

హిందూత్వ ఎజెండాతో ముందుకు...

ఒక్క మాటలో చెప్పాలంటే పాలస్తీనా-ఇజ్రాయిల్ ఘర్షణలను బీజేపీ తనకు అనుకూలంగా మలచుకుంటోంది. శవాల మీద పేలాలు ఏరుకోవడం అంటే ఇదే. మొన్నటి వరకూ దేశంలో కులగణన ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. పశ్చిమాసియా పరిణామం పుణ్యమా అని అది ఇప్పుడు వెనక్కి వెళ్లిపోయింది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఎక్కడో ఐదు వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న పాలస్తీనా, ఇజ్రాయిల్ ఘర్షణల పైనే చర్చ జరుగుతోంది. హిందూత్వ ఎజెండాను మరింత ముందుకు తీసి కెళ్లేందుకు, 'జాతీయ భద్రత' అనే పాచిక వేసేందుకు ఈ ఘర్షణలను బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఉదాహరణకు హమాస్ దాడి ప్రారంభమైన మరు నాడే బీజేపీ ఓ ట్వీట్ చేసింది. యూపీఏ ప్రభుత్వ పాలనలో ఇస్లామిక్ ఉగ్రవాద దాడులు జరిగిన విషయాన్ని అందులో ప్రస్తావించింది. అప్పటి నుండీ బీజేపీ తన పాచికలు వేస్తూనే ఉంది. పాలస్తీనాకు మద్దతు తెలిపిన ఓ ముస్లిం మత గురువును ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దానికి ముందే పాలస్తీనాకు మద్దతుగా ప్రదర్శన నిర్వహించినందుకు అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై కేసులు పెట్టారు. పాలస్తీనాకు మద్దతుగా నిలిచే వారిని విచారించి, కేసులు పెట్టాలని సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పోలీసులకు హుకుం జారీ చేశారు.

ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు

- వ్యవస్థాపక ప్రతిభ అభివృద్ధిలో ఐఐటీహెచ్ కీలకం
- దేశానికి యువ పారిశ్రామిక వేత్తలనందించాలి
- ఐఐటీ హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ ప్రారంభించిన తమిళిసై సౌందరరాజన్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



దేశంలో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఐఐటీ హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కంది మండలంలో ఉన్న ఐఐటీ హైదరాబాద్‌లో బీవీఆర్ మోహన్‌రెడ్డి స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు వినూత్నమైన, సాంతికేకతతో వారి ప్రతిభాపటవాలను చూపుతున్నారని కొనియాడారు. సాంతికేకంగా ఆకలితో ఉన్న యువకుల్ని ప్రోత్సహించడంలో బీవీఆర్ ఎస్‌సీఐఈఎన్‌టీ వంటి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశంలోని విద్యార్థులు ఉద్యోగ ప్రదాతలుగా ఉండాలని కోరారు. దేశానికి యువ, వినూత్న ప్రతిభావంతులైన పారిశ్రామిక వేత్తలను రూపొందించ డానికి బీవీఆర్ మార్గం చూపుతుందన్నారు. ఎస్‌సీఐఈఎన్‌టీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ఆవిష్కరణలు కొత్తతరం వ్యవస్థాపక నాయకత్వం వహిస్తున్న యుగంలో మనమున్నామన్నారు. అనేక స్టార్టప్‌లు సాంకేతకతను సద్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. దీని వల్ల వేలాది మందికి ఉపాధి ఏర్పడుతుందని తెలిపారు. బీవీఆర్ ఎస్‌సీఐఈఎన్‌టీ పాఠశాల, ఐఐటీహెచ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్‌తో పాటు బ్యాచిలర్స్, మాస్టర్స్, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్, పీహెచ్‌డీ ప్రొగ్రామ్స్, సర్టిఫికెట్ కోర్సులను ప్రోత్సహిస్తుందన్నారు. కొత్త వెంచర్ సృష్టి, వెంచర్ ఫైనాన్స్, మేధో సంపత్తి, చర్చల నైపుణ్యాలను సులభతరం చేస్తుందన్నారు. సవాళ్లను గుర్తించి పరిష్కారాలను రూపొందించే ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుందని చెప్పారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్‌లో బీవీఆర్ ఫౌండేషన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దేశాన్ని మార్చడానికి, వేలాది మంది పారిశ్రామిక వేత్తలను సృష్టించే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్ల, తదితరులు పాల్గొన్నారు.


ఐద్వా ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య పార్కు వద్ద బతుకమ్మ వేడుకలు...


టీపీఎస్‌కే ఆధ్వర్యంలో...


అంబర్‌పేట్‌లో దర్బా ఆడుతూ....

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

కార్మికుల బాగోగులపై మ్యానిఫెస్టోల్లో చేర్చాల్సిందే

రూ.26వేల కనీసవేతనం అమలుపై స్పష్టతనివ్వాలి

- సంఘటిత, అసంఘటిత సమస్యల పరిష్కారంపై హామీనివ్వాలి
- 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల సవరణపై స్పందించాలి
- సీఐటీయూ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఉద్యోగ, కార్మిక సంఘాల నేతల డిమాండ్
- వర్కర్స్ మ్యానిఫెస్టో విడుదల.. 18న ఆయా పార్టీలకు అందజేత



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర జనాభాలో 30 శాతానికిపైగా ఉన్న కార్మికులకు రూ.26 కనీస వేతనం అమలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్, సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల మిగతా సమస్యల పరిష్కారంపై ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోల్లో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తమ మ్యానిఫెస్టోల్లో కార్మికుల బాగోగులు, మెరుగైన జీవనం కోసం తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే విషయాన్ని అన్ని పార్టీలూ ప్రకటించేలా ఒత్తిడి తెస్తామన్నారు. ఈనెల 18 నుంచి ఆయా పార్టీల మ్యానిఫెస్టో రూపకల్పన కమిటీలకు తాము రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టో అందజేస్తామని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అనేక అంశాలపై చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టో రూపొందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ జీఓలను సవరించడం, విడుదలైన 5 జీఓలకు గెజిట్ జారీ చేయడం, కనీస వేతనం రూ.26 వేలు అమలు ఎప్పటిలోగా చేస్తామనే దాన్ని పార్టీలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి వివిధ శాఖలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్‌పైనా స్పష్టతివ్వాలన్నారు. సమాన పనికి - సమాన వేతనం అమలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గడువులోపు పీఆర్సీని 30 శాతంగా ఫైనలైజ్ చేయడం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఐఆర్ ఇవ్వడం అంశాలను పొందుపర్చాలని కోరారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించి సామాజిక భద్రత చట్టాలను అమలు చేసేలా నిర్ణయం ప్రకటించాలన్నారు. స్థానిక సంస్థల్లో పనిచేసే గ్రామ పంచాయితీ, మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచడం, ఉద్యోగ భద్రత కల్పించడం, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర శాసనం చేయడం, వారికి పెన్షన్ నెలకు రూ.7 వేలు చెల్లించడం, మందుల ధరలు తగ్గించడం, మందులు, మందుల తయారీ పరికరాలపై జీఎస్టీ ఎత్తివేయడం, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, బీడీ పరిశ్రమకు నష్టదాయకమైన కోప్టా చట్టాన్ని రద్దు చేయడం వంటి అంశాలపై అన్ని పార్టీలూ తమ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

మూసేసిన పరిశ్రమలను తెరిపించడం, సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించడం, సింగరేణి లాభాల్లో పర్మినెంట్ ఉద్యోగులకు వాటాగా బోనస్ చెల్లిస్తున్నట్లుగానే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాల వాటాను చెల్లించడంతో పాటు మరికొన్ని అంశాలను వర్కర్స్ మ్యానిఫెస్టోలో చేర్చామనీ, వీటిన్నింటికీ అన్ని పార్టీలూ తమ మ్యానిఫెస్టోల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్డీ. చంద్రశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌కే. బోస్, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్ యాదవ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె. వెంకటేష్, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వంగూరు రాములు, బీడీఎల్ ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి. సత్తయ్య, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు జీఆర్.రెడ్డి, హెచ్ఆర్‌జీబిఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. సుబ్బారావు, టీఎంఎస్ఆర్‌యు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. భానుకిరణ్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. శ్రీకాంత్, సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కవిత, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అనురాధ, శివబాబు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ఎస్ఆర్ఏ ప్రసాద్, రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఎం. చంద్రమోహన్, హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రావణ్‌కుమార్, మీనా తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ దరఖాస్తు గడువు పొడిగించాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ)కి దరఖాస్తు చేసే గడువును వారం రోజులు పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సవరణకు అవకాశం కల్పించాలని విద్యాశాఖను కోరారు. ఈనెల 20 వరకు పరీక్ష ఫీజు, 21 వరకు దరఖాస్తు సమర్పణకు గడువుందని తెలిపారు. సాంకేతికపరమైన సమస్యలు రావడం, ఇతర తప్పులతో అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. డీఎస్సీ వెబ్‌సైట్ సర్వర్ డౌన్ కావడం వల్ల ఇప్పటి వరకు లక్ష మంది అభ్యర్థులు కూడా దరఖాస్తు చేయలేదని వివరించారు. మరో లక్ష మందికిపై అభ్యర్థులు దరఖాస్తు చేయాల్సి ఉందని తెలిపారు. అందుకే దరఖాస్తు గడువును పెంచడంతోపాటు సవరణకు అవకాశం కల్పించాలని కోరారు. రాతపరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 20 నుంచి 30 వరకు నిర్వహించాలనుకున్న డీఎస్సీ రాతపరీక్షలను విద్యాశాఖ వాయిదా వేసిన విషయం తెలిసిందే. 5089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతనెల ఎనిమిదో తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

నూతన అధ్యాపకులకు మే వేతనాలు చెల్లించాలి

- ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి టీజీజేఎల్ఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 'ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న మే వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శికి ఆన్‌లైన్ ద్వారా వినతి పత్రాన్ని ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం పంపించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను మేలో క్రమబద్ధీకరించారని గుర్తు చేశారు. ఈ క్రమబద్ధీకరణ జరిగిన నూతన అధ్యాపకులకు ఆ నెల వేతనాలు ఇంతవరకు అందలేదని వివరించారు. సుమారు రెండు వేల మందికి పైగా టోకెన్ నెంబర్లు వచ్చి ఈ-కుబేర్‌లో పెండింగ్ చూపిస్తున్నాయని తెలిపారు. ఆర్థిక శాఖ కార్యదర్శి వెంటనే జోక్యం చేసుకుని ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న నూతన అధ్యాపకుల మే వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే సత్యవతి మృతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్


(ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు కుంజా సత్యవతి ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భద్రాచలంలోని ఆమె నివాసంలో తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కుంజా సత్యవతి 2009లో కాంగ్రెస్ పార్టీ భద్రాచలం అభ్యర్థిగా గెలుపొందారు. సీపీఐ(ఎం)లో ప్రారంభమైన ఆమె రాజకీయ ప్రస్థానంలో పార్టీ తరఫున వైస్ ఎంపీపీగా పనిచేశారు. 2009లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆకర్షలో సీపీఐ(ఎం) పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె ఓటమిపాలయ్యారు. మారిన రాజకీయ సమీకరణలో 2018లో బీజేపీ తరఫున పోటీ చేసి మరోసారి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, భద్రాచలం నియోజవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కుంజీ సత్యవతి సొంత ఊరు వీఆర్‌పురం మండలం ఒడ్డుగూడెం గ్రామం. సత్యవతి మృతదేహానికి సీపీఐ(ఎం) నాయకులు, స్థానిక శాసన సభ్యులు పోదెం వీరయ్య, ప్రముఖులు నివాళి అర్పించారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి.. 20 ఏండ్లు జైలు శిక్ష

నవతెలంగాణ-గణపురం

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి 20 ఏండ్లు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ పోక్సో స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన యువకుడు కీర్తి నరేష్, మండలంలోని మరో గ్రామానికి చెందిన బాలికపై 1-9-2022న లైంగికదాడి, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ సెల్ఫీ ఫొటోలు దిగి, బ్లాక్ మెయిల్ చేసి, చాటింగ్ చేయాలని వేధించాడు. లేదంటే ఫొటోలను యూట్యూబ్, వాట్సాప్‌లో పెడతానని భయభ్రాంతులకు గురి చేసి బాలికను శరీరకంగా హింసించాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అభినవ్ కేసు నమోదు చేసి నరేష్‌ను రిమాండ్‌కు తరలించారు. అనంతరం అప్పటి చిట్యాల సీఐ పులి వెంకట్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి కోర్టులో ఆధారాలు సమర్పించారు. ఈ కేసులో వాదనలు విన్న పోక్సో స్పెషల్ జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నారాయణ బాబు తీర్పు వెలువరించారు. వాదనలు వినిపించిన పీపీ విష్ణువర్ధన్ రావు, సాక్షులను బ్రీఫ్ చేసిన చిట్యాల సీఐ వేణు చందర్, గణపురం ఎస్ఐ సాంబమూర్తి, సాక్షులను కోర్టులో హాజరు పరిచిన కోర్టు కానిస్టేబుల్ శ్వేతను జిల్లా ఎస్పీ కిరణ్ కారే అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడితే చట్టపరంగా శిక్ష తప్పదని హెచ్చరించారు.


రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక రింగు రోడ్డు పోలీస్ చెక్ పోస్ట్ వద్ద మంత్రి గంగుల కమలాకర్ కాన్వాయ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు



పవిత్రంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో

- ఇప్పుడు మాకోసం పనిచేయండి.. ఐదేండ్లు మీకోసం చేస్తాం : కార్యకర్తలతో మంత్రి కేటీఆర్
- సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్

భగవద్గీత, బైబిల్, కురాన్‌లాగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పవిత్రంగా ఉందని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. సిరిసిల్లలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని సోమవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 నుంచి 95 సీట్లు గెలిస్తేనే మనకు ముఖం తెలివి ఉంటుందని, ఈ 45 రోజులు ప్రతి ఒక్క కార్యకర్త మాకోసం పనిచేయాలని, ఆ తర్వాత ఐదేండ్లు మీకోసం పనిచేస్తామని అన్నారు.

కలెక్టరేట్‌లోని ప్రజావాణిలాగా పార్టీ జిల్లా కార్యాలయంలోనూ ప్రతివారం దరఖాస్తులు తీసుకొని సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ భవనంలోనే మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ భవన్ ఏర్పాటు చేస్తామని, వ్యక్తులు శాశ్వతం కాదని వ్యవస్థ శాశ్వతం కావాలన్నారు. నాయకులు ఒకరికొకరు పంతాలకు వెళ్లకుండా పార్టీ గెలుపు కోసం పని చేయాలని కోరారు.

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతున్న తీరు చాలా విడ్డూరంగా ఉందని, కాంగ్రెస్ పథకాలను తాము కాపీ కొట్టామనడం సిగ్గుచేటన్నారు. ఎవరి పథకాలను ఎవరు కాపీ కొట్టారో ప్రజలకు తెలుసన్నారు. సీఎం కేసీఆర్ పథకాలను దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే కాపీ కొట్టారన్నారు. కేసీఆర్ ఏది చెప్పినా అది ఎంత కష్టమైనా చేసి చూపిస్తారన్నారు.

ఢీకొట్టేవారికే..

రెండవ విడత అభ్యర్థుల జాబితాపై కాంగ్రెస్ కసరత్తు

- అధికార పార్టీ అభ్యర్థికి ధీటైన వ్యక్తుల కోసం వేట
- ఉమ్మడి రంగారెడ్డిపై పట్టు సాధించేందుకు వ్యూహం
- అయోమయంలో ఆశావహులు

నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ఈ ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ గెలుపు గుర్రాలనే బరిలోకి దింపుతోంది. అధికార పార్టీ అభ్యర్థులను ఢీకొట్టే వారికే టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో మొదటి విడతలో ఆరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. మిగిలిన ఆరు స్థానాలకు ఖరారు చేయాల్సి ఉంది. అయితే ఈ స్థానాల్లో అధికార పార్టీ నుంచి బలమైన అభ్యర్థులున్నారు. దాంతో వీరిని ఎదిరించే వారికే టికెట్ కేటాయించేందుకు అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులు మూడు నుంచి నలుగురు ఉండటంతో జల్లెడ పడుతోంది. వివిధ కోణాల్లో సర్వేలు నిర్వహిస్తోంది. ఈ సర్వేల ఆధారంగా అభ్యర్థుల బలబలాలు గుర్తించి టికెట్



కేటాయించనుంది. అయితే తమ అభ్యర్థులు బలహీనంగా ఉంటే ఇతర పార్టీల్లో బలమైన వీరిని పార్టీలోకి తీసుకొచ్చి వారికి టికెట్ కేటాయించాలని పార్టీ భావిస్తున్నట్టు సమాచారం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో రంగారెడ్డి జిల్లాపై పట్టుసాధింపునకు ఏఐసీసీ ప్రత్యేక చొరవ తీసుకున్నట్టు తెలుస్తోంది. నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిగా ఏఐసీసీ సభ్యులను కేటాయించింది.

జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులను ఢీకొట్టే సత్తా ఉన్న అభ్యర్థుల కోసం పదుల సంఖ్యలో సర్వేలు చేసింది. అభ్యర్థుల జాబితాను గుర్తించి అందులో నుంచి స్క్రినింగ్ చేసి బలమైన నాయకులను బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల మొదటి విడతలో భాగంగా జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు టికెట్లు కేటాయిం చింది. మరో ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మహేశ్వరం, ఇబ్రహీం పట్నం, రాజేందర్‌నగర్, శేరిలింగం పల్లి, ఎల్బీనగర్, తాండూరు నియోజక వర్గాలకు అభ్యర్థులను కేటాయించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు బలంగా ఉండటంతో వారిని ఢీకొట్టే నాయకులను రంగంలోకి దింపేందుకు కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నం చేస్తోంది.

దీనికి తోడు టికెట్ల ఆశ చూపి ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకున్న కాంగ్రెస్‌కు టికెట్ల కేటాయింపులో తలకు మించిన భారంగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు మంది ఆశావహులు ఉండటంతో ఎవరికి సర్ది చెప్పాలో తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది.

పైగా భంగపడే వారు కాంగ్రెస్‌కు ఎక్కడ కొర్రీలు పెడతారోనని తర్జనభర్జన పడుతున్నారు. అయితే ఆశావాహులను బుజ్జగించేందుకు టీపీసీసీ ప్రత్యేక టీమ్ వేసినట్టు తెలుస్తోంది. టికెట్ల కేటాయింపులో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని చేధించి గెలుపు గుర్రాలనే బరిలో దింపాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది.

చేనేత సంక్షేమానికి హామీ ఇవ్వాలి

చేనేత కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చేనేత కార్మికుల కోసం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలపై ఆయా రాజకీయ పార్టీలు అధికారంలోకి వస్తే స్పష్టమైన హామీ ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతికుమార్ అధ్యక్షతన ఆయా రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో చేర్చే విధంగా విధాన రూపకల్పన కోసం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, చేనేత పరిశోధకులు డి. నరసింహారెడ్డి , , అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షులు కందగట్ల స్వామి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ , చేనేత కార్మిక సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీనరసయ్య, చేనేత వర్గాల చైతన్య వేదిక కన్వీనర్ చిక్క దేవదాస్, కందగట్ల బిక్షపతి, గణేష్ ,మురళి, కూరపాటి రాములు, రాజేష్, సత్యనారాయణ, ఉప్పలయ్య, ధనలక్ష్మి, రమణ తదితరులు మాట్లాడారు. సమావేశంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా



చర్చించారు.

చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థను నిర్వీర్యం చేశాయని విమర్శించారు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించే విధానంలో భాగంగానే ఇలా చేశారని తెలిపారు. పదేండ్ల నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా అధికారులు పెత్తనం చేయడమేంటని ప్రశ్నించారు. రాజకీయాల జోక్యం కూడా పెరిగిపోయి ఎన్నికల్లేక ఇబ్బందులు పెరిగాయని చెప్పారు. చేనేత కార్మికుల కోసం ఉన్న రకరకాల బీమాలను ఎత్తేస్తూ కేంద్ర ప్రభుత్వం మరీ దారుణంగా వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఎత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరితో పాటు కేంద్ర ప్రభుత్వ వైఖరి కోసం జాతీయ స్థాయిలో నిలదీయాలని సూచించారు.

చేనేత పరిశోధకులు డి.నర్సింహారెడ్డి మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా రాజకీయ పార్టీల కోసం తయారు చేసే హరిత మేనిఫెస్టోల్లో చేనేత అభిమానిగా ఆ అంశాన్ని కూడా చేరుస్తున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలకు మేనిఫెస్టోల్లో చేర్చేందుకు సూచనలు చేయడంతో పాటు చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వద్ద డిమాండ్లు పెట్టాలని సూచించారు. హెచ్ఎండీఏ ఏర్పాటుతో హైదరాబాద్ పరిధి విస్తరించి ఆ పరిధిలోకి చేనేత గ్రామాలు కూడా వచ్చాయనీ, అందుకే చేనేత జోన్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని తెలిపారు. సహకార, ప్రయివేటు వ్యవస్థల మధ్య ప్రభుత్వం సగటు చేనేత కార్మికునికి ఎలా చేయూతనందిస్తుందో స్పష్టం చేయాల్సిన అవసరముందన్నారు. అపెక్స్ సహకార సంస్థ ఏర్పాటు చేసి ఉన్న సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. చేనేత కార్మికుల కోసం బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ఏమి చేయలేదని విమర్శించారు. చేనేత కార్మికులకు కనీసం రూ.10 వేల కోట్ల రుణం ఇవ్వాల్సిన అసరముందని తెలిపారు. బీడీ కార్మికులకు ఇచ్చినట్టు చేనేత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంపాదకీయం

ఎరలు ఎన్ని రకాలో..!

సినిమాల్ని చూసి రాజకీయ నాయకులు డైలాగులు కొడ్తరో, రాజకీయ నాయకుల్ని స్టడీ చేసి సినిమాల్లో డైలాగులు రాస్తున్నారో తెలీదు కాని నవంబర్ 30న జరిగే వార్ వన్‌సైడేనని బీఆర్ఎస్ బాస్ చెప్తూనే ఉన్నారు. ఓట్ల యుద్ధంలో క్షీర, నీరన్యాయం చెప్పడానికి ఓటర్లందరూ హంస లవ్వాల్సిందే!

మహా భారత యుద్ధంలో పద్మవ్యూహాలు, గరుడ వ్యూహాలు, నాగ వ్యూహాలు పన్నేవారనేది పురాణ గాథ. ఆధునిక కాలంలో విమానాల ద్వారా 'కార్పెట్ బాంబింగ్' వచ్చిన తర్వాత ఇరాక్ దగ్గరున్న స్కడ్ మిస్సైల్స్ వేస్ట్ కాలేదా? అమెరికా సద్దాం హుస్సేన్‌ను చంపకుండా ఆపలేకపోయింది కదా!? ఆ సంగతులెలా ఉన్నా, ఇపుడొచ్చింది ఓట్ల యుద్ధం. దీన్లో ప్రధాన పార్టీలు పాలనకు సంబంధించిన అంశాలు కాకుండా ప్రజలపై తాయిలాలు విసరడానికి పోటీ పడితే జనం ఐదేళ్ళకొకసారి విరిసే 'చంద్రు'ని వెన్నెల కోసం ఎదురు చూసే చకోర పక్షులవరా? ప్రజల్ని, ముఖ్యంగా పేదల్ని కురిసే వాన చినుకులకై నిరీక్షించే అల్పప్పలుగా మిగల్చాలని పాలకుల పద్మవ్యూహం. అభిమన్యులుగా దాన్లో దొరికిపోయి, చనిపోతారో సదరు పద్మం ఉరఫ్ కమలం రేకులు వెనక నుండి కమ్ముకోకుండా ఒక్కో దాన్ని రాలగొట్టుకుంటూ జనం ధనుంజయునిలా ముందుకు సాగుతారని ఆశిద్దాం.

> రాష్ట్రంలో పేరుకుపోయిన కార్మికుల, వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల సమస్యలు. అసలు కౌలు రైతుల్ని గుర్తించనే గుర్తించనని తెగేసి చెప్పిన కేసీఆర్ 'గుండె ధైర్యం' గొప్పదే! వారి సంఖ్య తెలంగాణలో16 లక్షలు. 30 శాతం భూమి వారి అధ్వర్యంలోనే ఉంది. విదేశాల్లోని భూ యజమానులు, ఉద్యోగాలు చేసుకునే సార్లకు రైతు బంధు అందుతుండగా కౌలుదారులకివ్వనని భీష్మించుకోవడం ఏ విధంగా సబబో గులాబీ దళపతి చెప్పాలి.



కాని గులాబీ శ్రేణుల వ్యవహారం ఆ విధంగా కనపడటం లేదు. తన సంక్షేమ చర్యలు, అంటే పంచే తాయిలాలు తమని అందలమెక్కిస్తాయని బాస్‌కు విశేషమైన నమ్మకం. ఆ తారక మంత్రం జపిస్తే బొందితో కైలాసానికి పోవడం ఖాయమని ప్రగాఢ విశ్వాసమాయనకి. శిష్య పరమాణువులకు నిరంతరం నూరిపోసేది కూడా అదే. కానీ, మెదక్ పార్లమెంటు సభ్యుడు దౌల్తాబాద్‌లో ఆరెస్సెస్ కార్యక్రమంలో పాల్గొంటూ హిందూత్వ పరిరక్షణలో తాను భాగస్వామినౌతానని ప్రవచించారు. గులాబీ చెట్టును లోపలి నుండి చెద పురుగులు డొల్ల చేస్తున్నాయి. పారాహుషార్! పెస్ట్ కంట్రోల్ చర్యలకుపక్రమించకపోతే బీజేపీ గురించి మీరేసే రంకెలకు అర్థమే లేకుండా పోతుంది. హిందూత్వ పరిరక్షణంటే సదరు ఎంపీకి ఏమర్థమైందో గానీ, ఆరెస్సెస్ వారి అర్థమేమంటే దేశంలో కులవ్యవస్థను పునరుజ్జీవింప చేయడం. అగ్ర కులాధిపత్యానికి తెర తీయడం. దానికి అడ్డుగా ఉన్న భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడం. ఈ విషయాలను అర్థం చేసుకోకుంటే అభిమన్యుని పాత్ర విజయవంతంగా పోషించే పనిలో బీఆర్ఎస్ ఉందనుకోవాల్సి వస్తుంది.

రాష్ట్రంలో మత ఘర్షణలు లేకుండా చూడ గలగడం చిన్న విషయమేమీ కాదు. అందుకు బీఆర్ఎస్ నాయకత్వాన్ని అభినందించాల్సిందే. అయితే కేవలం పాలనాపరమైన చర్యల ద్వారానే లౌకికవాదం రాష్ట్రంలో పరిఢవిల్లదు. ఆరెస్సెస్‌కు అంటకాగే నేటి దుబ్బాక అభ్యర్థి లాంటి వారు ఎందరున్నారో?! లేకుంటే దుబ్బాక లో ప్రస్తుతం బీజేపీ శాసనసభ్యుడుంటేనేమి, బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనేమి? రాష్ట్రానికి పొంచి ఉన్న ఈ ప్రమాదం గులాబీ దళపతి గుర్తించారో లేదో?

కీలక విషయం రాష్ట్రంలో పేరుకుపోయిన కార్మికుల, వ్యవసాయ కార్మి కుల, కౌలు రైతుల సమస్యలు. అసలు కౌలు రైతుల్ని గుర్తించనే గుర్తించనని తెగేసి చెప్పిన కేసీఆర్ 'గుండె ధైర్యం' గొప్పదే! వారి సంఖ్య తెలంగాణలో16 లక్షలు. 30 శాతం భూమి వారి ఆధ్వర్యంలోనే ఉంది. విదేశా ల్లోని భూ యజమానులు, ఉద్యోగాలు చేసుకునే సార్లకు రైతు బంధు అందుతుండగా కౌలుదారులకివ్వనని భీష్మించుకోవడం ఏ విధంగా సబబో గులాబీ దళపతి చెప్పాలి. సుమారు కోటి మంది కార్మికులకు కనీస వేత నాలు నిర్ణయమే చేయలేకపోతున్నదీ ప్రభుత్వం. గత 15 ఏండ్లలో కనీస వేతనాలు పెరిగుంటే ప్రభుత్వాలు విసిరే ముక్కల కోసం జనం వెంపర్లాడరు కదా! దళితులు, వారి సమస్యలు గుర్తించి దళిత బంధు స్కీం పెట్టడం మంచిదే. కాని అదే సర్వరోగ నివారిణి అయినట్లు చెప్పుకోవడం ఆశ్చర్యమేస్తుంది. రాష్ట్రంలోని 18 లక్షల దళిత కుటుంబాల్లోనూ ఇప్పటివరకు అందింది 30 వేల మందికి. 2023 -24 బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,700 కోట్లలోనూ నేటికి ఒక్క పైసా విడుదల కాలేదు. ఈ లెక్కన ఎన్ని ఏండ్లకి 18 లక్షల మందికి అందుతుందో గులాబీ నేతలు ఆలోచించాలి.

గొర్రెలు, బర్రెలు ఇవ్వడం ఓట్లు రాబట్టుకోవడం గతంలో ఇందిరమ్మ కాలంలోనూ జరిగాయి. 'ఊరికొక కోడి అంటే ఇంటికొక ఈక' అన్న నర్రా రాఘవరెడ్డి ఫేమస్ డైలాగు ఈ రాష్ట్రంలో బాగా ప్రాచుర్యం పొందింది. అయినా నేడు కౌలుదార్లను, వ్యవసాయ కూలీలను కూడా కాంగ్రెస్ గుర్తించడం కీలక విషయం. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇండ్లల్లో పని చేసుకునే మహిళలకు బాగా ఉపయోగడుతుందనడంలో ఆశ్చర్యం లేదు. హిమాచల్‌లో అధికారంలోకొచ్చిన మరుక్షణం సి.పి.ఎస్. ను కాంగ్రెస్ రద్దు చేసింది. రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో రద్దు చేశారు. కుల గణన చేపట్టామని మొన్న హైదరాబాద్‌లో జరిగిన సిడబ్ల్యూసీ నిర్ణయించింది. కొన్ని పాజిటివ్ వర్గ సమస్యలివి. మిగతావి ఆచరణలో చూడాలి. ఏమైనా మా మేనిఫెస్టోను మీరు కాపీ కొట్టారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒకర్నొకరు దుమ్మెత్తి పోసుకోవడం కంటే ప్రజలకి ఏ విధంగా మంచి పాలన అందిస్తారో చెప్పుకోవడం సబబుగా ఉంటుంది.

మెకార్థీయిజం - ప్రపంచీకరణ

'న్యూస్ క్లిక్'ను కేంద్ర ప్రభుత్వం వేటాడుతున్న తీరు చూస్తుంటే మన చిన్ననాటి 'పులి- మేక' కథ గుర్తుకొస్తోంది. ఒక పులి, ఒక మేక ఒకే నీటి ప్రవాహం దగ్గర దాహం తీర్చుకోడానికి చేరాయి. పులికి ఆ మేకను చంపడానికి ఒక సాకు కావాలి. అందుకని తాను తాగే నీటిని బురదమయం చేసేస్తోందని మేకపై ఆరోపించింది. కాని తాను ప్రవాహానికి దిగువన నిలబడి నీరు తాగుతుంటే ఎగువన ఉన్న పులి తాగే నీరు బురదమయం అవడానికి తానెలా కారణం అవుతానని ఆ మేక అడిగింది. అప్పుడు తాను తాగే నీటిని బురదమయం చేసింది ఆ మేక కాకపోయినా, ఆ మేక తండ్రి గతంలో తాను తాగిన నీటిని బురదమయం చేసిందని చెప్పి ఆ పులి తన దాడిని సమర్థించుకుంది.



ప్రభాత్ పట్నాయక్

కొన్ని నెలలుగా 'న్యూస్ క్లిక్'ను మోడీ ప్రభుత్వం వెంటాడుతోంది. ఆ సంస్థ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ ఆఫీసులో, ఇంటిలో కూడా ఢిల్లీ పోలీసులు వారాల తరబడి శోధించారు. ఏదైనా ఆర్థిక అవకతవక జరిగిన ఆధారం దొరుకుతుందేమోనని వారు వెతికారు. కాని ఎంత ప్రయత్నించినా 'న్యూస్ క్లిక్' మీద నేరారోపణ చేయడానికి వారికి ఏ విధమైన ఆధారమూ దొరకలేదు. అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఎందుకంటే 'న్యూస్‌క్లిక్' అటువంటి ఏ విధమైన అవకతవకలకూ పాల్పడలేదు. అందుచేత ఇప్పుడు పూర్తిగా కొత్త ఆరోపణకు పూనుకుంది ప్రభుత్వం. ఉగ్రవాదానికి పాల్పడిందన్నదే ఆ ఆరోపణ. డజన్ల కొద్దీ 'న్యూస్ క్లిక్' ఉద్యోగులను, వారికి వార్తలను అందించే విలేకరులను తెగ వేధించారు. ప్రబీర్ పుర్కాయస్థను, అమిత్ చక్రవర్తిని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద అరెస్టు చేశారు. ఈ చట్టం ఎంత దుర్మార్గమైనదంటే, ఆరోపణలు ఎంత హాస్యాస్పదంగా, అర్థరహితంగా ఉన్నప్పటికీ (ప్రస్తుతం ఈ కేసులో ఆ విధంగానే ఉన్నాయి కూడా) నిర్బంధం నుండి ఏ విధమైన ఉపశమనమూ అభించడం చాలా కష్టం.

ఆర్థిక నేరాలను ఆరోపించడంతో మొదలుబెట్టి ఇలా ఉన్నట్టుండి ఉగ్రవాదం ఆరోపణ వైపు ఫిరాయించడం ప్రభుత్వానికి స్వతహాగా తట్టిన ఆలోచన కాదు. 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో చాలా దుర్బుద్ధితో రాసిన ఒక వ్యాసం ప్రచురితమైంది. అందులో నెవెల్లిరాయ్ సింగం అనే ఒక సంపన్నుడైన అమెరికన్ పౌరుడు, చైనా ప్రభుత్వపు ప్రచార యంత్రాంగానికి చాలా సన్నిహితంగా ఉన్నాడని, అనేక మార్గాల ద్వారా చైనా ప్రభుత్వ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోడానికి భారీ మొత్తాలను ఖర్చు చేస్తున్నాడని, వాటిలో 'న్యూస్ క్లిక్' కూడా ఒకటని ఆ వ్యాసం ఆరోపించింది.

'న్యూయార్క్ టైమ్స్' వ్యాసం చాలా దుష్ట తలంపుతో రాసినటువంటిది. అమెరికాకు చెందిన ఏ చట్టమూ ఉల్లంఘించబడినట్టు అది చెప్పలేదు. చైనా ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యకలాపాలు చేపట్టినట్టు, అందులో సింగం వంటి వ్యక్తుల పాత్ర ఉన్నట్టు అన్యాపదేశంగా కొన్ని సూచనలు మాత్రం చేయగలిగింది. "నేను ఏ రాజకీయ పార్టీలోనూ సభ్యుడిని కాను. నేను ఏ రాజకీయ పార్టీ తరఫునా కాని, ఏ ప్రభుత్వం తరఫునా కాని, వాటి ప్రతినిధుల తరఫునా కాని, పని చేయడం, వారి నుండి ఆదేశాలను స్వీకరించడం లేదా ఆదేశాలను అమలు చేయడం అనే ప్రసక్తి లేదు. నేను పూర్తిగా నా వ్యక్తిగత విశ్వాసాలకు, దీర్ఘకాలంగా కలిగివున్న నా వ్యక్తిగత అభిప్రాయాలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరిస్తున్నాను" అని సింగం ఒక ఇ-మెయిల్‌ను 'న్యూయార్క్ టైమ్స్'కు పంపాడు. సింగం చేసిన ప్రకటనను 'న్యూయార్క్ టైమ్స్' నేరుగా ఖండించలేదు. సింగం ద్వారా గాని, అతని ద్వారా నిధులు పొందినట్టు ఆరోపణలకు గురైన ఏ సంస్థలు గాని అమెరికన్ చట్టాలను ఉల్లంఘించినట్టు నేరుగా ఆరోపించనూ లేదు (కెయిత్‌లిన్ జాన్‌స్టన్ ఆగస్టు 12, 2023న మంత్లీ రివ్యూలో రాసిన వ్యాసం ఈ అంశం మీద చాలా వివరాలను ఇచ్చింది). కాని 'న్యూయార్క్ టైమ్స్' చాలా విడివిడి ఘటనల వివరాలను తన వ్యాసంలో ప్రస్తావించింది. వాటిలో దేనిలోనూ సరుకు లేదు. ఆ వ్యాసం సింగం గాని, అతనితో లింకులు ఉన్నట్టుగా ఆరోపిస్తున్న సంస్థలు గాని ఏదైనా కుట్రలకు పాల్పడుతున్నట్టు ఆరోపించలేదు. కాని అ ఘటనలన్నింటినీ కలిపి చదివితే అంతర్జాతీయ స్థాయిలో చైనా ప్రభుత్వం పెద్ద స్థాయిలో కుట్రకు సన్నాహం చేసిందన్న భ్రమ కలుగుతుంది.

సింగం చేసిన చట్ట వ్యతిరేక చర్య ఏదీ లేదు. అతడితో సంబంధాలు కలిగి వున్నట్టుగా 'న్యూయార్క్ టైమ్స్' ఆరోపించిన సంస్థలు సైతం ఏ విధమైన చట్ట వ్యతిరేక చర్యలకూ పాల్పడుతున్నట్టు లేదు. చైనా ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో ఏవో ప్రచార కుట్రకు పాల్పడుతోందన్న 'న్యూయార్క్ టైమ్స్' ఆ కుట్రకు ఈ సంస్థలు గాని, సింగం గాని మద్దతు ఇస్తున్నట్టూ ఎక్కడా లేదు. కేవలం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని, మార్క్సిస్టు అవగాహనను ప్రదర్శించడం తప్ప వాళ్ల చేసిందేమీ లేదు. కాని 'న్యూయార్క్ టైమ్స్' ఆ సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరినే చైనా ప్రభుత్వ ప్రచార కుట్రగా చిత్రించింది. మెకార్థీ తరహాలో వేధింపుల పర్వానికి ఇటువంటి కుత్సితమైన వక్రీకరణలు నాందిగా ఉంటాయి. అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ గార్లండ్‌కు మార్కో రూబియో అనే సెనేటర్ ఒక లేఖ రాస్తూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న అమెరికన్ వామపక్ష గ్రూపుల కార్యకలాపాల మీద విచారణ చేపట్టాలని, ఆ సంస్థలన్నీ చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు కలిగి వున్నాయని, అమెరికాలో ఆ సంస్థలు అడ్డూ ఆపూ లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆరోపించాడు.

నిరాధారమైన ఆరోపణలను చేస్తే న్యాయపరంగా కేసుల్ని ఎదుర్కోవలసి వస్తుందని లాయర్లు సూచించినందువల్లనో ఏమో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కేవలం అన్యాపదేశంగా ఆరోపణలను చేయడం వరకే పరిమితం అయింది. కాని, మన ఢిల్లీ పోలీసులకి అటువంటి జాగ్రత్తలేమీ అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళ దగ్గర 'ఉపా' అనే ఒక ఆయుధం ఉంది. ఆ చట్టం కారణంగా, ఎవరి మీద ఏ విధమైన ఆరోపణలు చేసిన ప్పటికీ వాటిని రుజువు చేసే ఆధారాలను చూపవలసిన బాధ్యత పోలీసుల మీద లేదు. నెలల తరబడి, ఒక్కోసారి ఏళ్ళ తరబడి కూడా ఏ ఆధారాలనూ కోర్టుల ముందు ఉంచనక్కరలేదు. అందుచేత కేవలం 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో వచ్చిన వార్తను బట్టి (ఆ వార్తలో ఏ ఆధారాలూ లేకపోయినప్పటికీ) 'న్యూస్ క్లిక్' సంస్థ చైనా అనుకూల ప్రచారానికి పాల్పడుతోందని అర్థం లేని నిరాధారమైన ఆరోపణలకు పోలీసులు పూనుకున్నారు. నేను 'న్యూస్ క్లిక్'ను రెగ్యులర్‌గా చదువుతాను. చైనా ప్రభుత్వం అను సరించే వైఖరితో ముడిపడి వున్న అంశం ఏదీ అందులో నాకు కనిపించలేదు. అంతర్జాతీయ పరిణామాలను వామపక్ష, మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించడం మాత్రమే ఆ పత్రికలో చూస్తున్నాను. చైనా విప్లవం పట్ల ఆ పత్రికకు గౌరవం ఉంది. మూడో ప్రపంచ దేశాల్లో ఉండే వారిలో సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నట్టు చెప్పుకునే వారెవరికైనా చైనా విప్లవం పట్ల గౌరవం ఉండడం సహజం.

ఉదారవాద బూర్జువా వైఖరికి, మెకార్థీ తరహా ఫాసిస్టు వైఖరికి మధ్య అంత:సంబంధం ఈ సందర్భంలో మనకి కనిపిస్తుంది. 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ప్రపంచంలో అమెరికన్ సామ్రాజ్యవాదం సాగించే యుద్ధాలనన్నింటినీ బలపరుస్తూ వుంటుంది. అయినా, ఆ పత్రిక ఉదారవాద బూర్జువా దృక్పథాన్ని అనుసరించే పత్రికగానే పరిగణించబడుతూ వుంటుంది. ఉదారవాద బూర్జువా దృక్పథాన్ని బలపరిచేవారు సమాజంలో వ్యక్తం అయే భిన్నాభిప్రాయాలను, వాటిని స్వేచ్ఛగా ప్రచారం చేసుకునే హక్కును గుర్తిస్తారు. అటువంటి ప్రచారం చట్టాలకు లోబడి వుండాలని మాత్రమే వారు చెప్తారు. అటువంటి వైఖరిని అనుసరించే 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఈ మాదిరిగా వ్యాసాన్ని ప్రచురించడం మెకార్థీ తరహా వేధింపులను ప్రోత్సహించడమే ఔతుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక, యుద్ధ వ్యతిరేక వైఖరిని అనుసరించడం పట్ల ప్రతికూలతను ప్రదర్శించడం అంటే సమాజంలో ఫాసిస్టు తరహా శక్తులను ప్రోత్సహించడమే.

ఫాసిస్టు శక్తులు ప్రభుత్వ అధికారం చేపట్టినప్పుడు వామ పక్ష ప్రజాతంత్ర శక్తులను అణచివేయడానికి వారు ప్రయోగించే ఆయుధాలు అంతకు మునుపు అధికారంలో ఉండిన ఉదారవాద బూర్జువా ప్రభుత్వాలు రూపొందించినవే ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం అందరూ వ్యతిరేకిస్తున్న ఉపా చట్టం మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని ఉదారవాద బూర్జువా ప్రభుత్వ హయాంలోనే రూపొందింది. కేవలం సంస్థలకే వర్తించే ఆ చట్టాన్ని వ్యక్తులకు కూడా వర్తింపజేస్తూ మోడీ ప్రభుత్వం ఒక సవరణ తెచ్చింది. అందుచేత ఉదారవాద బూర్జువాల కమ్యూనిస్టు వ్యతిరేక వైఖరికి, ఫాసిస్టు అణచివేతకు మధ్య ఉన్న సంబంధాన్ని విస్మరించకూడదు.



ఇప్పుడు అమెరికాలో ఉన్నది ఒక ఉదారవాద బూర్జువా ప్రభుత్వం. అక్కడ మెకార్థీ తరహా వేధింపులకు అడుగు పడింది. దాని ప్రకంపనలు ఇక్కడ ఇండియాలో కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్నది ఒక ఫాసిస్టు ప్రభుత్వం. అంటే మెకార్థీయిజం ప్రపంచ వ్యాప్తం అవుతోందన్నమాట. ప్రస్తుత ప్రపంచీకరణ దశలో మెకార్థీయిజాన్ని కూడా ప్రపంచీకరిస్తున్నారు జినోవీవ్ రాసినట్టు ఒక బూటకపు లేఖను సృష్టించి 1924లో బ్రిటన్‌లో కమ్యూనిస్టు బూచిని ముందుకు తెచ్చారు. అప్పుడు అధికారంలో ఉండిన రామ్సే మెక్‌డొనాల్డ్ తాలూకు లేబర్ పార్టీ ప్రభుత్వం కాస్తా ఆ తప్పుడు ప్రచారం దెబ్బకు కూలిపోయింది. అదేమాదిరిగా 1950 దశకంలో అమెరికాలో సెనేటర్‌గా ఉన్న మెకార్థీ కమ్యూనిస్ట్ ప్రమాదం ముంచుకొచ్చేస్తోందంటూ సాగించిన ప్రచారం అక్కడ కమ్యూనిస్టులను, వామపక్షవాదులను వేటాడడానికి దోహదం చేసింది.అయితే ఆ కాలంలో ఆ వేట అమెరికాకే పరిమితం అయింది తప్ప ప్రపంచం మొత్తం మీద విస్తరించలేదు. కాని, ఇప్పుడు ప్రపంచీకరణ యుగంలో కమ్యూనిస్టు ప్రమాదం గురించి సృష్టించే అభూత కల్పనలు ఏ ఒక్క దేశానికో పరిమితం కావడం లేదు. ఒక చోట ప్రచారం మొదలైతే దాని హానికర ప్రకంపనలు ఇతర దేశాలకు విస్తరిస్తున్నాయి. తాను ఎవరిమీదా ఏ విధమైన ఆరోపణలనూ చేసినట్టు 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఒప్పుకోక పోవచ్చు. కాని ఆ పత్రిక రాతలే ఇక్కడ మోడీ ప్రభుత్వ విషపు దాడులకు దోహదం చేశాయి. ఇక్కడ ఉన్న ఉపా వంటి దుర్మార్గ చట్టాలు యథేచ్ఛగా ఉపయోగించబడుతున్నాయి. ధైర్యంగా ప్రభుత్వ చర్యలను ప్రశ్నించే అభ్యుదయవాదుల గొంతు నొక్కడానికి సాకుగా 'న్యూయార్క్ టైమ్స్' రాతలు ఉపయోగపడుతున్నాయి. ఇటువంటి పరిణామాలు జరిగే అవకాశం ఉందన్న సంగతి ఆ పత్రికకు బాగా తెలుసు. అయినప్పటికీ అటువంటి నిరాధార వార్తలను ప్రచురించడానికే ఆ పత్రిక పూనుకుంది. అంటే వర్తమాన ప్రపంచంలో పాశ్చాత్య దేశాల ఉదారవాద బూర్జువా విధానం తీరు తెన్నులు ఏ విధంగా ఉన్నాయో మనం తెలుసుకోవచ్చు.

> నిరాధారమైన ఆరోపణలను చేస్తే న్యాయపరంగా కేసుల్ని ఎదుర్కోవలసి వస్తుందని లాయర్లు సూచించినందువల్లనో ఏమో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కేవలం అన్యాపదేశంగా ఆరోపణలను చేయడం వరకే పరిమితం అయింది. కాని, మన ఢిల్లీ పోలీసులకి అటువంటి జాగ్రత్తలేమీ అవసరం లేదు. ఎందుకంటే వాళ్ళ దగ్గర 'ఉపా' అనే ఒక ఆయుధం ఉంది. ఆ చట్టం కారణంగా, ఎవరి మీద ఏ విధమైన ఆరోపణలు చేసినప్పటికీ వాటిని రుజువు చేసే ఆధారాలను చూపవలసిన బాధ్యత పోలీసుల మీద లేదు. నెలల తరబడి, ఒక్కోసారి ఏళ్ళ తరబడి కూడా ఏ ఆధారాలనూ కోర్టుల ముందు ఉంచనక్కరలేదు. అందు చేత కేవలం 'న్యూయార్క్ టైమ్స్' పత్రికలో వచ్చిన వార్తను బట్టి (ఆ వార్తలో ఏ ఆధారాలూ లేకపోయినప్పటికీ) 'న్యూస్ క్లిక్' సంస్థ చైనా అనుకూల ప్రచారానికి పాల్పడుతోందని అర్థం లేని నిరాధారమైన ఆరోపణలకు పోలీసులు పూనుకున్నారు.

ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో మెకార్థీయిజం తీసుకున్న రూపమే చైనా వ్యతిరేక ప్రచారం. ఇక్కడ మోడీ ప్రభుత్వం ఒక్క అంగుళం భారత భూభాగాన్ని కూడా చైనాకు విడిచిపెట్టేది లేదని గట్టిగా ప్రకటిస్తూ వుంటుంది. కాని వాస్తవానికి మన సరిహద్దుల్లో అక్కడక్కడా కొంత భూభాగం చైనా అధీనంలోకి పోయిందన్న వార్తలు వెలువడుతున్నాయి. సహజంగానే అటువంటి వార్తలు ప్రజల్లో చైనా పట్ల వ్యతిరేకతను కలిగిస్తాయి. ఆ చైనా వ్యతిరేకతను ఇక్కడ కమ్యూనిస్టుల మీద, ప్రభుత్వ విమర్శకుల మీద సాగించే మెకార్థీ తరహా దాడుల సమర్థనకు ఉపయోగించుకుంటోంది మోడీ ప్రభుత్వం. దేశంలో ఏ కాస్త అయినా స్వతంత్రంగా వ్యవహరించే మీడియా ఉన్నా దాని గొంతు నొక్కడానికి 'చైనా' వ్యతిరేకతను ముందుకు తెస్తున్నది.

ఉదారవాద బూర్జువా దృక్పథం నిజంగా ఫాసిస్టు వ్యతిరేకతను అనుసరించాలంటే, ఫాసిస్టు మెకార్థీయిజానికి తోడ్పడకుండా ఉండాలంటే అది కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేయడం మానుకోవాలి. ప్రస్తుతం వేగంగా ప్రపంచవ్యాప్తంగా మెకార్థీయిజం విస్తరిస్తూ ఫాసిస్టు శక్తులు బలపడడానికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తున్నప్పుడు ఉదారవాద బూర్జువా శక్తులు ఈ స్పష్టతను కలిగివుండడం అత్యవశ్యం.

(స్వేచ్ఛానుసరణ)



అక్షర సేనాని...
షోయబుల్లాఖాన్

అతను ఒక అక్షర సేనాని. నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో ఎండగట్టిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు. పాత్రికేయ వృత్తికి వన్నె తెచ్చిన యోధుడు. విశాల భావాలు కలగలిన ఆదర్శప్రాయుడు. నికార్సయిన వార్తలతో రజాకార్ల, నిజాం ఆగడాలను ప్రశ్నించి, విలువలు గల సంపాదకీయలు రాసిన మేరు నగధీరుడు షోయబుల్లాఖాన్. ఆయన రచనా జీవితం తేజ్ పత్రికతో ప్రారంభమైంది. నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ, ఖాసిం రజ్వీ దురాగతాల్ని ఖండిస్తూ విశ్లేషణాత్మక కథనాలు రచించారు. అటువంటి రచనల్ని ప్రచురిస్తున్న కారణంగా నిజాం ప్రభుత్వం తేజ్ పత్రికను నిషేధించింది. తర్వాత రయ్యత్ పత్రికలో ఉపసంపాదకునిగా బాధ్యతలు చేపట్టారు. రయ్యత్ పత్రిక కూడా నిజాం నిరంకుశత్వాన్ని విధానపరంగా విభేదించింది. అప్పటికే ముమ్మరంగా తెలంగాణా సాయుధ పోరాటం జరుగుతోంది. ఆ సందర్భంలో రయ్యత్ పత్రికలో నిజాం ప్రభుత్వం అమలు చేస్తున్న దమనకాండ, ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు రజ్వీని ఉసిగొలుపుతున్న పద్ధతులను వ్యతిరేకిస్తూ రచనలు చేశారు. ఆ పత్రికను కూడా నిజాం ప్రభుత్వం నిషేధించింది. రయ్యత్ నిషేధానికి గురయ్యాకా షోయబుల్లాఖాన్ స్వంత నిర్వహణలో ఇమ్రోజ్ అనే దినపత్రికను స్థాపించారు. ఇమ్రోజ్ అంటే తెలుగులో 'నేడు' అని అర్థం. ఆ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు ఆయనే స్వీకరించారు. రాజకీయ స్థితిగతులు అప్పటికే వేడెక్కాయి. పాకిస్తాన్‌కు కోట్లాది రూపాయలు ధన సహాయం చేయడం వంటి చర్యలు నిజాం, రాజ్యంలోని ప్రజలతో దాదాపుగా యుద్ధం చేస్తూ ఖాసిం రజ్వీ పరిస్థితుల్ని మార్చేశారు.

ఈ నేపథ్యంలో హైదరాబాద్ రాజ్యానికి చెందిన ఏడుగురు ముస్లిం పెద్దలు ఒక పత్రాన్ని తయారు చేశారు. నిజాం రాజుకీ, ఆయన ప్రజలకీ హైదరాబాద్ రాజ్యాన్ని భారత యూనియన్‌లో రాజ్యాన్ని విలీనం చేయడమే సరైన నిర్ణయమని ఆ పత్రం సారాంశం. ఈ పత్రాన్ని ఇమ్రోజ్ పత్రికలో యథాతథంగా షోయబుల్లాఖాన్ ప్రచురించారు. ఈ ప్రకటనాంశాన్ని భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో ఉపయోగించుకుంటుందేమోనని నిజాం భయపడ్డాడు. ఈ పరిణామాలే చివరకు ఆయన దారుణ హత్యకు కారణమయ్యాయి. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19న జరిగిన సభలో నిజాంకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే షోయబ్ చేతులు నరికివేస్తామన్నాడు. ఆయన ఈ బెదిరింపులకు లొంగలేదు సరికదా ప్రజల పక్షానే నిలబడ్డాడు. 21న షోయబుల్లాఖాన్ పత్రికా కార్యాలయం నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో కాచిగూడ రైల్వేస్టేషను రోడ్‌లో ముష్కరులు ఆయన కుడి అరచేతి మునివేళ్లను నరికేశారు. ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతూ 22న తుదిశ్వాస విడిచాడు. చనిపోయిన తర్వాత కూడా నిజాంకు ఆయనపై కోపం చల్లారలేదు. అంతిమ యాత్రను నిషేధించాడు. కానీ ప్రజల పోరాటంతో పోలీస్ పహరా మధ్య అంతిమయాత్ర జరిగింది.

షోయబుల్లాఖాన్ ఏదీ గుడ్డిగా నమ్మేవాడు కాదు. చాలా తార్కిక దృష్టి. ప్రజాస్వామ్యం లేని సోషలిజం ఎందుకని వాదించేవాడు. ఎమ్ఎన్ రాయ్ రాడికల్ హ్యూమనిస్ట్ పత్రికను తెప్పించుకునేవాడు. ఆయన రాతలు చాలా సీరియస్సే కాని మనిషి మాత్రం సరదాగా ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు. సైద్ధాంతిక చర్చలప్పుడు కూడా అనవసర ఘర్షణలకు దిగేవాడు కాదు. చర్చను కూడా నెమ్మదిగా, నిల కడగా చేసేవాడు. ఆయన మంచి పెయింటర్. పెయిం టింగ్ అంటే చాలా ఇష్టం. ఠాగూర్‌ది పెద్ద పోట్రయిట్ గీసాడు. ఉర్దూ, ఇంగ్లీష్ సాహిత్యాలంటే ప్రాణం పెట్టే వాడు. ఏ మూల నిజాం ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా, వాటి గురించి నిర్భయంగా రాసే వాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందే నని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయా లను ప్రచురించేవాడు. నిజాం మొండితనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుం బాలు, యువకులేనని ఆయన ఎన్నోసార్లు ఆవేదన చెందాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడ మనేది షోయబుల్లాఖాన్ కల, లక్ష్యం. దాని కోసం నడి రోడ్డు మీద ప్రాణాలను బలిపెట్టాడు. అలాంటి త్యాగ మూర్తికి మన పాలకులిచ్చిన గౌరవం... మలక్‌పేటలో ఆయన పేరు మీద ఒక గదితో లైబ్రరీ, చుట్టూ చిన్న పార్కు. చూద్దామంటే ఆయన విగ్రహం కూడా లేదు. తర్వాత తరాలు తెలుసుకోవడానికి చరిత్ర లేదు. పాత్రి కేయ వృత్తికే వన్నె తెచ్చిన షోయబుల్లాఖాన్ గురించి నేటి తరం తెలుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలి. నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి.

(నేడు షోయబుల్లాఖాన్ 103వ జయంతి)

- కామిడి సతీష్ రెడ్డి, 9848445134

ఇజ్రాయిల్-గాజా యుద్ధం: ఆక్రమణలకు అంతం పలకాలి!

దక్షిణ ఇజ్రాయిల్‌పై హమాస్ విస్మయ పరిచే రీతిలో దాడులు జరపడం, దానికి ప్రతిగా ఇజ్రాయిల్ గాజాలో క్రూరమైన బాంబు దాడులకు దిగడంతో... ఇజ్రాయిల్ ఆక్రమణ, పాలస్తీనా ప్రజల ప్రతిఘటన చరిత్రలో కొత్త అధ్యాయానికి తెరలేచింది. ఈ సంపాదకీయం రాస్తున్న సమయానికి (ఘర్షణలు ప్రారంభమై నాలుగు రోజులు గడిచిన తర్వాత) 1200 మంది ఇజ్రాయిలీలు మరణించారు (వారిలో 155 మంది సైనికులు), 2700 మంది గాయపడ్డారు. పాలస్తీనా వైపు చూసినట్లైతే, ఇప్పటివరకు గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో 1055 మంది మరణించారు, 5,128 మంది గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 17 మంది పాలస్తీనియనుష్ల మరణించగా 80 మంది గాయపడ్డారు.

ఇజ్రాయిల్‌లో హమాస్ దాడుల కారణంగా మహిళలు, చిన్నారులతో సహా పౌరులు ప్రాణాలు కోల్పోవడం, గాజాలో కూడా ప్రజల మరణాలు పెరగడం, అందులోనూ మహిళలు, పిల్లలు మృతి చెందడం కచ్చితంగా గట్టిగా ఖండించాల్సిన విషయం.

అదే సమయంలో, అంతర్జాతీయ కార్పొరేట్ మీడియా, పశ్చిమ దేశాల పాలక వర్గాలు అందిస్తున్న వర్ణనలతో కూడిన కథనాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం వుంది. ముఖ్యంగా ఇజ్రాయిల్ ఆక్రమణల గురించి అస్సలు ప్రస్తావించకుండా ఇజ్రాయిల్‌పై దారుణమైన తీవ్రవాద దాడి జరిగిందంటూ పేర్కొనడాన్ని వ్యతిరేకించాల్సి వుంది.

దశాబ్దాల తరబడి ఇజ్రాయిల్ ఆక్రమణలు, పాలస్తీనా ప్రజలను లొంగదీసుకోవడం నేపథ్యంలో హమాస్ దాడిని చూడాలి. 1967 యుద్ధం జరిగినప్పటి నుండి ఇజ్రాయిల్ సాయుధ బలగాలు వెస్ట్‌బ్యాంక్, గాజాలను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. గత 56 ఏళ్ళుగా తమ ఆక్రమణలోనే అట్టి పెట్టుకున్నాయి. అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్య సమితి తీర్మానాల మేరకు, ఇవన్నీ ఆక్రమిత ప్రాంతాలు. ఇన్నేళ్ళలో వెస్ట్ బ్యాంక్‌లో అక్రమంగా యూదు ఆవాసాలను ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ అడ్డంకుల పేరుతో ఈ ప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా విడగొట్టారు. ఇజ్రాయిల్ నుండి వెస్ట్ బ్యాంక్‌ను వేరు చేస్తూ పెద్ద గోడ నిర్మించారు. వర్ణ వివక్ష వ్యవస్థను అమలు చేశారు. 2022లో బెంజమిన్ నెతన్యాహు నేతత్వంలో మితవాద ప్రభుత్వం ఏర్పడడంతో పాలస్తీనియన్ల అణచివేత మరింత ఉధృతమైంది. సెటిలర్ల మూకలు, మితవాద ముఠాలు పాలస్తీనియన్లను వారి ఇళ్ల నుండి గెంటివేయడం, గ్రామాల నుండి పారద్రోలడం, ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా చంపేస్తూ పాల స్తీనియన్ల జీవితాలను ఈ అతి జాతీయవాద ప్రభుత్వం దుర్భరం చేసింది. ఘర్షణలకు ముందు ఈ ఒక్క ఏడాదిలోనే ఇజ్రాయిల్ భద్రతా బలగాలు, సెటిలర్ల చేతుల్లో 248మంది పాలస్తీనియన్లు మరణించారు. అంటే సగటున రోజుకో పాలస్తీనియుడు చనిపోయాడన్న మాట. జెరూసలెంలో, పాలస్తీనియన్ల కుటుంబాలను బలవంతంగా తరలించారు. వారి ఇళ్ళను ఆక్రమించుకున్నారు. తూర్పు జెరూసలెంలో జాతి ప్రక్షాళన క్రమం కొనసాగుతోంది. ముస్లిం ప్రపంచానికి మూడో అతి పవిత్ర ప్రదేశమైన అల్ అక్సా మసీదు ఆవరణలో తీవ్రవాదులైన యూదు అల్లరిమూకలు, భద్రతా బలగాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. మసీదులోకి ప్రవేశించి, అక్కడ ప్రార్థనలు చేసుకుంటున్న వారిని చితకబాదారు.



> ప్రస్తుత ఘర్షణల్లో, అమెరికా వైఖరినే నరేంద్రమోడీ కూడా పునరుద్ఘాటించారు. తీవ్రవాద దాడులను ఖండించారు. ఇజ్రాయిల్‌కు పూర్తి బాసటగా వుంటామని ప్రకటించారు. అంతే తప్ప పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతుగా గానీ రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం గురించి కానీ ఎలాంటి ప్రస్తావన లేదు. పాలస్తీనియన్ల భూములు ఆక్రమణలో కొనసాగుతున్నంత కాలమూ, పాలస్తీనియన్లు అణచివేతకు గురవుతున్నంత కాలమూ ఇజ్రాయిల్, పశ్చిమాసియాకు శాశ్వత శాంతి వుండబోదు.

గాజా స్ట్రిప్‌కు సంబంధించినంత వరకు చూసినట్లైతే, 2007లో ఇజ్రాయిల్ తమ సైనిక బలగాలను ఉపసంహరించుకున్న తర్వాత, గాజా ప్రాంతం మొత్తంగా ఆంక్షలను విధించింది. ఈ గాజా ప్రాంతంలో దాదాపు 23 లక్షల మంది జీవిస్తున్నారు. గత 16 ఏళ్ళుగా, గాజా ప్రాంతం దయాదాక్షిణ్యాలు లేని ఆంక్షలను, దిగ్బంధనాలను ఎదుర్కొంటోంది. ఒక రకంగా బహిరంగ జైలుగా మారింది. ఇదే కాలంలో, ఆంక్షలను, దిగ్బంధనాలను ప్రతిఘటించే ప్రయత్నాలు జరిగినపుడు వైమానిక బాంబు దాడులతో విరుచుకుపడిన సందర్భాలు వున్నాయి. ఈ నరకాన్ని అనుభవిస్తూ వచ్చిన హమాస్ అందరినీ సమీకరిస్తూ, సంఘటితపరుస్తూ అనూహ్యమైన రీతిలో తాజా దాడికి దిగింది. దీంతో ఎంతగానో గొప్పగా చెప్పుకునే ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్, మిలటరీ విభాగాలను విస్మయానికి గురిచేసింది. తమకు తాము అజేయమనుకునే ఇజ్రాయిల్ రక్షణ బలగాల ఆలోచనలు చెల్లా చెదురయ్యాయి. ఈ దాడులకు ప్రతీకారంగా, నెతన్యాహు, ఆయన సహచరులు గాజాపై మొత్తంగా యుద్ధానికి దిగాలని నిర్ణయించారు. నెతన్యాహు మాటల్లో చెప్పాలంటే 'గాజాలో వాస్తవికతలను మార్చాలి'. ఇంధనం, ఆహారం, విద్యుత్ సరఫరాలు ఆపివేసి గాజాను మొత్తంగా దిగ్బంధించాల్సిందిగా ఇజ్రాయిల్ రక్షణ మంత్రి గలాంట్ ఆదేశించారు. గాజాలో 'మానవ మృగాల'పై పోరాటం జరపాల్సిందిగా పిలుపునిచ్చారు. నాలుగు రోజుల పాటు జరిగిన వైమానిక బాంబు దాడుల్లో దాదాపు 900 మంది మరణించారు. వీరిలో మహిళలు, పిల్లలు వున్నారు. వేలాదిమంది గాయపడ్డారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. నీరు, ఆహారం లేదు.

ఈ దిగ్బంధనాన్ని సామూహిక శిక్షగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వ్యాఖ్యానించారు. ఇది అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధం నేరమేనన్నారు. గాజాతో గల సరిహద్దుల్లో ఇజ్రాయిల్ బలగాలను పెద్ద సంఖ్యలో మోహరించింది. భూతల దాడి తప్పదనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక జరగబోయేది వేలాదిమంది ఊచకోతే. ఇజ్రాయిల్ ఇంత పెద్ద యెత్తున నాశనం, విధ్వంసానికి తెగబడుతుండడం వల్ల అది, పాలస్తీనా ప్రజలు మరోసారి ప్రతిఘటించడానికే దారి తీస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా తమ విముక్తి కోసం పాలస్తీనియన్లు సాగిస్తున్న పోరాటాన్ని వారెన్నడూ విడనాడరు. ఇజ్రాయిల్‌కు ప్రధాన వెన్నెముక అయిన అమెరికా రంగంలోకి దిగింది. మారణాయుధాలను, మందుగుండును ఇజ్రాయిల్‌కు అందచేస్తామని హామీ ఇచ్చింది. ఆ మారణాయుధాలను పాలస్తీనియన్లను ఊచకోత కోయడానికే ఉపయోగిస్తారు.

రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని పైపై మాటలు చెబుతున్నప్పటికీ... పాలస్తీనియన్లపై అణచివేతను నివారించడానికి ఇన్నేళ్ళలో అమెరికా, దాని మిత్రపక్షాలు చేసిందేమీ లేదు.

ప్రస్తుత ఘర్షణల్లో, అమెరికా వైఖరినే నరేంద్రమోడీ కూడా పునరుద్ఘాటించారు. తీవ్రవాద దాడులను ఖండించారు. ఇజ్రాయిల్‌కు పూర్తి బాసటగా వుంటామని ప్రకటించారు. అంతే తప్ప పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతుగా గానీ రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం గురించి కానీ ఎలాంటి ప్రస్తావన లేదు. పాలస్తీనియన్ల భూములు ఆక్రమణలో కొనసాగుతున్నంత కాలమూ, పాలస్తీనియన్లు అణచివేతకు గురవుతున్నంత కాలమూ ఇజ్రాయిల్, పశ్చిమాసియాకు శాశ్వత శాంతి వుండబోదు.

గాంధీజీ నేతృత్వంలో జాతీయోద్యమ కాలం నుండి, భారత్ ఎల్లప్పుడూ పాలస్తీనియన్లకు అండగా, బాసటగానే నిలబడుతూ వచ్చింది. ఈ ప్రతినను మరోసారి పునరుద్ఘాటించాల్సిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కూలిబంధు ప్రవేశపెట్టి ఏడాదికి రూ.50వేలు ఇవ్వాలి

బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు

నవతెలంగాణ-సత్తుపల్లి

వ్యవసాయ కూలీలకు కూలిబంధు పథకాన్ని ప్రవేశపెట్టి యేడాదికి ఒక కుటుంబానికి రూ. 50వేలు ఇవ్వాలని భారత్ కేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సత్తుపల్లిలో ఆ సంఘ సభ్యత్వ నమోదు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆదినారాయణ వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. గృహలక్ష్మీ పథకానికి రూ.5లక్షలు ఇవ్వాలని, దళితబంధు పథకాన్ని అమలు చేయాలని, రేషన్ దుకాణాల ద్వారా 10 రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. పనులు దొరకని కారణంగా కూలీలు వలసబాట పట్టే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేసి ఉచిత బీమా ద్వారా ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు బీమా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ మండల నాయకులు శ్రీను, చెన్నారావు, అంజమ్మ వరలక్ష్మీ, రాములమ్మ, ప్రసాద్, వెంకటేశ్వర్లు, చెల్లమ్మ, రాంబాబు, రమణ, లక్ష్మీ, వెంకటమ్మ పాల్గొన్నారు.



హామీలను అమలు చేయని ప్రభుత్వాలను గద్దెదించాలి : వ్యకాస

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గత ఎన్నికల్లో హామీలు ఇచ్చి నెరవేర్చకుండా మరోసారి ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రభుత్వాలను గద్దె దించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నెకంటి సంగయ్య అన్నారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలో సోమవారం వ్యకాస మండల కమిటీ సమావేశం కర్లపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సంగయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బంధు, గృహలక్ష్మి పథకాలను అందజేయాలన్నారు. బిజెపి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు ఇలాంటి మాయమాటలతో ప్రజలతో ఓట్లు వేయించుకొని నిత్యావసర ధరలు పెంచి, పేదల సొమ్ము దోచుకొని పెద్దలకు అండగా ఉన్నాడని విమర్శించారు. రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు 600 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ 2, 3 తేదీలలో హనుమకొండలో జరిగే మహిళ క్లాసులను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు, నాయకులు కారుమంచి గురవయ్య, పాము ఉపేందర్, పగిడిపల్లి వెంకట్రావు, రమేష్, యర్రా నరసింహారావు, తుమాటి నాగయ్య, పడిశాల లక్ష్మణ్, బాణోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పువ్వాడ అజయ్ మంత్రి అయ్యాక ప్రజల్లో భయాందోళన

త్వరలో కాంగ్రెస్‌లోకి భారీ వలసలు

కార్పొరేటర్ కమర్తపు మురళి

నవతెలంగాణ- ఖమ్మం

పువ్వాడ అజయ్ మంత్రి అయ్యాక ప్రజల్లో భయాందోళన నెలకొందని కార్పొరేటర్ కమర్తపు మురళి ఆరోపించారు. సోమవారం ఖమ్మంలోని గొల్లగూడెం రోడ్ లోని తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాకు రాజకీయ గురువు అని, నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ సీట్ ఇచ్చింది తుమ్మల నాగేశ్వరరావు అని అన్నారు. వ్యక్తిగతంగా విమర్శలు మంచి పద్ధతి కాదని, దాని వల్ల బీఆర్ఎస్‌కే నష్టమని అన్నారు. కాంగ్రెస్ పార్టీని అణగదొక్కడం ఎవరి వల్లా కాదన్నారు. ఖమ్మం అభివృద్ధికి కారణం తుమ్మల నాగేశ్వరరావు అని అన్నారు. 2015 సంవత్సరంలో లకారం ట్యాంక్ బండ్, ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేసింది తుమ్మల కాదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీలోకి నాయకుడుగా వెళ్తే కార్యకర్తగా మిగిలిపోతున్నారని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్ చావా నారాయణరావు మాట్లాడుతూ మేయర్ మొదటి నుండి బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు మాట్లాడుతున్నారని అన్నారు. గతంలో రెండు సార్లు పార్టీలు మారిన వ్యక్తి మేయర్ అని, మీరు మేయర్ అయిన తర్వాత నీ సొంతంగా ఏం పనులు చేశావ్ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే వాళ్ళు చాలా మంది ఉన్నారని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు పొట్ల వీరేందర్, ఏలూరు శ్రీనివాసరావు ,చేతుల నాగేశ్వరరావు, కాంపాటి వెంకన్న పాల్గొన్నారు.



శరన్నవరాత్రోత్సవాల్లో బాలాత్రిపుర సుందరి దేవి అవతారం

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని గుట్టల బజార్‌లో వేచి ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో 47వ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అవతారంతో వచ్చిన భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి దేవత అనిల్ కుమార్, కోశాధికారి కొత్తమాసు హేమ సుందరరావులు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ సభ్యులు ఉపాధ్యక్షులు గోళ్ళ భాస్కరరావు, బిజ్జాల ఈశ్వర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవరశెట్టి పూర్ణచంద్రరావు, మద్ది వెంకట వీరభద్రరావు, సహాయ కార్యదర్శి అనుమోలు రమేష్, చెరుకూరి శ్రీనివాసరావు, యర్రమళ్ళ సుదర్శన్‌రావు, కోదుమూరి సూర్యం, రాయపూడి జయరామ్, రాయపూడి రవికుమార్, విన్నమూరి వెంకట సుబ్బారావు, యడమకంటి రామారావు, దేవిశెట్టి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేసి గెలిపించాలి

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం

ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవన్) లో జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ అధ్యక్షతన మైనారిటీ సెల్ జిల్లా, మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసి గెలిపించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ జిల్లా, మండల మైనారిటీ నాయకులు మైనారిటీ మండల కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని, అన్ని బూత్‌లలో ప్రచారం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ప్రతి ఒక్కరు సైనికుని వలే పని చేయాలని కోరారు.సమావేశంలో నాయకులు రఫీ, మజీద్ పాషా, ఫయాజ్ హుస్సేన్, అన్వర్ హుస్సేన్, నాగుల్ మీరా, జాకీర్ హుస్సేన్, షాజహాన్, సయ్యద్ మెహరజ్, షేక్ పాషా, అబ్దుల్ జబ్బార్, సయ్యద్ జానిపాషా, షేక్ బాజి, షేక్ చాంద్ పాషా తదితరులు నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి ఆపాలి

ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ- ఖమ్మం



పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని ఆపాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆవాజ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆవాజ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి మొహమ్మద్ గౌస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధాన్ని, ఇజ్రాయెల్ పై హమాస్ మతిలేని దాడులను ఖండించారు. ఇప్పటికే వేలాదిమంది మంది ప్రాణాలను కోల్పోయారని, యుద్ధం ఇలాగే కొనసాగితే మరింత మారణహోమం జరుగుతుందని, ఐక్యరాజ్యసమితి వెంటనే జోక్యం చేసుకుని యుద్ధానికి ముగింపు పలకాలని కోరారు. అమెరికా ఇజ్రాయెల్ పట్ల పక్షపాతంతో వ్యవహారిస్తూ పాలస్తీనా సమస్య పరిష్కారం కాకుండా అడ్డుపడుతున్నదని, యుద్ధానికి కాలుదువ్వుతున్నదని అన్నారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనా ప్రజల స్వస్థలం కోసం చట్టబద్ధమైన హక్కులను నిర్ధారించాలని పాలస్తీనా భూభాగంలోని ఇజ్రాయెల్ అక్రమ స్థావరాలను, భూముల ఆక్రమణలను ఉపసంహరిం చుకోవాలని, రెండు దేశాలను గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని ఇజ్రాయెల్ అమలు చేసేలా చూడాలని, ఐరాస తీర్మానానికి అనుగుణంగా తూర్పు జెరూసలేంను పాలస్తీనా రాజధానిగా గుర్తించాలి, ఐరాస తీర్మానాన్ని అమలు చేయాలన్నారు ఇజ్రాయెల్ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, యుఎన్ తీర్మానం అమలుకు చర్యలు తీసుకోవాలని, భారత ప్రభుత్వంతో సహా అంతర్జాతీయ సమాజం చొరవ తీసుకొని పాలస్తీనా సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా నాయకులూ బాబు, నాగులు మీరా, సత్తార్, సయ్యద్ నజీర్, అక్బర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-వైరా/ సత్తుపల్లి



రానున్న శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఇవిఎంల భద్రత, రిషిప్షన్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్లు, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జ్యోతి నిలయం హైస్కూల్‌లను పరిశీలించి, చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. ఇవిఎంల భద్రతకు గదులు, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన చర్యల గురించి పరిశీలించారు. రిషిప్షన్ కేంద్ర ఏర్పాటు, భోజన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్‌ల ఏర్పాటుపై చుట్టూ తిరిగి పరిశీలించారు. బ్యారికేడ్ల ఏర్పాటు విషయమై అధికారులకు సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ చేపడుతున్న రోజుల్లో ముందస్తుగా ఆయా విద్యాసంస్థల యాజమాన్యంకు తెలియపర్చి, ఆ రోజుల్లో పాఠశాలకు సెలవులు ఇచ్చేలా చూడాలన్నారు. ఇవిఎం స్ట్రాంగ్ రూమ్, అదనపు ఇవిఎంలతో సహా భద్రపర్చడానికి సరియైన హాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇవిఎం కమిషనింగ్‌కి అనువైన హాల్ చూడాలన్నారు. అనువుగా ఉండుటకు భవనాలకు ఏమైనా తాత్కాలిక మార్పులు చేపడితే, ఎన్నికల ప్రక్రియ తర్వాత యదాస్థితి తిరిగి అప్పగించాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, అదనపు డిసిపి ప్రసాద్‌రావు, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, ఏసీపీలు రహమాన్, రామాంజనేయులు, తహసీల్దార్లు శ్రీనివాస్, బాబ్జి ప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, సుజాత, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ప్రసాద్, అధికారులు ఉన్నారు.

ఓటర్ చేతులో బ్రహ్మాస్త్రం సీ-విజిల్ యాప్

యాప్‌ను సద్వినియోగం చేసుకోండి : ఆర్వో రాజేశ్వరి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రస్తుతం ఎన్నికల సమయంలో ఓటరు చేతిలో బ్రహ్మాస్త్రం సీ-విజిల్ యాప్ అని, దాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని పాలేరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి ప్రజలను కోరారు. ఆర్వో కార్యాలయం, మండల తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినట్లు అనిపించినా వెంటనే లైవ్ వీడియో, ఫోటోలను సీ-విజిల్ యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే అధికారులు అక్కడికి చేరుకొని వారిపై చర్యలు తీసుకుంటారని వివరించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు.ఎన్నికల కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1950, పాలేరు నియోజకవర్గం కోసం ప్రత్యేకంగా 08742 252566 నంబర్‌ను కేటాయించామని సందేహాలు, ఫిర్యాదులు, సలహాలు అవసరం అయినా వారు ఈ నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో మొత్తం 289 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటికి గాను 27 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు వివరించారు. నియోజకవర్గంలో మొత్తం మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఉన్నాయని రాష్ట్ర, జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు అయ్యాయని, రూ.2.80లక్షల నగదును సీజ్ చేశామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు వాహనాలు, మీటింగ్‌లు, మైక్ కోసం ముందుస్తు అనుమతి తీసుకోవాలన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

పాలేరు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మండల తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సువిద యాప్, ఎన్నికల కోడ్ గురించి ఆర్వో రాజేశ్వరి పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ బస్వారెడ్డి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ రవీందర్, అధికారులు, సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువ ఓటర్లే కీలకం

నవతెలంగాణ - ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 30న జరగనున్న శాసన సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచారం మొదలుకొని ఓట్ల లెక్కింపు వరకు నియమావళి అమలులో కొనసాగుతుంది. ఈ ఎన్నికలలో యువ ఓటర్ల నమోదు శాతం రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అగ్రభాగాన నిలిచింది. ఎన్నికలలో కొత్తగా నమోదైన యువ ఓటర్ల పాత్ర కీలకం కానుందని చెప్పవచ్చు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువ ఓట్లే ప్రధాన భూమిక పోషించనున్నట్లు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజక వర్గాలలో అభ్యర్థుల గెలుపు ఓటములను తారుమారు చేయగల శక్తి సామర్థ్యం యువ ఓటర్లకు ఉన్నట్లు అవగాహనకు వచ్చారు. ఎన్నికలను శాసించగలిగే సత్తా వారికే ఉన్నట్లు గుర్తిస్తున్నారు. 18 నుండి 25 సంవత్సరాల వయసు కలిగిన వారి సంఖ్య గతం కన్నా గణనీయంగా పెరిగిన మాట వాస్తవం మధిర శాసనసభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్లు 2.18.565 ఓట్లకు గాను 21.75% తో 47.553 కొత్త ఓటర్లు భారీగా నమోదు కావడంతో ప్రధాన పార్టీలు యువతను ఆకట్టుకునే పనిలో ఉన్నారు. వారిని మచ్చిక చేసుకుని వారి ఓట్లు పొంది గెలుపును సాధించాలని తాపత్రయంతో అభ్యర్థులు యువతకు ఏర వేస్తున్నారని ప్రచారం జోరుగా కొన సాగుతుంది. మధిర నియోజకవర్గ పరిధిలో గతంలో 152 పోలింగ్ బూత్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నూతనంగా పెరిగిన ఓటర్ల దామాషా ప్రకారం ఓటర్లకు సౌలభ్యంగా ఉండే ఆలోచనతో 56 నూతన పోలింగ్ కేంద్రాలను కలిపి మొత్తం 208 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూతులు దూర ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే ఓటర్లు ఓటు వేయడానికి అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి కనబరచలనే ఉద్దేశంతో అధికారులు ప్రతి ఆవాసంలో బూతులను ఏర్పాటు చేశారు. ఒక్కో బూతుకు వెయ్యి మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు చేపట్టారు. క్యూలో నిలబడాల్సిన అవసరం తప్పుతుందని చెబుతున్నారు. 1000 మంది ఓటర్లకు ఒక బూతు ఏర్పాటు చేశారు. ఒకే ఇంట్లో నలుగురు లేక ఐదుగురు కుటుంబ సభ్యులు ఉన్నట్లయితే అందరి ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లోకి తెచ్చారు. ఇది ఇలా ఉండగా ఎన్నికలలో నగదు భారీగా చేతులు మారుతుందనే అనుమానాలతో అధికారులు చేసే తనిఖీల వలన అత్యవసరాల నిమిత్తం తీసుకుని వెళ్లే నగదు బంగారు ఆభరణాలకు సరైన ఆధారాలు చూపాలంటూ వాటిని స్వాధీన పరుచుకుంటున్నారు.ఈ ప్రభావం వలన సామాన్య ప్రజలు పలు ఇబ్బందులు చెందుతున్నారు.



ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని సఖునవీడు గ్రామ పంచాయతీ నందు బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ వెంకట్ లాల్, డాక్టర్ సమీర అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో భాగంగా జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, గ్యాస్, షుగర్, బీపి వంటి వివిధ రకాల వ్యాధులతో బాధ పడుతున్న 87 మందిని పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యరమల భాస్కరరెడ్డి, వైస్ ఎంపిపి రామకోటయ్య, హెచ్ఇఓ సదాశివరావు, సూపర్‌వైజర్ లతా శ్రీ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎం భవాని, ఫార్మసిస్ట్ శ్రీను, ఎంఎల్ హెచ్ పి రూపశ్రావణి, ఆశా కార్యకర్తలు కుమారి,పుల్లమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధి నా ఏకైక లక్ష్యం

మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

నవతెలంగాణ- ఖమ్మం

నాకున్న ఏకైక లక్ష్యం నగరాభివృద్ధి మాత్రమే అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని 54వ డివిజన్ వీడియోస్ కాలనీలో ఆడిటర్ శివరామ కృష్ణ ప్రసాద్ అధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్జేసి కృష్ణ, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బొమ్మ రాజేశ్వరరావు, పోట్ల శ్రీదేవి శ్రీకాంత్, వల్లభనేని రామారావు, బత్తుల మురళీ, బొడేపుడి నాగేశ్వరరావు, బండి కిషోర్, నంబూరి మురళీ, నున్నా అప్పారావు, కిలారు బాబ్జీ, పోట్ల రాధిక, వంగాల కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం

నవతెలంగాణ- ఖమ్మం



డివైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భగత్ సింగ్ బ్లడ్ డోర్స్ క్లబ్ ద్వారా సోమవారం 2,540వ రక్తదానం చేశారు . డివైఎఫ్ఐ జిల్లా కమిటీ శ్రీరాముల సాయి చరణ్‌కు అభినందనలు తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు సంవత్సరాల పాపకు రక్తం అవసరం కాగా సాయి రక్తదానం చేశారు.

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన దయాకర్ రెడ్డి

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని ఐదవ డివిజన్‌లో సోమవారం ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన నరసింహారావు, పల్లె బోయిన చంద్రయ్య యాదవ్, చల్లా రామకృష్ణ, చల్లా శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శోభకృత్ నామ సంవత్సర శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవములలో భాగంగా సోమవారం అమ్మ వారిని శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారు జామున 5 గంటల నుండి స్వామి వారికి సర్వాంగాభిషేకం, నూతన వస్త్రాల అలంకరణ, ప్రత్యేక పూజలు వేద పండితులు నిర్వహించారు. 9 గంటల నుండి శ్రీ గాయత్రీ దేవి అమ్మ వారికి ప్రత్యేక పూజలు, హెూమములు అర్చకులు ఘనంగా నిర్వహించారు. యాగశాలలో ఉప్పల మురళీమోహన్ శర్మ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ ఘనంగా నిర్వహించారు. వేద పండితులు సాయంత్రం శ్రీ లలిత సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం రాత్రి 8 గంటలకు మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పము కార్యక్రమాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప్పల జయదేవశర్మ, ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, రాజీవ్ శర్మ సుదర్శనశాస్త్రి, రమణబాబు, పర్యవేక్షకులు కే విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పువ్వాడ సతీమణి ఇంటింటికీ ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని 13వ డివిజన్‌లో మంత్రి సతీమణి పువ్వాడ వసంత లక్ష్మీ సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్ హ్యాట్రిక్ విజయాన్ని కాంక్షిస్తూ గెలుపే లక్ష్యంగా అందరూ పని చేయాలని కోరారు.

సెర్ప్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దపాక ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ- నేలకొండపల్లి



తెలంగాణ గ్రామీణ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ (సెర్ప్) సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నేలకొండపల్లి మండల సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గా పనిచేస్తున్న పెదపాక వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ గ్రామీణ అభివద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా బీసీ జేఏసీ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో తెలంగాణ గ్రామీణ అభివద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం తరపున ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళల ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు, అన్ని రంగాలలో రాణించేందుకు అవసరమైన చైతన్యాన్ని పెంచేందుకు పని చేయనున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఉద్యోగస్తులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పెదపాక వెంకటేశ్వరరావు ఏకగ్రీవ ఎన్నిక పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
6
మంగళవారం | అక్టోబర్ 17, 2023 | www.navatelangana.com



ప్రజా సంక్షేమం...కేసీఆర్ లక్ష్యం

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-సత్తుపల్లి

ప్రజల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యమని, బీఆర్ఎస్ విడుదల చేసిన మేనిఫెస్టోను పరిశీలిస్తే అర్థం చేసుకోవచ్చని సత్తుపల్లి మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారంలో ప్రజలకు వివరిస్తున్నారు. సోమవారం 14వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో కౌన్సిలర్ గుండ్ర రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు ఉరుకులు పెడుతున్నాయన్నారు. కేసీఆర్ అమలు పరుస్తున్న పథకాల్లో ఏదోఒక పథకం అందని ఇల్లంటూ ఎక్కడా ఉండదన్నారు. సత్తుపల్లి పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు ప్రజలు అండగా నిలిచి కారుగుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు ప్రజలను కోరారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, నాయకులు మేకల నరసింహారావు, వెనిగళ్ల గోపి, మరికంటి శ్రీను, చింతల సత్యనారాయణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు తడికమళ్ల ప్రకాశరావు, పర్వతనేని వేణు, కోట రాజ్‌కుమార్, జొన్నలగడ్డ కృష్ణ, నల్లగట్ల జీవన్‌రావు పాల్గొన్నారు.

కన్నుల పండుగలా రొట్టమాకురేవు అవార్డోత్సవం

నవతెలంగాణ-కారేపల్లి

కవులను ప్రోత్సహించటానికి కవి యాకూబ్ ఆధ్వర్యంలో నిర్వహించే రొట్టమాకురేవు అవార్డుల ప్రధానోత్సవం హైదరబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో కన్నుల పండుగలా జరిగిందని ప్రముక కవి యాకూబ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గౌరిశంకర్ అధ్యక్షతన ప్రధానోత్సవం జరిగిందన్నారు. రొట్టమాకురేవు అవార్డుల ఎంపికలో ప్రతిభకలవారికి చోటు దక్కిందన్నారు. ప్రధానోత్సవ సభ అద్యంతం కవిత్వ పరిమళంతో నిండిందని కొనియాడారు. కవిసంగం కుటుంబ వేడుకగా జరగిందని సహకరించిన తోటి కవి మిత్రులకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి శిలాలోహిత పాల్గొన్నారు.



'ఆదిత్య గాయత్రి' స్కూల్‌కి అవార్డు

నవతెలంగాణ- రఘునాథపాలెం

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవ వేడుకలు మరియు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సమాజ శ్రేయస్సు కొరకు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కొరకు కృషి చేస్తూ సామాజిక దృక్పధం కలిగిన మంచుకొండలోని ఆదిత్య గాయత్రి స్కూల్ ప్రిన్సిపల్ చిన్నం వెంకమరాజుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డును ఆదివారం ఖమ్మం పట్టణం దానవాయిగూడెంలో గల వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ అమరేష్, తెలంగాణ ఇన్కమ్ టాక్స్ కమిషనర్ లావిడియ జీవన్‌లాల్, నిట్ వరంగల్ ప్రొఫెసర్ ఎస్.వి. ఉమా మహేష్, వరంగల్ ఎస్ వి ఎస్ విద్యా సంస్థల ఛైర్మన్ ఎర్రబెల్లి తిరుమలరావు, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సిఓఈ, సమన్వయ కర్త కొమ్మిని కిషోర్, ట్రస్మా రాష్ట్ర కోశాధికారి ఎన్. వి. రమణారావు, ట్రస్మా ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాంచందర్ రావు, ట్రస్మా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బండి లక్ష్మణ్ పాల్గొన్నారు.



గ్లోబల్ రెయిన్ బో స్కూల్‌కు అవార్డు

నవతెలంగాణ-కూసుమంచి

క్రమశిక్షణతో కూడిన విద్య, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ప్రతి ఏడాది పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాలు సాధిస్తున్న మండల కేంద్రంలోని గ్లోబల్-రెయిన్ బో స్కూల్‌కు సర్వేపల్లి రాధాకృష్ణ అవార్డు వరించింది. ఈ అవార్డును పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్‌కు సోమవారం జిల్లా కేంద్రంలో అందజేశారు.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఎర్షాద్‌కు అభినందనలు తెలిపారు.



బిఆర్ఎస్ నాయకులు కట్ట రాముకు పితృవియోగం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని ముద్దునూరు గ్రామపంచాయతీ శివారు రంగాపురం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కట్టా రామకృష్ణ తండ్రి గౌరీ శంకర్ (88) అనారోగ్యంతో సోమవారం తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ దొడ్డ శ్రీనివాస్ రావు, ఆర్వేర్ మోహన్ రెడ్డి, డి వెంకట్ లాల్, దాసు రావు, సిపిఎం సీనియర్ నాయకులు తాత భాస్కరరావు, శీలం సత్యనారాయణ రెడ్డి, వనిగళ్ళ వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కంభంపాటి కృష్ణ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలో గల లడక బజార్ 17వ డివిజన్ టిఆర్ఎస్ నాయకులు కొత్తపల్లి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, శాసనసభాపక్షనేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ నందిని విక్రమార్క కొత్తపల్లి నరసింహారావు ఇంటికి వెళ్లి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తపల్లి నరసింహారావుతో పాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, మున్సిపాలిటీ కౌన్సిలర్ కోన ధనికుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, 17వ డివిజన్ కమిటీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పారుపల్లి విజయకుమార్, చెరుకూరి నాగార్జున, మొండితోక సుధాకర్, రంగా అప్పారావు, టీవి రెడ్డి, బొల్లెద్దు రాజేంద్ర, ఆదిమూలం శ్రీనివాసరావు, ఆదిమూలం పుల్లారావు పాల్గొన్నారు.

కారేపల్లిలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌లు

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలంలో ట్రైనీ ఐఏఎస్ సోమవారం మండలం పర్యటించారు. భాగ్యనగర్‌తండాను 5 గురు ట్రైనీ ఐఏఎస్‌లు రాజస్థాన్‌కు చెందిన నితిన్, రవీందర్, రాజశేఖర్, బీహార్ కు చెందిన ఆదర్శ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మదీష్, అంకిత్ సందర్శించారు. వారికి ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ ఇస్లావత్ సుజాతబన్సీలాల్, కార్యదర్శి సురేష్‌లు స్వాగతం పలికారు. శిక్షణలో భాగంగా గ్రామీణాభివృద్ధి, వివిధ శాఖ పని తీరు, నిర్వహిస్తున్న విధులపై చర్చించారు. 5 రోజుల పాటు భాగ్యనగర్‌తండా జీపీ కార్యాలయంలో బస చేసి క్షేత్ర స్థాయిలో ప్రజల అభివృద్ధి, సంస్కృతి సాంప్రదాయాలు, ఆహారపు ఆలవాట్లపై అవగాహన పెంచుకోనున్నారు.

ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- ఖమ్మం



ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏఎల్ఎంటి, ఏఆర్‌ఓలకు ఎన్నికల ప్రక్రియలో అర్హత, అనర్హత, నామినేషన్ స్క్రూటిని, విత్ డ్రాయల్స్, గుర్తుల కేటాయింపుపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, అధికారులు ఎన్నికల ప్రతి ప్రక్రియలో జాగ్రత్తలు వహించి, సమర్థవంతంగా విధులు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శ కాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నామినేషన్ స్క్రూటిని ప్రక్రియ ఎంతో కీలకమయినదని, నిబంధనల మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత వ్యక్తి, ఆయా నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రీయ, గుర్తింపు పొందని పార్టీల విషయమై మార్గదర్శకాల మేరకు నడవాలన్నారు. ఎస్సి, ఎస్టీ రిజర్వ్ స్థానాల్లో అభ్యర్థి ఆయా వర్గానికి చెందినవారై ఉండాలన్నారు. ప్రతి దశలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు నామినేషన్ స్క్రూటిని, గుర్తుల కేటాయింపు తదితరాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ గోపాల్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఏఎల్ఎంటి, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన కలెక్టర్

కల్లూరు/ పెనుబల్లి : కల్లూరు డివిజన్ పరిధిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, సిపి విష్ణు వారియర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ఠ నిఘా చర్యలు చేపట్టి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. కలెక్టర్, సోమవారం పోలీసు కమిషనర్ విష్ణు. యస్ వారియర్‌తో కలిసి తిరువూరు క్రాస్ రోడ్ చెక్ పోస్ట్, కల్లూరు మండలం పేరువంచ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ (తెలంగాణ-ఏపీ సరిహద్దు) చెక్‌పోస్ట్, ముత్తగూడెం గ్రామం విఎం బంజర వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ (తెలంగాణ-ఏపీ సరిహద్దు) చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆయన తెలిపారు. నగదు, మద్యం రవాణా నియంత్రించాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి చెక్ పోస్టులో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అప్రమత్తంగా వుంటూ, 24 గంటల పటిష్ఠ నిఘా పెట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి ప్రసాద్‌రావు, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, ఏసీపీ రామాంజనేయులు, తహశీల్దారు, అధికారులు తదితరులు ఉన్నారు.

బీఎల్ఓల పనితీరు బాగుంది : కలెక్టర్

వేంసూరు : మండల పరిధిలోని మొద్దులగూడెం వైయస్ బంజర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ విపి గౌతమ్ సోమవారం పరిశీలించారు. మొద్దులగూడెం గ్రామంలో మూతబడిన పాఠశాలను పరిశీలించి పోలింగ్ కేంద్రానికి ఉపయోగించాలని ఆదేశించారు. వైయస్ బంజర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి బిఎల్వోల పనితీరు గూర్చి గ్రామస్తులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సివిజన్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని గ్రామాలలో యూత్‌కి సివిజన్ వ్యాప్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను తక్షణమే విచారించటం జరుగుతుందని, దీని ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టి వారిని కట్టడి చేసే అవకాశం ఉంటుందని అన్నారు. కలెక్టర్‌తో పాటు ఆర్డిఓ అశోక్ చక్రవర్తి, ఎంపీడీవో రమేష్, ఎస్సై ప్రసాద్, డిటి కరుణ, ఆర్ఐ చిరంజీవితోపాటు బిఎల్వోలు ఉన్నారు.

శాంతి కోసం ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

పాలస్తీనా ఇజ్రాయిల్ కాల్పుల విరమణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-వైరాటౌన్



ఇజ్రాయిల్ పాలస్తీనా మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని నివారించాలని, శాంతి స్థాపనకు ఐక్యరాజ్యసమితి క్రియాశీలక పాత్ర పోషించాలని, సామాజిక కార్యకర్త పిట్టల రవి, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు కోరారు. సోమవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపుడి వెంకటేశ్వరరావు భవనం నందు వైరా స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పాలిస్తీనా ఇజ్రాయిల్ యుద్ధం పూర్వాపరాలు పైన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల రవి, బొంతు రాంబాబు మాట్లాడుతూ హమాస్ సంస్థ ఇజ్రాయిల్‌లో సాధారణ పౌరులు పైన దాడి చేయడం సరికాదని అన్నారు. ఆ దాడి ఆసరాగా తీసుకుని పాలస్తీనా స్వతంత్ర దేశంగా బతికే హక్కును ఇజ్రాయిల్ కాలరాస్తుందని అన్నారు. భారత దేశం జాతీయ ఉద్యమం గాంధీతో సహా పాలస్తీనా స్వతంత్రకు మద్దతు ప్రకటించింది కానీ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అమెరికా ఒత్తిడి మేరకు ఇజ్రాయిల్ కు అనుకూల ప్రకటన చేయడం సరికాదని అన్నారు. ఇజ్రాయిల్ గాజా ప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండా చేయడం ద్వారా లక్షల మంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అంతర్జాతీయ సమాజం స్పందించాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బొంతు సమత, మందడపు రామారావు, పారుపల్లి కృష్ణారావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి ప్రసాదరావు, షేక్ జమాల్, చిత్తారు మురళి, పాసంగులపాటి చలపతిరావు, శీలం నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : మంత్రి పువ్వాడ

నవతెలంగాణ-మధిర



రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. మధిర పట్టణంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రాంగణంలో జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మధిర అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్ రాజు అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి బూత్ కన్వీనర్లు, సభ్యులు సహా పార్టీ ముఖ్య నాయకులతో జరిగిన సభకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర అసెంబ్లీ నుండి ఈసారి శాసనసభలో అడుగు పెట్టేది లింగాల కమల్ రాజు అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి చేయలేని పనులు జడ్పీ చైర్మన్ హోదాలో లింగాల కమల్ రాజు చేసి మధిర ప్రజలకు అండగా నిలిచాడు అన్నారు. ఇప్పటికే లింగాల కమల్ రాజు గెలుపు ఖాయం అయిందని, బూతు స్థాయిలో పార్టీ శ్రేణులు మెజార్టీ కోసం అహర్నిశలు పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలను కాపీ కొట్టి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలుగా ప్రకటించిందని పేర్కొన్నారు. కెసిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని వారు తెలిపారు. సభలో ఐదు మండలాలతో పాటుగా మధిర మున్సిపాలిటీ నుండి పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ముష్టికుంట వాసి ఎంపిక

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన, ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని తిరువేదుల దుర్గాదేవి ఆల్ ఇండియా ఎంప్లాయిస్ జాతీయ కమిటీ పోటీలకు ఎంపికైంది. దుర్గాదేవి ప్రస్తుతం నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యా యురాలుగా పనిచేస్తుంది. రాష్ట్ర స్థాయిలో ఆగస్టు 18-19 తేదీలలో జరిగిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో దుర్గాదేవిని ఆల్ ఇండియా ఎంప్లాయిస్ జాతీయ కమిటీ పోటీలకు ఎంపిక చేశారు. అక్టోబర్ 16 నుంచి 20 వరకు న్యూఢిల్లీ త్యాగరాజన్ స్టేడియంలో నిర్వహిం చనున్న 2023-2024 ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఎంప్లాయిస్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో ఆమె పాల్గొననున్నది. దుర్గాదేవి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

డిజిటల్ మీడియా అసోసియేషన్ యూనియన్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఖమ్మం

నేటి తరం డిజిటల్ మీడియా వైపు చూస్తుందని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వేపార రంగాలకు అండగా నిలిచి ఆందోళనలు, పోరాటాలు, ధర్నాలు, మీడియా సమావేశాలు, వ్యాపార వాణిజ్య సముదాయాల ప్రారంభోత్సవాలు బహిరంగ సభలు సమావేశాలు నిరంతరం ప్రచారం చేస్తూ అన్ని రంగాల వారికి అండగా నిలవాలని కాంక్షిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా డిజిటల్ మీడియా అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని డిజిటల్ మీడియాను గుర్తించి ఆదరించి వినియోగించుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు ముళ్ళపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో నూతనంగా డిజిటల్ మీడియా అసోసియేషన్ ఏర్పాటు చేశారు. నూతన కమిటీ 12 మందిని ఎనుకున్నారు. అధ్యక్షులుగా ముళ్ళపాటి రామారావు, ప్రధాన కార్యదర్శిగా మందా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మార్కవుడి పురుషోత్తం, గరిడేపల్లి సత్యనారాయణ, నీరుడు రమేష్, సహాయ కార్యదర్శులు అమరబోయిన ఉపేందర్, తురక శ్రీను, కోశాధికారి రేపల్లె నాగశేఖర్, కమిటీ సభ్యులు చింత కొండల్ రావు, చంద్రశేఖర్ బోడపట్ల కార్తిక్ ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ ఛైర్మన్ తుపాకుల

నవతెలంగాణ-ముదిగొండ



మండలపరిధిలో వనంవారికిష్టాపురం గ్రామ మాజీ సర్పంచ్ మాజీమంత్రి తుమ్మల అనుచరుడు, ముదిగొండ సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండస్వామి హైదరాబాదులో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీలోకి తుమ్మలతో వెళ్లిన తుపాకుల ఇటీవల కాలంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరటంతో యలగొండస్వామి కూడా బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం విదితమే. రేవంత్ రెడ్డి సమక్షంలో యలగొండస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ప్రవల్లిక ఆత్మహత్య ప్రభుత్వ హత్య : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ- ముదిగొండ

గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడిందని మనస్థాపం చెంది హైదరాబాద్ ప్రైవేట్ హాస్టల్లో ఆత్మహత్య చేసుకున్న ప్రవల్లిక ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పోనుకుల సుధాకర్ అన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మునిగంటి సాయి, కొమ్ము మహేష్, బోడ వెంకట్, సిహెచ్ నవీన్, బంక శ్రీచరణ్, భాను, పవన్, గణేష్ స్వాతి, రజిని, శ్రావణి, మల్లేశ్వరి, ఈశ్వరి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి : చావా

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, రైతు బంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు చావా శివరామకృష్ణ అన్నారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సోమవారం చావా శివరామకృష్ణ జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ కార్యకర్తలు నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్లావత్ ఎంటెక్ రవి నరేష్, ఎంపిటిసి పాప నాయక్, కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్, ఉన్నం రాజశేఖర్, జాలా కిరణ్, పోట్ల ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ మోహన్‌నాయక్, రఫీ, కో ఆప్షన్ సభ్యులు షేక్ సైపుద్దిన్, ఉప సర్పంచ్ సిరిగద్దే ఉపేందర్, బత్తుల రవి కుమార్, నెల్లూరి భద్రయ్య, పోట్ల ప్రవీణ్, తాటికొండ కిరణ్, జడల నగేష్, షేక్ సైదా, షేక్ ఇమామ్, షేక్ సైదులు, పుసులూరి నరేష్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..రూ.80వేల నగదు సీజ్

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండలం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటు చేసిన చెక్పోస్ట్ దగ్గర వాహనాల తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా 80వేల రూపాయలు తీసుకు వెళుతుంటే సీజ్ చేసినట్లు ఎస్సై పి.రఘు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గుంటూరు నుండి భద్రాచలం వెళుతుండగా సోమవారం ఉదయం వాహనాల తనిఖీల్లో 80వేల రూపాయలు ఉండగా వారికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.



ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి

నవతెలంగాణ-కల్లూరు

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకునే విధంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎండీవో బి.రవికుమార్ అన్నారు. సోమవారం స్త్రీశక్తి భవన్‌లో కలెక్టర్ విపి గౌతమ్ ఆదేశాల మేరకు ఈ సమావేశంలో గ్రామ దీపికలకు, కమ్యూనిటీ, కోఆర్డినేటర్లకు ఎలక్షన్ నిబంధనలో పాటించాలని, ఎలక్షన్ కోడ్, సివిజన్ యాప్ గురించి అవగాహన కల్పించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లందరూ స్వచ్ఛందంగా అందరూ ఓటు వేసే విధంగా చూడాలని, 90 శాతం ఓటర్లు స్వచ్ఛందంగా పాల్గొనాలని, పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.వెంకట రామారావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు వెంకటేశ్వర్లు, శ్యామలాదేవి, వెంకట్రావమ్మ, ఫాతిమా, ఎస్తేరు, రాధారుక్మిణి, అపర్ణ, లక్ష్మి గ్రామదీపికలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించండి

- నోడల్ అధికారి రామన్



నవతెలంగాణ-చంద్రుగొండ

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని ఎన్నికల నోడల్ అధికారి ఆర్ డబ్ల్యుఎస్ డీఈ రామన్ సూపర్వైజర్లకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం లేకుండా సదుపాయాలు ఉండాలన్నారు. విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని 27 కేంద్రాలుండగా కొన్ని కేంద్రాల్లో సదుపాయాలు లేవన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎస్ఐ మాచినేని రవి, సూపర్వైజర్లు అక్బర్, సంతోష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జెకె సింగరేణి గ్రౌండ్‌లోనే దసరా ఉత్సవాలు

నవతెలంగాణ-ఇల్లందు



త్వరలో జరగనున్న దసరా ఉత్సవాలు జెకె సింగరేణి గ్రౌండ్‌లోనే నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మెన్ డివి తెలిపారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్‌లతో కలిసి గ్రౌండ్‌ను సోమవారం పరిశీలించారు. దశాబ్దాలుగా వైసూర్‌ను తలదన్నేలా పురపాలక సంఘం ఆధ్వర్యంలో జరిగే దసరా వేడుకలు ఈ నెల 23 తారీకున సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించబడునున్నట్లు చైర్మెన్ తెలిపారు. ఫారెస్ట్ గ్రౌండ్లో నిర్వహించేందుకు అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ జ్యూడిషనల్ డిపార్ట్మెంట్ చేతిలో ఉన్నందున పర్మిషన్ రాలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో ఫారెస్ట్ గ్రౌండ్ మున్సిపాలిటీ హ్యాండ్ వర్ చేసుకునేందుకు శక్తిని మించి ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, సయ్యద్ ఆజాం, మొగిలి లక్ష్మీ, కుమ్మరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- ముగింపు వేడుకల్లో డీఎస్పీ వెంకటేష్

నవతెలంగాణ-ములకలపల్లి

విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను గౌరవించాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరి విద్యనేర్పిన గురువులు సహకరించాలని గర్వపడే స్థాయికి ఎదగాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ ఆకాంక్షించారు. ములకలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నాలుగు రోజుల పాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడలు సోమవారంతో ముగిశాయి. ముగింపు క్రీడల్లో డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి "విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. తొలుత డీఎస్పీని విద్యార్థులు, గురుకులం యాజమాన్యం స్వాగతం పలికారు. అనంతరం గెలుపొందిన విజేతలకు సీఐ వినయకుమార్‌తో కలిసి బహుమతులు పంపిణీ చేశారు. జోనల్ పరిధిలోని రెండు జిల్లాల్లో 14 గురుకులాల నుంచి 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ క్రీడా పోటీలతో ములకలపల్లి గురుకుల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. క్రీడలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, క్యాంప్ ఫైర్ వంటి వివిధ కార్యక్రమాలు జోనల్ మీట్ ఆసక్తిగా మారాయి. తొలిరోజు ఈ క్రీడలను కలెక్టర్ ప్రియాంక అలా ప్రారంభించగా మిగిలిన మూడు రోజుల పాటు వివిధ స్థాయి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో ప్రత్యూష, డీసీవో వెంకటేశ్వర్లు, డీఎస్వో పరందామరెడ్డి, ఎంఈవో శ్రీరామమూర్తి, ప్రిన్సిపాల్ సునీత, 14 గురుకులాల ప్రిన్సిపాల్స్, పీఈటీ, పీడీలు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-మణుగూరు



రోడ్డు విస్తరణలో భాగంగా కూనవరంలో నిర్మిస్తున్న పనులను నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు గుడిపూడి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని కూనవరం రైల్వే గేట్ దగ్గర నుండి బాంబే కాలనీ వరకు వేస్తున్న తారు రోడ్డును నాణ్యతతో వేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో ప్రారంభం చేసిన రోడ్డు మధ్యలో కాంట్రాక్టర్ వదిలి వెళ్ళాడని, గ్రామ ప్రజలు సోషల్ మీడియాలో దుమ్ము, దూళితో అనారోగ్యం పాలు అయి అనేక ఇబ్బందులు పడుతున్నామని మెసేజ్‌లు పెట్టినట్ట తెలిపారు. స్పందించిన సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావులు సంబంధిత కాంట్రాక్టర్, అధికారులుతో మాట్లాడి ఇచ్చిన మాట ప్రకారం తారు రోడ్డును వేస్తున్నారన్నారు. పర్శిలించి అధికారులకు, కాంట్రాక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేసినట్టు తెలిపారు.

ఇల్లందు గడ్డమీద నీలి జెండా ఎగిరేస్తాం

- నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్

నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు గడ్డమీద నీలి జెండా ఖచ్చితంగా ఎగిరేస్తామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాదావత్ ప్రతాప్ అన్నారు. కరెంట్ ఆఫీస్ సెంటర్లో ఉన్న ఇల్లందు పార్టీ ఆఫీసులో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నందువలన బీఎస్పి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లతాకుల కాంతారావు, చిప్పలపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ అధ్యక్షులు సత్యనారాయణ, సీనియర్ నాయకులు గోపీనాథ్, రాయల శ్రీనివాసరావు, జ్ఞాన సుందరం, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీ పొందేందుకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయండి

- ఏఈ కావ్య

నవతెలంగాణ-పినపాక



ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ రాయితీ పొందేందుకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని ఈ. బయ్యారం విద్యుత్ శాఖ ఏఈ కావ్య కోరారు. సోమవారం ఆమె పినపాక మండలం ఈ బయ్యారం సబ్ స్టేషన్‌లో మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులు 100 యూనిట్లలోపు రాయితీని పొందేందుకు కచ్చితంగా కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హామీలను విస్మరించిన పాలకులు

- సీఐటీయూ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాలడుగు



నవతెలంగాణ-గుండాల

తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేక పోరాటాలు చేసిన స్కీం వర్కర్లను పర్మినెంట్ చేస్తానని ఇచ్చిన హామీలను పాలకులు విస్మరించారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. దీనికి ముందు సీఐటీయూ జెండాను శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ ఆవిష్కరించారు. అనంతరం మండల కన్వీనర్ వజ్జ సుశీల అధ్యక్షతన జరిగిన సభలో భాస్కర్ పాల్గొని, మాట్లాడుతూ.. కనీస వేతనాలు చెల్లించాలని అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ, వీఓఏలు, గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలు చేసినా పాలకులు కనీస వేతనాలు పెంచలేదన్నారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ల తప్ప అని చెప్పారు. కార్మిక వర్గాలకు కనీస వేతనాలు, పర్మినెంట్ చేస్తామని మ్యానిఫెస్టోలో పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ.. స్కీం వర్కర్లలో వంద శాతం కార్మికులు మహిళలే ఉన్నారని, ఈ మహిళలే సీఐటీయూ మండల కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం చరిత్రాత్మకమని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత హామీలు అమలు చేయకుంటే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మరో పోరాటం చేస్తామని అన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి మాట్లాడారు. ఈ సభలో పరిచయ కార్యక్రమంను మండల కో కన్వీనర్ పాయం సారమ్మ చేయగా సభలో సీఐటీయూ నేతలు గద్దల శ్రీనివాస్, అబ్దుల్ నబి, ఈసం వెంకటమ్మ, సుల్తాన, మండల నాయ కులు సుశీల, సారమ్మ, జవ్వాజి పద్మ, ఎం.డీ.నజ్మా, ఆదిలక్ష్మీ, లక్ష్మీ, అరెం కాంతారావు, ధనమ్మ, పూలమ్మ, కౌసల్య, వినోద, టీపీజీఎస్ జిల్లా నేత మల్లయ్య, సాయనపల్లి సర్పంచ్ దుగ్గి రామ్మూర్తి, సరోజ, సుశీల, జయసుధ, వరలక్ష్మి, పార్వతి, పద్మ, జయమ్మ, సునీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల నియమావళి అమలుపై ప్రతిష్ట పర్యవేక్షణ ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



నవతెలంగాణ-పాల్వంచ

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై ప్రతిష్ట పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయపు నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలకై అన్ని శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దారులు, ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయింపు జిల్లా ట్రెజరీ అధికారి కార్యాలయం నుండి ప్రభుత్వ సిబ్బంది డేటా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల విధులు ఎంతో ప్రధానమైనవి అని ఎవరికీ మినహాయింపు లేదని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమాలు డిసెంబర్ 5 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. 24 గంటలు ప్రతిష్ట ఎన్నికల ప్రవర్తన నియమావళి పై నియంత్రణ పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా ప్రభుత్వ కార్యాలయంలోనూ ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లు ఫోటోలు ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. సెక్టోరియల్ అధికారులుగా విధులు కేటాయించిన సిబ్బంది వారి వారి పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులను పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఎక్కడైనా లోపాలున్నట్లయితే తక్షణమే నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు వీల్ చైర్లు, మంచినీరు, విద్యుత్తు, మరుగుదొడ్ల సౌకర్యం ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కచ్చితంగా ఉండాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పనతో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఏర్పాటల్లో చివరి నిమిషం వరకు వేచి ఉండొద్దని చెప్పారు.

ఈ సమావేశంలో అదరపు కలెక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, డిఆర్ఓ రవీంద్రనాథ్, ఎన్నికల ప్రవర్తన నియమాలి పర్యవేక్షణ నోడల్ అధికారి జెడ్పి సీఈవో విద్యాలత, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



సర్క్యులర్ ప్రకారం లాభాల వాటా వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

సర్క్యులర్ ప్రకారం లాభాల వాటా వెంటనే చెల్లించాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మణుగూరు ఏరియాలో ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ముందుగా ప్రకటించిన విధంగా లాభాలు వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మణుగూరులో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశామన్నారు. ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకొని యాజమాన్యం కార్మికులకు ఇవ్వాల్సిన లాభాలను ఇవ్వకుండా మొండి వైఖరి ప్రదర్శిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీవీఎంవి ప్రసాద్, లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, ప్రభాకరరావు, విల్సన్ రాజు, బుచ్చిరెడ్డి, బిక్షపతి, సుమన్, శివకుమార్, శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులైన మాదినేని సతీష్, కొలిపాక సురేష్, పెండ్యాల నరేష్, ఎదులాపురం నరసింహారావు, పోలూరి నరేష్, షేక్ కరీముల్లాలు కమిటీగా ఏర్పడి సుమారు 15 రోజుల్లో విద్యార్థుల ఫోన్ నెంబర్లు సేకరించి అందర్నీ ఒక తాటిపైకి తెచ్చి సోమవారం ఘనంగా నిర్వహించారు. గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి మరణించిన కొందరు ఉపాధ్యాయులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ చదువు చెప్పిన రోజులను గుర్తు చేసుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నామని భక్తిశ్రద్ధలతో చదువుకున్న విద్యార్థులు అందరూ ఉన్నత స్థాయిలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు లక్ష్మీనరసింహ, విశ్వనాథరాజు, సూరి రామ్మూర్తి, వీరనారాయణ, నాగేశ్వరరావు, సునీల్, వాణి, మణెమ్మలు పాల్గొన్నారు.

ఎన్నికల సమరభేరిని మోగించిన వనమా

- బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆశీర్వదించండి



నవతెలంగాణ-పాల్వంచ

బీఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారాన్ని మోగించారు. పాల్వంచ మండలం రంగాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి, ప్రజలు ఉద్దేశించి ప్రసంగిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఆశీర్వదించండి, కారు గుర్తుపై ఓటేసి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ప్రార్థించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని, కేసీఆర్‌ను మళ్లీ మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఎన్నికల ప్రచార సభకు డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వనమా రాఘవేంద్రరావు, జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు, రైతు సమన్వయ సమితి కన్వీనర్ కిలారు నాగేశ్వరరావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్ కాపు సీతామాలక్ష్మి, జడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, ఎంపీపీలు మడివి సరస్వతి, బాదావత్ శాంతి, పెద్దమ్మ గుడి చైర్మన్ మహిపతి రామలింగం, సొసైటీ వైస్ చైర్మెన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్ కనకాల నారాయణరావు, పట్టణ మండల అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, మార్కెట్ కమిటీ చైర్మెన్ భూక్య రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మెన్ బత్తుల వీరయ్య, డైరెక్టర్ కాల్వ ప్రకాశరావు, నాయకులు కనగాల బాలకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, ముత్యాల వీరభద్రరావు, చల్లగుండ్ల వీరభద్రం, పెద్దమ్మ గుడి డైరెక్టర్లు ముత్యాల ప్రవీణ్, కాటారపు లక్ష్మీనారాయణ, బేతంశెట్టి విజయ్, వెంగళరావు, పాయం పాపయ్య, నాయకులు వీర్రాజు, నాగారం ఉపసర్పంచ్ చందు, కాసుల వెంకట్, అన్వర్ పాషా, నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భద్రాచలం గిరిజన గురుకులంకు పతకాల పంట...!

నల్గొండ ఆటల పోటీల్లో మెరిసిన గిరి బిడ్డలు

- మెగా, ఓవరాల్, వ్యక్తిగత చాంపియన్షిప్‌లు కైవసం
- బాలికలను అభినందించిన ఆర్సీఓ డేవిడ్ రాజ్



నవతెలంగాణ-భద్రాచలం

నల్గొండ జిల్లా దామరచర్లలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి గిరిజన గురుకుల క్రీడా పోటీలు ఈనెల 13, 14, 15వ తేదీల్లో జరిగాయి. అండర్ -14, అండర్-17, అండర్-19 విభాగాల్లో జరిగిన వివిధ పోటీల్లో... భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల బాలికలు పాల్గొని తమ అత్యుత్తమ క్రీడా ప్రతిభ చాటి మెగా, ఓవరాల్, వ్యక్తిగత చాంపియన్షిప్ కైవసం చేసుకోవడం గమనార్హం. అండర్-19 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్ బాల్, చెస్‌లో విన్నర్‌గా నిలిచారు. కోకో, వాలీబాల్‌లో రనర్స్‌గా నిలిచారు. హెచ్ఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న శ్రీ తేజ అథ్లెటిక్స్‌లో 100 మీ, 200 మీ, 400 మీ, లాంగ్ జంప్, హై జంప్, 4 ఇంటు 100 మీ రిలే, 4 ఇంటు 400 మీ రిలేలో ప్రథమ స్థానం, షాట్ పుట్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుని ఓవరాల్ ఛాంపియన్షిప్ పొందింది. 3000 మీ. ద్వితీయ స్థానం, 1500 మీ.లో ద్వితీయ స్థానాన్ని నవదీపిక సాధించింది. 400 మీ.పరుగు పందెంలో మహేశ్వరి ద్వితీయ స్థానం, 800 మీలో ఎం.అలేఖ్య ద్వితీయ స్థానం పొందింది. చదరంగంలో ధనుశ్రీ ప్రథమ స్థానం పొందింది. అండర్ 17 విభాగంలో విలువిద్యలో ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం, బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం లభించింది. అథ్లెటిక్స్‌లో కే.జాహ్నవి 800 మీ. పరుగు పందెంలో ప్రథమ స్థానం, అనుష్క 1500 మీ. పరుగుపందెంలో తృతీయ స్థానం, 3000 మీ. తృతీయ స్థానం, హై జంప్‌లో ప్రథమ స్థానం సాధించింది. 4 ఇంటు 100 మీ.లో ప్రథమ స్థానం, 4 ఇంటు 400 మీ.లో ప్రథమ స్థానం సాధించారు. ఇందు 200 మీ.పరుగు పందెంలో ప్రథమ స్థానం, షాట్ పుట్ లో ప్రథమ స్థానం, డిస్కుత్రోలో ప్రథమ స్థానం, 4ఇంటు100 మీ ప్రథమ స్థానం, లాంగ్ జంపులో తృతీయ స్థానం, హై జంప్‌లో తృతీయ స్థానం సాధించింది. అండర్ 17 విభాగంలో అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించింది. అండర్ 14 విభాగంలో ఆశ్వర్య ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం సాధించారు. లావణ్య 200 మీ.లో ద్వితీయ స్థానం, సుహాసిని 600 మీ.లో తృతీయ స్థానం, బి.కావ్య లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, కే.శ్రీజ చదరంగంలో ప్రథమ స్థానం, 4ఇంటు100 మీ రిలేలో తృతీయ స్థానం సాధించారు.

బాలికలను అభినందించిన ఆర్సీఓ

నల్గొండ జిల్లాలో మూడు రోజులపాటు జరిగిన గిరిజన గురుకులం బాలికల ఉభయ ఉభయ నల్గొండ ఖమ్మం జిల్లా స్థాయి జోనల్ క్రీడా పోటీల్లో మెగా, ఓవరాల్, వ్యక్తిగత చాంపియన్షిప్‌లు సాధించడమే కాకుండా, అన్ని విభాగాల్లో దాదాపు పై చేయి సాధించిన భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల బాలికలను భద్రాచలం ఐటిడిఏ ఏపీవో జనరల్, ఇంచార్జ్ ఆర్సీఓ డేవిడ్ రాజ్ అభినందించారు. సోమవారం ఆయన భద్రాచలం గిరిజన గురుకులం సందర్శించి ఆటల్లో గెలుపొందిన ప్రతి విద్యార్థినీ, ఈ విజయానికి దోహదపడిన పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, పీడీ, పీఈటీలను ఆయన ఎంతగానో మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భద్రాచలం ఐటిడిఏ పీఓ ప్రతీక్ జైన్ గిరి బిడ్డల విద్య ప్రగతితో పాటు, వారి శారీర దారుఢ్యానికి దోహదపడే క్రీడలను సైతం ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని, గురుకులాలు నేడు ఎంతో బలోపేతం అయ్యాయని అన్నారు. భద్రాచలం గిరిజన గురుకులం బాలికలు ఓవైపు ఎన్ఐటి, ఐఐటి, ఎంబిబిఎస్ సీట్లు సాధించి విద్యలో రాణించడమే కాకుండా, క్రీడల్లో సైతం మెరిసి బల అనిపించారని ఆయన ఎంతగానో అభినందించారు. గిరి బిడ్డలు భవిష్యత్తులో ఉన్నత రంగాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, కళాశాల, పాఠశాల అధ్యాప కులు, టీచర్స్, పీఈటి, పీడి, నాన్ టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను వంచించిన యాజమాన్యం : సీఐటియూ

నవతెలంగాణ-కొత్తగూడెం





సింగరేణి కార్మికులకు లాభాల వాట చెల్లింపులో సింగరేణి యాజమాన్యం కార్మికులను వంచన చేసిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహారావు ధ్వజమెత్తారు. సోమవారం లాభాల ఇన్సెంటివ్ నిలుపుదలకు వ్యతిరేకంగా కార్మికులు నిరసన తెలియజేశారు. కొత్తగూడెం ఏరియాలో జీకేటీసీ, పివికే, కోల్ టెస్టింగ్ ల్యాబ్ డిపార్ట్మెంట్లలో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మికులు ప్లకార్డులు ప్రదర్శించి, కార్మికులకు చెల్లించాల్సిన లాభాల వాటాను ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం నిలిపివేయడానికి వ్యతిరేకిస్తూ కార్మికులు ఆందోళనలు చేపట్టారని అన్నారు. ఈ సందర్భంగా మందా నరసింహారావు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ బకాయిలు సుమారుగా రూ.29 వేల కోట్లు ఇవ్వకపోవడంతో వేతనాలు కోసం తిరుగుతున్న సింగరేణి యాజమాన్యం ఈ నెల 4వ తేదీన సర్క్యులర్ ఇచ్చి 16వ తేదీన కార్మికులకు చెల్లింపు ప్రకటించారని తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఈ నెల 9న షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. నేడు ఎలక్షన్ పేరు చెప్పి వాయిదా వేయడం సరికాదని, లాభాల వాటా కంపెనీ నిధుల నుండి ఇస్తున్నారని, ఈ డబ్బులకు రాష్ట్ర ప్రభుత్వనికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి నిధులను తెలంగాణ అభివృద్ధికి వాడుకుంటూ అవి సరిపోనట్టు, తిరిగి కార్మికుల డబ్బులు చెల్లించకుండా ఆపే ప్రయత్నం విరమించి యధావిధిగా కార్మికుల బ్యాంకు ఖాతాలో లాభాల వాటాను వేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు)గా డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వై.వెంకటేశ్వర రావు, సూరం అయిలయ్య, ఎలగొండ శ్రీరామ్మూర్తి, గడల నరసింహారావు, పి.నాగేశ్వరరావు, కూరపాటి సమ్మయ్య, కరుణాకర్, గౌతం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | అక్టోబర్ 17, 2023 | www.navatelangana.com

పనులు వేగవంతం చేయండి ఇరిగేషన్ ఎస్ఈ

నవతెలంగాణ-దుమ్ముగూడెం



తాలిపేరు ఎడమ ప్రధాన కాలువ తూడికాడ పనులు త్వరితగతిన పూర్తి చేసి, తాలిపేరు చివరి భూములకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం తాలిపేరు కాలువ వద్ద జరుగుతున్న పనుల తీరును ఆయన పరిశీలించారు. కాలువ మొదటి భాగం నుంచి చివరి భాగం వరకు ఇప్పటి వరకు జరిగిన పనులను ఆయన పరిశీలించారు. రామారావుపేట నుంచి నడికుడి వరకు రెండు జేసీబీలతో త్వరితగతిన పనులు చేపట్టాలని ఆయన ఆదేశాల మేరకు అధికారులు ఆ పనులను సత్వరమే అమలు చేశారు. మిషనరీ దిగని ప్రాంతాల్లో కూలీలతో చేయించే పనులపై ప్రత్యేక పరిశీలన పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఈ మధుసూధన్ రావు, ఏఈ రాజ్ సుహాస్ తదితరులు ఉన్నారు.

విజయ విఘ్నేశ్వర సిల్క్స్‌ను ప్రారంభించిన హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు



పట్టణంలో జర్నలిస్టులు వివేకానంద ప్రమీల, విజ్ఞాన్ లావణ్య భాగస్వామ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ విఘ్నేశ్వర సిల్క్స్‌ను సోమవారం ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ప్రారంభించారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దిండిగల రాజేందర్, రాష్ట్ర నాయకులు భానోత్ హరి సింగ్ నాయక్, 18 వార్డ్ కౌన్సిలర్ పోబోలు స్వాతి కిరణ్, 15వార్డ్ కౌన్సిలర్ చీమల సుజాత, 24 వార్డ్ కౌన్సిలర్ వాంగుడోత్ తార, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ ఇంచార్జ్ సుధీర్ తోతల, ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పనుల పురోగతిపై నివేదికలు ఇవ్వాలి

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలని కలెక్టర్ ప్రియాంక అలా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ పనులు పురోగతిపై బయోమెట్రిక్ హాజరు, అంగన్వాడీ కేంద్రంలో రైన్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి తగు చర్య నిమిత్తం ఆయా శాఖల అధికారులకు సమస్యలపై సిఫార్స్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ఇంజనీరింగ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు వారి వారి శాఖ పరంగా చేపట్టిన పనులు పురోగతిపై నివేదికలు అందజేయాలని చెప్పారు. గ్రౌండ్ చేసి జరుగుతున్న పనులపై మాత్రమే నివేదిక అందజేయాలని ఎన్నికల ప్రవర్తన నియమి గ్రామాల్లో ఉన్నందున నూతనంగా ఇలాంటి పనులు చేపట్టడానికి అనుమతి లేదని చెప్పారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని చెప్పారు. కొన్ని శాఖల బయోమెట్రిక్ ఆదర్శ శాతం తక్కువగా నమోదు కావడం పట్ల ఆయా శాఖల అధికారులకు షోకేస్ నోటీసు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవోకు సూచించారు. ప్రభుత్వ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని చెప్పారు. ప్రతివారం బయోమెట్రిక్ హాజరుపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, శాఖల అధికారులు తప్పనిసరిగా సిబ్బంది ద్వారా బయోమెట్రిక్ హాజరు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 324 అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన ఇంకుడు గుంతల ప్రగతి సమీక్షించారు. ప్రతివర్షపు నీరు చుక్కన సద్వినియోగం చేసుకునేందుకు భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టిన జల సంరక్షణ చర్యల్లో భాగంగా ఇంకుడు నిర్మాణాలను పూర్తి చేయాలని చెప్పారు. భూమిలోకి ఇంకింప చేసేందుకు తద్వారా భూగర్భ జలాలు పెంపొందించడానికి చర్యలు సత్ఫలితాయని చెప్పారు. పనుల పురోగతిని ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ శుక్రవారం తనకు నివేదిక అందజేయాలని సంబంధిత అధికారికి సూచించారు. పూర్తి చేసిన పనులకు ఎంబిలో నమోదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదరపు కలెక్టర్ రాంబాబు, మధుసూదన్ రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహణకు స్థలాలను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఇల్లందు

అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న సీఎం కేసీఆర్ ఇల్లందులో జరగనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం "ప్రజా ఆశీర్వాద సభ" ఏర్పాట్లను పరిశీలించారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోతు హరిప్రియ హరిసింగ్ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులతో కలిసి లలితాపురం చిల్లా ముబారక్ సమీపాన ఖాళీ ప్రదేశాన్ని, జే.కే.కాలనీలోని సింగరేణి గ్రౌండ్స్, రస్స్ అండ్ గోల్స్ మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు సింగరేణి గ్రౌండ్స్‌లో స్థానిక క్రీడాకారులతో క్రికెట్ ఆడి వారికి ప్రోత్సాహకరంగా 10వేలు అందజేశారు. ఈ పర్యటనలో ఎంపీ రవిచంద్ర వెంట ఎమ్మెల్యే హరిప్రియ, రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, శీలం రమేష్, నాదెళ్ల శ్రీనివాస్ రెడ్డి, కొక్కు నాగేశ్వరరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు రంగనాథ్, వద్దిరాజు రవిచంద్ర అనుచరులు వెంపటి ఉపేందర్, భానుప్రతాప్, గుమ్మడెల్లి హరీష్ తదితరులు ఉన్నారు.



లాభాల వాటా వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికులకు ఎలక్షన్ కోడ్ పేరుతో నిలిపివేసిన లాభాల వాటా వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ బ్రాన్ సెక్రెటరీ వై.రాంగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు మణుగూరులోని అన్ని మైన్స్ డిపార్ట్మెంట్‌ల వద్ద ఉన్నతాధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం అక్టోబర్ 4వ తేదీన లాభాల వాటా చెల్లింపు, అక్టోబర్ 16వ తేదీన చెల్లిస్తామని ప్రకటించిందని ఎలక్షన్ కమిషన్ అక్టోబర్ 9న తెలంగాణ ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటించిందన్నారు. సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్న లాభాల వాటా సింగరేణి యాజమాన్యం చెల్లిస్తుందని ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది ఏమీ లేదని అన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు 13 కొడ్‌లు లాభాల వాటా చెల్లింపునకు అడ్డంకి కాదని అన్నారు. కోడి ఇండియాలో పీఎల్ఆర్ బోనస్ అక్టోబర్ 21వ తేదీన చెల్లిస్తున్నారని ఇందులో ఎలక్షన్‌లో ఉన్న మధ్యప్రదేశ్, చత్తీస్గడ్ రాష్ట్రాలలో కూడా ఈ బోనస్ చెల్లిస్తున్నారని అన్నారు. అక్కడ వర్తించని కోడ్ తెలంగాణకి మాత్రమే ఎలా వర్తిస్తుందని అన్నారు. పండుగ సందర్భంలో మేనేజ్మెంట్ లాభాల వాటా నిలిపివేయడం, కార్మికులను నిరాశపరిచిందని అన్నారు. కార్మికులు అహర్నిశలు కష్టపడి సంస్థకు లాభాలు చేకూర్చారని లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పోరాట ఫలితం లాభాల వాటా అని, వెంటనే చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ పుల్లారావు, ట్రెజరర్ ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్ నంబూరు శ్రీనివాసరావు, సురేందర్, పిట్ సెక్రటరీలు గుంపెన శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, బండారు రవి, సాయి ప్రకాష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సత్యవతి మృతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు కుంజా సత్యవతి ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భద్రాచలంలోని ఆమె నివాసంలో తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో హాస్పిటల్‌కి తరలిస్తుండగా మృతి చెందినట్టు సమాచారం. కుంజ సత్యవతి 2009లో కాంగ్రెస్ పార్టీ భద్రాచలం అభ్యర్థిగా గెలుపొందారు. రానున్న ఎన్నికలలో బీజేపీ అభ్యర్థిగా ఆమె సీటు దక్కించుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆమె రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. సీపీఐ(ఎం) ప్రస్థానాన్ని ప్రారంభించి పార్టీ తరపున వైస్ ఎంపీపీగా పనిచేశారు. 2009లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆకర్షలో సీపీఐ(ఎం) పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె ఓటమిపాలయ్యారు. మారిన రాజకీయ సమీకరణలో 2018లో బీజేపీ తరఫున పోటీ చేసి మరోసారి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, భద్రాచలం నియోజవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



కుంజ సత్యవతి సొంత ఊరు విఆర్‌పురం మండలం ఒడ్డుగూడెం గ్రామం. ఆదివాసి కుటుంబంలో పుట్టి అంచలు అంచలుగా ఎదుగుతూ ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఆమె హఠాత్తుగా మృతి చెందడం పట్ల పట్టణ వాసులు దిగ్భ్రాంతి చెందారు.

కుంజా సత్యవతి మృతదేహానికి నివాళులర్పించిన ప్రముఖులు

మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మృతదేహానికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, సీనియర్ నాయకులు ఎలమంచిలి రవికుమార్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, లీలావతి, జి.పద్మతో పాటు పార్టీ బృందం నివాళులర్పించారు. స్థానిక శాస సభ్యులు పోదెం వీరయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సరళ నరేష్, భోగాల శ్రీనివాస్ రెడ్డి, చింతిరియాల రవికుమార్‌తో పాటు కాంగ్రెస్ బృందం నివాళులర్పించారు. వీరితోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు, కొడిశెట్టి కృష్ణమూర్తి, అరికెల తిరుపతిరావు తదితరులు నివాళులర్పించారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా దేవదానం, లాయర్ పాయం రవివర్మ, కొలిచలం నవీన్‌తో పాటు ఇతర న్యాయవాదుల బృందం సత్యవతి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వీటితో పాటు మాజీ ఎమ్మెల్యే, పట్టణ ప్రముఖులు గాదే మాధవరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు వెంకటరెడ్డి, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు ఎస్.కే.అజీ, రాష్ట్ర నాయకులు కొడాలి శ్రీనివాసన్, ఏవీఎస్పీ నాయకులు సోంది వీరయ్య తోపాటు ఇతర గిరిజన సంఘం నాయకులు, ప్రముఖులు నివాళులు అర్పించగా సీనియర్ పాత్రికేయులు శ్రీహరి, కుప్పల నాగరాజు, రాజా కిరణ్, జక్కిరెడ్డి సంతోష్ కుమార్, తదితరులు కుంజా సత్యవతి కుటుంబాని ఓదార్చారు.

గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ

- బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్

నవతెలంగాణ పాల్వంచ

నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేష్ అన్నారు. సోమవారం మన కొత్తగూడెం-మన కామేష్ పేరుతో మండలంలోని రేగులగూడెం, మామిడి గూడెం, చంద్రలగూడెం, మల్లారం గ్రామాల్లో ఇంటి ఇంటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా పూలే, అంబేద్కర్, కాన్షిరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు వసుంధర, ప్రవీణ్ కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండి రమణి, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు కేతిని కుమారి, రాజేశ్వరి, మర్థమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తెల్లం తిరుపతిరావు మృతి

- నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని పాత మారేడుబాక గ్రామానికి చెందిన తెల్లం తిరుపతిరావు (45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తిరుపతిరావు మృతదేహాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణ మూర్తి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మలు సందర్శించి నివాళులర్పించారు. వీరితో పాటు పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండీ జాని పాషా, ఉపాధ్యక్షులు తునికీ కామేశ్వరరావు, ఎంపీటీసీ పొడి తురుపతిరావు, సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాసరావు, యూత్ కార్యదర్శి జిలకర గంగరాజు, కుర్సం భాస్కర్, జంగిటి రాము, కుర్మం సర్వేశ్వరరావు, మున్న తదితరులు భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రజామోద మ్యానిఫెస్టో..

- సీఎంకు కృతజ్ఞతలు
- మాజీ ఎంపీపీ చిట్టిబాబు

నవతెలంగాణ-జూలూరుపాడు



సీఎం కేసీఆర్ దేశం గర్వించదగ్గ పథకాలు ప్రవేశపెట్టిన అపర భగీరథుడని ఆయన నేతృత్వంలో ఆదివారం విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రజా ఆమోదంగా ఉందని, అందుకు కేసీఆర్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మాజీ ఎంపీపీ మూడు చిట్టిబాబు తెలిపారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా రాష్ట్రంలో పరిపాలన కొనసాగిందని, బంగారు తెలంగాణ లక్ష్యంగా సాగిన పరిపాలనలో ప్రజలకు అనేక రకాల పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గత పథకాలను కొనసాగిస్తూ అనేక మైనటువంటి కొత్త పథకాలను ప్రవేశపెట్టి చేయూతను అందించటంతో పాటు అనేక పథకాలను వినూత్నమైన రీతిలో ప్రవేశపెట్టి ఎన్నికలకు సిద్ధమైన కేసీఆర్‌కు మూడోసారి ముఖ్యమంత్రి చేసి రుణం తీర్చుకోవాలన్నారు.

సోషల్ మీడియా ప్రచారాన్ని ఖండించిన ఎడవల్లి

నవతెలంగాణ-పాల్వంచ



బీఆర్ఎస్ పార్టీకి వెళుతున్నానని సోషల్ మీడయాలో కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీకి విదేయుడిని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ తెలిపారు. టికెట్ విషయంలో ఏఐసీసీ పీసీసీలో నా పేరు కూడా ఉందని, కావాలని నా మీద అసత్య ప్రచారాలు చేయడం సమంజసం కాదని తెలిపారు

బీఆర్ఎస్ పార్టీ, గ్రంథాలయ డైరెక్టర్ పదవికి రాజీనామా

నవతెలంగాణ-ఇల్లందు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పదవికి, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు డైరెక్టర్ అక్కిరాజు గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎంతో చురుగ్గా పని చేసినప్పటికీ ప్రాధాన్యత ఇవ్వకుండా పట్టించుకోలేదని, రాజీనామా లేఖలను జిల్లా పార్టీ అధ్యక్షుడికి, స్థానిక ఎమ్మెల్యే హరిప్రియకు పంపినట్లు తెలిపారు. ఆమోదించాల్సిందిగా కోరారు.

పాముకాటుకు మహిళ మృతి

నవతెలంగాణ-ములకలపల్లి

పాము కాటు వేయడంతో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని కొమరం భీం గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొమరం భీం గ్రామానికి చెందిన వెకా దేవి(45) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు దేవిని మంగపేట పీహెచ్సీకి తరలించి వైద్యం చేయించి ఇంటికి తీసుకువచ్చారు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే పరిస్థితి విషమించి దేవి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా గిరిజన గ్రామం కావడంతో పాటు కరెంటు లేకపోవడంతో విషసర్పం కాటుకు గిరిజన మహిళ మృతి చెందినట్టు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ ఆరోపించారు.

పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

- రేవంత్ రెడ్డికి న్యాయవాదుల వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల సమస్యలను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలని కోరుతూ అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ప్రధాన బాధ్యులను కలిసి వినతి పత్రం సమర్పించే కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డిని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ బార్ అసోసియేషన్ల రాష్ట్ర నాయకత్వం కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. ఇటీవల కాలంలో న్యాయవాదులపై విపరీతంగా పెరిగిన భౌతిక దాడులను అరికట్టడం కోసం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నుండి ప్రతి యేటా ఇస్తున్న ఆరోగ్య బీమా కవరేజీని ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల నుండి రూ.10 లక్షలు పెంచాలని, రాష్ట్రంలోని యువ న్యాయవాదులకు బీమా కవరేజీని విస్తరింపచేయలని, అయిదు సంవత్సరాల కంటే తక్కువ స్టాండింగ్ ఉన్న యువ న్యాయవాదులకు ప్రతి నెల రూ.10వేలు స్టైపెండ్ అందించి వారు వృత్తిలో నిలబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమున్న పేద న్యాయవాదులకు ఇళ్ల స్థలం లేదా, డబుల్ బెడ్రూమ్ కేటాయించాలని, న్యాయవాదుల సంక్షేమానికి రూ.500 కోట్లు మంజూరు చేయాలని, తెలంగాణాలో 41ఏ సీఆర్‌పీసీని సవరించాలని, ఈ సమస్యలను ఎన్నికల ప్రణాళికలో పొందు పరచాలని విజ్ఞప్తి చేశారు. అందుకు రేవంత్ రెడ్డి స్పందిస్తూ, ఈ వినతి పత్రాన్ని మ్యానిఫెస్టో కమిటీ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు పంపిస్తానని హామీ ఇచ్చారు. ఆదివారం ఫెడరేషన్ ప్రతినిధుల కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కూడా కలిసి వినతి పత్రం సమర్పించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్‌ల ఫెడరేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ (నాంపల్లి), వర్కింగ్ ప్రెసిడెంట్ ఢీకొండ రవీందర్ (రంగారెడ్డి), ప్రధాన కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి (మేడ్చల్ మల్కాజిగిరి), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్ (కొత్తగూడెం) తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపోటములు శాసించేది కమ్యూనిస్టులే

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-అశ్వాపురం



వచ్చే ఎన్నికలలో గెలుపోటములను శాసించేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సమగ్రత, సమైఖ్యతకు విఘాతం కలిగించే బీజేపీని గద్దె దింపేందుకు ప్రజా స్వామిక లౌకిక శక్తులు ఏకం కావాలన్నారు. మతోన్మాదం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ఆర్ఎస్ఎస్ ఆదేశాలను అనుసరిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతూ, రాముని పేరు జపిస్తూ రాక్షస పాలన సాగుస్తున్నారన్నారు. రాజ్యాంగ పరమైన పాలన సాగాలి కానీ సొంత ఎజెండాను ప్రజలపై రుద్ది పరిపాలిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. దేశంలో ధరలు నానాటికీ పైపైకి పోతున్నాయని, వాటిని అదుపుచేయడంలో మోడీ విఫలమయ్యారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యవసరాల ధరలతో సామాన్యుడు మనుగడ సాగించే పరిస్థితి లేదని, దీనికి పాలకుల విధానాలే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్ది వెంకటరెడ్డి, అనంతనేని సురేష్, మేలపుర సురేందర్ రెడ్డి, రాయపూడి రాజేష్, ముత్తిబోయిన వెంకటేశ్వర్లు, ఈనపల్లి పవన్ సాయి, దండి నాగేష్, నవీన్, అక్కనపల్లి నాగేంద్రబాబు, ఇరుగు శ్రీకాంత్, రెడ్డిబోయిన వెంకన్న, ముద్దుశెట్టి నరసింహారావు, మహిళా మండల నాయకులు, తెల్ల వెంకటరమణ, తురక అచ్చమ్మ పాల్గొన్నారు.



మేడా మోహన్ రావు కుటుంబ సభ్యులు పరామర్శించిన నామ

నవతెలంగాణ-చంద్రుగొండ

బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మేడా మోహన్ రావు కుటుంబ సభ్యులను ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మేడ మోహన్ రావు తండ్రి మేడా కృష్ణయ్య (65) మృతి చెందారు. విషయం తెలుసుకున్న నామా సోమవారం ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్త కారాయి గూడెంలోని మోహన్ రావు ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఏ చిన్న కష్టం వచ్చినా ఆ కుటుంబానికి ఎల్లవేళలా తాను అండగా ఉంటానన్నారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా మీకు నావంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నలమల్ల వెంకటేశ్వరరావు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు (బాబు), గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, మండల ఉపాధ్యక్షులు మద్దిరాల చినపిచ్చయ్య, ఓరుగంటి రాములు, గాలం రవి, కాశిని సీతారాములు, జగన్ , తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత్ కలాష్ యాత్ర

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్ అధ్యక్షతన మేరీ మిట్టీ మేరీ కలాష్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరంగం రామలింగేశ్వరరావు హాజరయ్యారు. విద్యార్థులచే అమృత్ కలాష్ యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలోని మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశంలోని అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి గ్రామం నుంచి ఢిల్లీలోని కర్తవ్య పథ్కు మట్టిని తరలించి అందులో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సేకరించిన మట్టిని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణకి పంపిస్తే వారు ఢిల్లీకి పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మరో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విలియం ప్రసాద్, లైబ్రరీ శ్రీ ఖాసిం, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని చెరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల పూజారి గుంపు, కోన బోయిన వారి గుంపులో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యురాలు ఉషారాణి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది ఈశ్వరి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | అక్టోబర్ 17, 2023 | www.navatelangana.com

గెలిచే స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కచ్చితంగా బరిలో నిలుపుతాం

నవతెలంగాణ-కొత్తగూడెం

గెలిచే స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కచ్చితంగా బరిలో ఉంటామని, సీటు, వదులు కోమని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని హైదరాబాదులో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, పీఎస్ఆర్ అభిమానులకు హామీ ఇచ్చారు. కొత్తగూడెం నియోజకవర్గ స్థానాన్ని కాంగ్రెసు పార్టీ అభ్యర్థికేనని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత కొన్ని రోజులుగా వివిధ మాధ్యమాలలో కొత్తగూడెం ఎమ్మెల్యే సీటుపై ప్రసారం అవుతున్న వార్తల్లో నిజం లేదని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం స్పష్టం చేసింది. ఈ విషయంపై స్పష్టత రాలేదని, కాబట్టి ఎవరు కూడా దయచేసి ఆవేదన చెందవద్దు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వూకంటీ గోపాలరావు, ఆళ్ళ మురళి, ఆకునూరి కనకరాజు, నాగేంద్ర త్రివేది బొదసు కనక రాజు, మైనారిటీ జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీ ఎండీ ఖలీల్, కుంచం వెంకటేష్, పొంగులేటి అభిమానులు పాల్గొన్నారు.



అవకాశవాది తుమ్మల

అయిదేళ్లకోసారి పార్టీ మారే మహానుభావుడు

ఆయనతో బీఆర్ఎస్, కేసీఆర్ కు ఒరిగిందేమీ లేదు

పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో బీఆర్ఎస్‌కు ఒరిగిందేమీ లేదని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఖమ్మం ముస్తఫానగర్ లో పారా ఉదయ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తన మీద పోటీ చేస్తే తుమ్మలను మళ్లీ ఓడిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ ఓ మహానుభావుడు అవకాశవాదంతో ప్రతి అయిదేళ్లకు ఓ పార్టీ మారుతూ వస్తున్నాడని తుమ్మలను ఉద్దేశించి విమర్శించారు. ఆయనకు కేసీఆర్ అనేక అవకాశాలు ఇచ్చారన్నారు. ఓడిపోయి ఇంట్లో కూర్చున్న తుమ్మలను పిలిచి మంత్రి పదవి ఇచ్చి, ఎమ్మెల్సీని చేసి, ఆ తర్వాత ఎమ్మెల్యేగా చేసి, అనంతరం జిల్లా బాధ్యతలు అప్పగించి గెలిపించమంటే 2018 ఎన్నికల్లో ఖమ్మంలో గుండు సున్నా చుట్టారన్నారు. ఆ ఎన్నికల్లో తానొక్కడినే గెలిచానని పువ్వాడ అన్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వల్ల బీఆర్ఎస్‌కు ఒరిగిందేమీ లేదని మంత్రి పువ్వాడ అన్నారు. కానీ ఆయనకు మాత్రం కేసీఆర్ ఎంతో చేశారని చెప్పారు. అయినా తమకు అన్యాయం జరిగిందని, టిక్కెట్ రాలేదని కేసీఆర్‌ను తూలనాడుతూ మాట్లాడుతున్నాడన్నారు. 2018లో ఒకరిపై మరొకరు కత్తి దూసుకొని తొమ్మిది సీట్లలో ఓడగొట్టారని, తాను మాత్రమే వారిద్దరి కత్తిని తప్పించుకొని గెలిచానన్నారు. ఆ రోజు కత్తులు దూసుకున్న వారిద్దరూ ఖమ్మంపై బందిపోట్లలా పడ్డారన్నారు. తాను బీ-ఫారం తీసుకునేందుకు హైదరాబాద్ వెళ్తే ఖమ్మంలో కొందరు బందిపోటు దొంగలు చొరబడ్డారన్నారు. దమ్ముంటే తాను ఖమ్మంలో ఉన్నప్పుడు వస్తే వారికి సినిమా చూపించేవాడినన్నారు. మొన్న ఎన్టీఆర్‌ను, నిన్న చంద్రబాబులను మోసం చేశాడని, ఇప్పుడు కేసీఆర్‌నూ మోసం చేశాడని ఆరోపించారు. రేపు కాంగ్రెస్ పార్టీని మోసం చేయడనే గ్యారెంటీ ఏమిటన్నారు. పాలేరులో గెలిపిస్తే అక్కడకు వెళ్తారని, లేదంటే ఖమ్మం వస్తాడన్నారు. ఆయనకు ఖమ్మం రెండో ప్రాధాన్యత అన్నారు. ఖమ్మంలో అత్యధిక సీట్లలో బీఆర్ఎస్ ను గెలిపించాలని కోరారు. ఈ సమ్మేళనంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్ మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.



పలు కుటుంబాలకు మట్టా రాగమయి పరామర్శ

నవతెలంగాణ- కల్లూరు

మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన గండేపల్లి వెంకటేశ్వర్లు దశదిన కర్మకు సోమవారం సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఆ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కత్తి కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపిరెడ్డి, ఏనుగు సత్యంబాబు, లక్ష్మణరావు, రాంబాబు, వెంకట రామారావు, శ్రీను, కొండలరావు, వేల్పుల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, అకేటి కొండ, అకేటి కిషోర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ డిక్లరేషన్ ప్రజలకు భరోసా

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ తెలంగాణ ప్రజలకు పూర్తి భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలంనో మాధారం, గోవింద్‌తండా, భజ్యాతండా, బొక్కలతండా, భాగ్యనగర్‌తండా, ఆల్యాతండా, ఉసిరికాయలపల్లి గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ 6 డిక్లరేషన్లపై వివరించారు. ఉసిరికాయలపల్లి కోటమైసమ్మతల్లి ఆలయంలో పూజలు చేసిన బాలాజీనాయక్ ఆల్యాతండాలో జరిగిన బతుకమ్మ వేడుకలలో బాలాజీనాయక్ అయన సతీమణి బానోత్ పద్మలతో కలిసి పాల్గొని మహిళలతో ఆడుతూ పాడుతూ సందడి చేశారు. బొక్కలతండాలో దుర్గాదేవి మండపంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మహిళలు హారతులతో ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కేసీఆర్ పాలనంతా అవినీతి, పక్షపాతంతో నడిచి అర్హులకు ప్రభుత్వం ఫలాలు అందలేదని విమర్శించారు. అందరికి సమాన ఫలాలు అందలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ షేక్ అప్సర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గుగులోత్ హర్షానాయక్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షులు నునావత్ సాయికిరణ్, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు, నాయకులు షేక్ పాష, బానోత్ నరేష్, బానోత్ వినోద్, ఇస్లావత్ శేషు, బర్మావత్ కృష్ణ, అజ్మీర కుమార్, బాదావత్ భద్రు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీవోకి వినతి

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం రిజిస్ట్రేషన్ యూనియన్‌ని కొనసాగించాలని కోరుతూ ఖమ్మం డిఆర్‌డిఓకి యూనియన్ జిల్లా అధ్యక్షులు కే.నరేందర్‌రెడ్డి, కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎల్‌వన్, ఎల్‌టులోని కొంతమంది ఉద్యోగస్తులు జిల్లా రిజిస్ట్రేషన్ ప్యానల్ అనుమతి లేకుండా ఇదే రిజిస్ట్రేషన్ యూనియన్ పేరు మీద యూనియన్ ఎన్నిక చేసుకొని పేపర్ ప్రకటనలు వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడం జరిగిందని అన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ- పెనుబల్లి

పెనుబల్లి మండల పరిధిలోని గణేష్‌పాడు మామిడి తోటలో కోడి పందాలను ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సూరజ్ తెలిపారు. వారి వద్ద నుండి ఒక కోడి పుంజును, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 5,900 నగదు, 14 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

కాలుష్యం కోరల్లో ముదిగొండ

వాహనాల రద్దీతో పెరిగిన కాలుష్యం

- పారిశ్రామిక ప్రాంతంలో అధికం
- వ్యాధుల బారినపడిన కార్మికులు, ప్రజానీకం

నవతెలంగాణ-ముదిగొండ




ఇంటి నుండి రోడ్డెక్కితే చాలు దుమ్ము, దూళితోపాటు, వాహనాల కాలుష్యం గమ్యం చేరేంతవరకు వెంటాడుతుంది. ముదిగొండ ప్రజలతోపాటు, మండలంలోని వివిధ గ్రామాలు, ఇతర ప్రాంతాల నుండి రాకపోకల కొనసాగించే ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కాలుష్యం కోరల్లో చిక్కి అనారోగ్య బారిన పడుతున్నారు. కోదాడ, ఖమ్మం, వల్లభి ముదిగొండ, జగ్గయ్యపేట, విజయవాడ వరకు ముదిగొండ రోడ్డు మార్గం నుండి వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా కోదాడ,ఖమ్మం,ముదిగొండ, వల్లభి వరకు మండలంలోని వివిధ గ్రామాల నుండి పనుల నిమిత్తం పల్లె ప్రజలు, మహిళలు, రైతులు ఉద్యోగస్తులు, కార్మికులు, విద్యావంతులు విద్యార్థిని, విద్యార్థులు, వ్యాపారస్తులు, వాహనదారులు, ప్రయాణికులు,వందల మంది ఈరోడ్లలో ప్రయాణాలు నిర్వహిస్తున్నారు. వాహనాల రద్దీ పెరగటంతో కాలుష్యం అధికమై ప్రజలు పలు వ్యాధుల బారిన పడుతున్నారు ముఖ్యంగా ముదిగొండ, ఖానాపురం, పండ్రేగుపల్లి, వెంకటాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాలు పారిశ్రామికంగా అభివృద్ధి కావటంతో గ్రానైట్, కంకర మిల్లులు పరిశ్రమలు, క్వారీలు భారీ స్థాయిలో ఏర్పడి కొనసాగుతున్నాయి. పెరిగిన పారిశ్రామిక అభివృద్ధితోపాటు,గ్రానైట్ పరిశ్రమలకు ముడిసరుకు దిగుమతి, ఎగుమతి చేసుకునేందుకు ముదిగొండకు రవాణా వ్యవస్థ భారీగా పెరిగింది. దీంతో వాహనాలు వందల సంఖ్యలో రోడ్డుపై తిరుగుతున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి అయిన ముదిగొండ పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతోపాటు, వాహనాల నుండి వచ్చే నల్లని పొగ, రోడ్డుపై వాహనాల వెళుతుంటే లేసే, దుమ్ము, దూళి ప్రయాణికులు, వాహనదారుల కళ్ళు,నోట్లోకి వెళ్లి కాలుష్యానికి గురై చర్మవ్యాధులతోపాటు, దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల శ్వాసకోశ రోగాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో ముదిగొండ గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వలస వచ్చి ఇక్కడే పనిచేస్తూ జీవిస్తున్నారు. వాహన కాలుష్యం భారీ స్థాయిలో ఉండటంతో ముదిగొండ గ్రానైట్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులలో103 మంది కార్మికులు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి ఇప్పటివరకు దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలతో కార్మికులు,వాహనదారులు ముదిగొండ పిహెచ్సిలో 103 మంది నమోదై వైద్యసేవలు పొందటం విశేషం. వీరే కాకుండా మరి కొంతమంది కాలుష్యానికి గురై ఇబ్బంది పడుతున్నారు. సర్వీస్ పూర్తయిన వాహనాలు రోడ్డుపై అధికసంఖ్యలో తిరగటంతో కాలుష్యం పెరిగిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపై పదుల సంఖ్యలో తిరగటంతో రవాణా శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనర్హం. సర్వీస్ పూర్తయిన ఫిట్నెస్ లేని వాహనాలు రోడ్లపై తిరుగుతున్న ఆర్టీఓ పట్టించుకోవటం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రవాణా శాఖ జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని ఈ ప్రాంతంలో వాహన కాలుష్యాన్ని నిర్మూలించి, ఫిట్నెస్ లేని వాహనాలను సీజ్ చేసి మండల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీకి జడ్పీటీసీ రాజీనామా

- నేడు కాంగ్రెస్ పార్టీ పరాయి పార్టీ అయింది
- జడ్పీటీసీ కొనగండ్ల వెంకటరెడ్డి

నవతెలంగాణ-చంద్రుగొండ



జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చంద్రుగొండ జడ్పీటీసీ కొనగండ్ల వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, భావజాలం, మీద నమ్మకంతో పార్టీలో అంకితభావంతో పని చేసానన్నారు. ఈ ప్రాంత సమస్యలు అలాగే రాజకీయ అంశాలను జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినప్పుడు, ఆ సమస్యను వినే తీరిక లేకపోగా తనను అఘోరపరిచే విధంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను ఎవరితోనైనా పంచుకుందాం అనుకున్నా ఈ జిల్లాలో రాజకీయ ముఠాలు ఏర్పడి మీరు మా వర్గం కాదు అంటూ ఎత్తిచూపటం వర్గ విభేదాలతో ప్రజల సమస్యలు పట్టించుకోకుండా పార్టీ అభివృద్ధికి సహకరించకుండా నన్ను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. దీంతో కొన్ని రోజులుగా నాలో నేనే కుమిలిపోయి రాజకీయాల నుంచి వైదొలగడమా లేక అందర్నీ ఏకం చేయడం అని ప్రయత్నించినా కూడా ఫలితం లేకుండా పోయిందన్నారు. దీని అన్నిటికి కారణం నేడు కాంగ్రెస్ పార్టీలో మండల స్థాయి నుంచి నియోజకవర్గ జిల్లా రాష్ట్ర స్థాయి వరకు కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకులు కాంగ్రెస్ భావజాలానికి విరుద్ధంగా ఎదిగిన వారి చేతిలో కాంగ్రెస్ పార్టీ పరాయి వాళ్ళ పార్టీగా మారిందన్నారు. మాలాంటి ఎంతోమంది సీనియర్ నాయకులు, ప్రజా సమస్యలే ఎజెండాగా రాజకీయాలు చేసే మాలాంటి వారికి న్యాయం జరగదనే భావిస్తున్నామన్నారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కరించగలిగే శక్తి ఉండాలి, ఆ శక్తి ఉండాలంటే జిల్లా నాయకత్వం సపోర్టు ఉండాలి, కానీ నేడు కాంగ్రెస్ పార్టీలో అవి కనిపించడం లేదన్నారు. ఈ గ్రూపు రాజకీయాలు, ఒంటెద్దు పోకడల నిర్ణయాలతో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేవని ఓ నిర్ణయానికి వచ్చి, నేడు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం జరిగిందన్నారు. నా రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యకు పంపనున్నట్లు తెలిపారు. త్వరలోనే కార్యకర్తలను, అభిమానులను, సంప్రదించి నా రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తానని తెలిపారు.



శంకుస్థాపన చేసిన సీఎం సీతారామ ప్రాజెక్టు లేకుండా చేశారు

- బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన మ్యానిఫెస్టో మోసపూరితమే

నవతెలంగాణ-ఇల్లందు

గడిచిన 9 సంవత్సరాల కాలంలో తగ్గించని గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి రూ.400 కే గ్యాస్ సిలిండర్ ఇస్తమనడం మోస పూరిత ప్రకటనని జడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇల్లందు రోళ్లపాడులో స్వయంగా సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం కేసీఆర్ ప్రాజెక్టును ఇక్కడ లేకుండా చేసి ఇల్లందు నియోజకవర్గంకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని మభ్యపెట్టారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ మొత్తం కాపీ కొట్టి కొత్తగా ప్రవేశ పెట్టినట్లు ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ గారడీ మాటలకు ప్రజలకు మోస పోకుండా ప్రజల పక్షాన నిలబడి పోరాడే కాంగ్రెస్ పార్టీనీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలంగణలో ఉన్న సింగరేణిలో భూగర్భ గనుల తీయకుండా ఓపెన్ కాస్టలను తీసి సింగరేణి ప్రాంతాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు.

అనారోగ్యంతో న్యాయవాది జ్యోతి మృతి

- బార్ అసోసియేషన్ సంతాపం

నవతెలంగాణ-ఖమ్మంలీగల్



ఖమ్మం పట్టణానికి చెందిన జూనియర్ మహిళా యవ న్యాయవాది మంద జ్యోతి గత 40 రోజుల క్రితం ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి నందు చేరి చికిత్స పొందుతూ హైద్రాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో సోమవారం మరణించారు. జ్యోతికి మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి మన్నెపల్లి బసవయ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదిరాజు లక్ష్మీ నారాయణ, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల శ్రీనివాస్, బిచ్చాల తిరుమలరావు, శేఖర్ రాజు, కాటంనేని రమేష్, ఏడునూతల శ్రీనివాస్‌రావు, ఐఏఎల్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరిరావు, ఐలూ జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు సంతాపం తెలిపారు. న్యాయవాది మృతికి సంతాపంగా సోమవారం ఖమ్మం కోర్టులో విధులు బహిష్కరించారు.

సంతాన లక్ష్మి అలంకారంలో అమ్మవారు

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల భాగంగా సోమవారం అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వీక్షించి భక్తులు పునీతులయ్యారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై బైండోవర్ కేసు నమోదు : ఎస్సై

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా కిరాణా షాపుల్లో మద్యం అమ్ముతున్న నలుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఈ.రతీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆళ్ళపల్లి మండల కేంద్రంలో విస్తృతంగా ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు.

ఉన్నత చదువులు చదివి ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక

జీవనోపాధి కోసం టిఫిన్ సెంటర్ ప్రారంభించిన గిరిజన నిరుద్యోగ యువతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత భవిష్యత్తు కోసం కూలి నాలి పనులు చేసి ఉన్నత చదువులు చదివించినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయి. దీంతో నిరుద్యోగులు తమ కాళ్ల పై తాము నిలదొక్కునే ప్రయత్నంలో భాగంగా జీవనోపాధి కోసం అన్వేషిస్తున్నారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన వర్ష ఆమని అనే గిరిజన యువతి డిగ్రీ వరకు చదువుకుంది. ఉద్యోగ అన్వేషణలో విసిగి వేశారని ఆమని కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఆలోచనతో గ్రామంలో గంగాదేవి పేరుతో సోమవారం టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించినట్టు ఆమని నవతెలంగాణకు తెలిపింది.

ఉపాధి అవకాశాలు కల్పించాలి : ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు

అచ్యుతాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన టిఫిన్ సెంటర్‌ను ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్మెంట్ స్కీములు తీసుకువచ్చి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురసం రవి, ఏటిపి నాయకులు సోయం కోటేశ్వరరావు, గుడ్ల శ్రీను, కురసం వెంకటేష్, తెల్లం వెంకటేష్, కురసం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌లు ఇచ్చి, పోస్టింగ్ రాకుండా అడ్డు పడుతున్న సింగరేణి అధికారులు

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు సింగరేణి ఏరియాలో అధికారులకు ప్రమోషన్లు ఇచ్చి పోస్టింగులు ఇవ్వకుండా ఉన్నతాధికారులు అడ్డుకుంటున్నారని సింగరేణి కోల్ మైన్ లేబర్ యూనియన్ ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి సంస్థకే తలమానికంగా ఉన్న మణుగూరు డివిజన్‌లో సింగరేణి అధికారులు కొంతమంది ఎంతో ఆవేదన చెందుతున్నారని అన్నారు. విధిలేక డ్యూటీలు చేస్తున్నారని అన్నారు. దీనికి కారణం అధిక ఉత్పత్తిలో భాగస్వాముల అయినప్పటికీ, రావలసిన ప్రమోషన్ వచ్చినప్పటికీ, ఇవ్వవలసిన పోస్టులు ఇవ్వకుండా కొంతమంది అధికారుల ప్రోత్సాహంతో ఒక అధికారికి నాలుగు పోస్టుల్లో ఇవ్వటమేమని ప్రశ్నించారు. మమ్ములను అసమర్ధులుగా భావిస్తున్నారని అధికారులు వాపోతున్నారు అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రమోషన్ వచ్చిన అధికారులను, మనోవేదనకు గురికాకుండా వారికి న్యాయంగా ఇవ్వవలసిన పోస్టులు ఇచ్చి న్యాయం చేయవలసిందిగా ఉన్నతాధికారులను కోరుతున్నామని అన్నారు

ఇది కరెంటు స్తంభమేనా

నవతెలంగాణ-జూలూరుపాడు



మండల పరిధిలోని జడల చింత గ్రామంలో కరెంటు స్తంభం చుట్టూ పిచ్చి చెట్లు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. అయినా పంచాయతీ సిబ్బంది గాని, కరెంటు డిపార్ట్మెంట్ అధికారులు గాని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు చెప్పినా సరే స్పందన లేదు. దయ చేసి కరెంటు స్తంభం చుట్టూ ఉన్న చెట్లని తొలగించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఆధారాలు లేని నగదు స్వాధీనం

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేట అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ దగ్గర సోమవారం పోలీస్‌లు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో ఆధారాలు లేని రూ.1 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి జిల్లా, సీతానగరం మండలానికి చెందిన పొలుమూరి వెంకట్రావు సీతానగరం నుండి తెలంగాణలోని అశ్వారావుపేటకు కారులో నగదుతో వస్తుండగా పోలీస్ తనిఖీల్లో ఆధారం లేని నగదుగా తేలింది.



అన్నపురెడ్డిపల్లి ఎన్నికల సమయం కావడంతో ఎన్నికల కోడ్ అమలలో ఉండటంతో మండల సరిహద్దు గ్రామమైన బూర్గుగూడెం గ్రామం దగ్గర ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై షాహిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విసన్నపేట గ్రామం నుండి కొత్తగూడెం వైపు వెళుతున్న ఓ కారులో రూ.2 లక్షల 88 వేలు పట్టుకున్నారు. ఎటువంటి రశీదులు లేకుండా డబ్బును తీసుకుపోతుండటంతో వారి దగ్గర డబ్బును సీజ్ చేసినట్టు ఆమె తెలియజేశారు.

లీ హెల్త్ నుంచి 'నేచురల్ కేర్'



హైదరాబాద్ : జుట్టు, చర్మం, గోర్ల సహజ పునరుజ్జీవనం కోసం హైదరా బాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ లీ హెల్త్ డొమెయిన్ ప్రత్యేక ఉత్పాద నలను రూపొందించింది . నేచు రల్ కేర్ పేరుతో హెయిర్ ఆయిల్, షాంపూ, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌తో కూడిన కాంబో కిట్‌ను విడుదల చేసింది. మందార, ఉల్లి, కలబంద, భంగరాజ్, ఉసిరి వంటి సహజ సిద్ధ ఉత్పత్తుల మేళిమి కలయికతో 100శాతం హెర్బల్ హెయిర్ ఆయిల్ తయారైంది. నేచురల్ కేర్ కిట్ చుండ్రు, జుట్టు రాలడాన్ని నియంత్రించడానికి, కమిలిన చర్మాన్ని పున రుజ్జీవింప జేయడానికి, పెళు సైన గోళ్లను మెరుగుపరచడంలో సహాయ పడుతుందని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ఈ నేచురల్ కేర్ కాంబో ఉత్పత్తులను అభివృద్ధి చేశామని చెప్పారు.అన్ని వయసుల పురుషులు, స్త్రీలకు జుట్టు రాలడం, చర్మం కమి లిపోవడం, పెళుసుగా ఉండే గోర్ల యొక్క మూల కారణాలపై పని చేయడానికి ఇది సమగ్ర విధానమని వివరించారు.

ఉత్తరాఖండ్‌లో స్వల్ప భూకంపం

డెహ్రాడూన్ : ఉత్తరాది రాష్ట్రాలను గత కొన్ని రోజులుగా వరుస భూకంపాలు వణికిస్తున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్‌లో భూ ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. సోమవారం ఉదయం 9:11 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంప తీవ్రత 4.0గా నమోదైనట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. పితోర్‌గఢ్‌కు ఈశాన్యంగా 48 కి.మీ దూరంలో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్టు తెలిపింది. భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కాగా, ఇటీవలే నేపాల్‌లో 6.2 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లో వరుసగా భూప్రకంపనలు చోటు చేసుకుంటున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, యూపీ సహా ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా దేశ రాజధాని ఢిల్లీ, ఎన్‌సీఆర్ రీజియన్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. భూకంప తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై 3.1గా నమోదైంది.

నోయిడాలో విద్యార్థిపై సామూహిక లైంగికదాడి

నోయిడా : దేశ రాజధాని ఢిల్లీకి సమీపంలో దారుణం చోటు చేసుకుంది. నోయిడాలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినిపై అదే తరగతికి చెందిన ఐదుగురు విద్యార్థులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న విద్యార్థినిని బెదిరించి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనింగ్ రంగంలో సవాళ్లను అధిగమించాలి

- ఎన్‌ఎండీసీ చైర్మెన్ అమితవ ముఖర్జీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో మైనింగ్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను ఇంజనీర్లు అవకాశాలుగా మార్చుకోవాలనీ, దేశ జీడీపీ ఎదుగుదలకు సహకరించాలని ఎన్‌ఎండీసీ చైర్మెన్, ఎండీ అమితవ ముఖర్జీ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ సమావేశ మందిరంలో మైనింగ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ జనరల్ బాడీసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గుర్తించిన మైనింగ్ నిలువలు 22 శాతం ఉండగా, వీటిలో సమగ్ర అన్వేషణ జరిగినవి కేవలం 6శాతం మాత్రమేననీ, ప్రస్తుతం మైనింగ్ జరుగుతున్నది రెండు శాతం మాత్రమేనని పేర్కొన్నారు. ఈ రెండు శాతాన్ని రెట్టింపు చేస్తే మైనింగ్ జీడీపీ నాలుగు శాతం వృద్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మైనింగ్ పరిశ్రమలను అధ్యయనం చేసిన ఫెజర్ ఇన్సిట్యూట్ అత్యుత్తమ 100 పరిశ్రమల జాబితాను రూపొందించగా దానిలో భారత్ కు స్థానం లేకపోవడం ఆలోచించాలని తెలిపారు. పర్యావరణ హితంగా మైనింగ్‌ను నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నరకడం కాదనీ, వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మూతపడిన గని ప్రాంతాలను పూర్వస్థితికి తీసుకురావటం ద్వారా.. పచ్చదనాన్ని వద్ధి చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ జాతీయ మాజీ అధ్యక్షులు ఎండి షఫీయుద్దీన్, వి డి. రాజగోపాల్, నరసయ్య , హైదరాబాద్ చాప్టర్ మాజీ అధ్యక్షులు బి.ఆర్.వి సుశీల్ కుమార్,ఎన్‌ఎండీసీ డైరెక్టర్ టెక్నికల్ వినయ్ కుమార్ తదితరులు మాట్లాడారు.

చైర్మెన్‌గా వినయ్ కుమార్ ఎన్నిక..

సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. అధ్యక్షులుగా వినయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎమ్మెస్ వెంకట్రామయ్య, కార్యదర్శిగా ఎల్ కృష్ణ, జాయింట్ సెక్రెటరీగా వి బాలకోటి రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ ఎస్ కే సింహం ఎంపికయ్యారు. మరో తొమ్మిది మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

87 స్థానాల్లో పోటీ

- అభ్యర్థులతోపాటు మ్యానిఫెస్టో విడుదల
- తెలంగాణలో బాలకృష్ణ ప్రచారం
- టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వం



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ 87 స్థానాల్లో పోటీచేస్తుందని తెలుగుదేశం తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఇప్పటికే 30 మందితో జాబితా సిద్ధంగా ఉందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు ఆమోదం లభించగానే మ్యానిఫెస్టోతోపాటు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో సహచర నాయకులతో కలిసి మీడియాతో సోమవారం మాట్లాడారు. 'రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును ములాఖాత్‌లో కలిసాను. రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించాను. తెలంగాణలో టీడీపీ బలంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా పోటీచేస్తాం. జనసేనతో కలిసి పొత్తు పెట్టుకోవాలా? లేదా? అనేది త్వరలో స్పష్టత వస్తుందన్నారు. టీడీపీ తరపున రాష్ట్రంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రచారం చేస్తారని' వివరించారు. చంద్రబాబు మంగళవారం బయటకు వస్తారని భావిస్తున్నట్టు చెప్పారు. ఆయన ఆరోగ్యంపై దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారనే నమ్మకం ఉందన్నారు. ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరేందుకు చాలా మంది సంప్రదిస్తున్నారనీ, కాంగ్రెస్ కంటే రాష్ట్రంలో టీడీపీనే బలంగా ఉందని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయకత్వంలో బీసీలకు పెద్దపీట వేస్తామని ప్రకటించారు. అభ్యర్థులు పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గ్రేటర్‌లో కాకుండా తెలంగాణ జిల్లాల్లో బాలకృష్ణ ప్రచారం చేస్తారని చెప్పారు. టీడీపీ మ్యానిఫెస్టో అందరికీ ఆదర్శంగా ఉంటుందన్నారు. విలేకర్ల సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.వాసిరెడ్డి రామనాథం, ప్రధాన కార్యదర్శులు జక్కలి ఐలయ్యయాదవ్, అజ్మీరా రాజునాయక్, తెలుగు మహిళ అధ్యక్షుఆలు భవనం షకీలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ రిజర్వేషన్ బిల్లును తక్షణమే ఆమోదించాలి

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో ఇటీవల ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. వచ్చే ఏడాదిలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందే వీటిని అమలు చేయాలని పిటిషన్ లో కోరారు. పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఇటీవలే అది చట్టరూపం దాల్చిన విషయం తెలిసిందే.

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 'నారీ శక్తి వందన్ అధినియమ్' పేరుతో ప్రవేశపెట్టిన బిల్లుకు సెప్టెంబర్ 20న లోక్‌సభలో, 21న రాజ్యసభలో ఆమోదం లభించింది. సెప్టెంబర్ 28న రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఆ బిల్లు చట్టరూపం దాల్చింది. అయినప్పటికీ ఈ చట్టం ప్రస్తుతం అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. జనగణన, డీలిమిటేషన్ తరువాత ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకురానున్నట్టు బిల్లుపై చర్చ సందర్భంగా ప్రధాని మోడీ లోక్‌సభకు తెలిపారు.

ఇలా ఈ చట్టం అమలు ఆలస్యమవుతుండటంపై కాంగ్రెస్ నేత డాక్టర్ జయ ఠాకూర్ సోమవారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

చట్టం అమలుకు ఉన్న అడ్డంకులను చెల్లనివిగా ప్రకటించి తక్షణమే ఈ రిజర్వేషన్లను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఇదిలాఉంటే, పార్లమెంట్ ఇటీవల ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా డిమాండ్ చేశారు. ఈ దిశగా ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు ఐక్య పోరాటం చేస్తాయని ప్రకటించారు.

చెన్నైలో డీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'మహిళా హక్కుల మహానాడు' సదస్సులో ఆమె ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో మహిళలకు రాజీవ్ గాంధీ 33 శాతం రిజర్వేషన్లు తెచ్చారని, ఆ స్ఫూర్తితో పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు నెగ్గేందుకు పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చామని అన్నారు.



జీతం లేని కార్మికుల పెరుగుదల

- ఆరేండ్ల కనిష్ట స్థాయికి 15 ఏండ్లపై బడిన వారి నిరుద్యోగం రేటు
- నిరుద్యోగ రేటు గ్రామీణ ప్రాంతాల్లో 2.4 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 5.4 శాతానికి తగ్గుదల
- పీఎల్ఎఫ్ఎస్ రిపోర్ట్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో గణనీయమైన సంఖ్యలో కార్మికులు స్వయం ఉపాధి లేదా వేతనం లేని పనిలో ఉన్నారు. జులై 2022 నుంచి జూన్ 2023 వరకు పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) రిపోర్ట్ స్పష్టం చేసింది. అంతేకాకుండా, ప్రధాన మత సమూహాలలో, ముస్లింలు మాత్రమే తమ శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్పిఆర్), కార్మికుల జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్)లో క్షీణతను ఎదుర్కొన్నారని డేటా పేర్కొంది.15 ఏండ్లు .. అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారి నిరుద్యోగిత రేటు 3.2 శాతంతో ఆరేండ్ల కనిష్ట స్థాయికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు 2017-18లో 5.3 శాతం నుంచి 2022-23లో 2.4 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 7.7 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గినట్టు డేటా స్పష్టం చేసింది.

స్వయం ఉపాధిలో పెరిగిన వాటా

పీఎల్ఎఫ్ఎస్ రిపోర్ట్ ప్రకారం, సాధారణ కార్మికులు, సాధారణ వేతన తరగతి కంటే ఎక్కువ సంఖ్యలో వ్యక్తులు స్వయం ఉపాధి పొందుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో సాపేక్షంగా ఎక్కువ సంఖ్యలో ప్రజలు స్వయం ఉపాధికి విరుద్ధంగా జీతాలతో కూడిన ఉద్యోగాలను కలిగి ఉన్నారు.

పీఎల్ఎఫ్ఎస్ కార్మికులకు ఉద్యోగ స్థితిని మూడు విస్తృత వర్గాలుగా విభజిస్తుంది. స్వయం ఉపాధి,, సాధారణ వేతనం లేదా జీతాలు తీసుకునే ఉద్యోగులు. ,సాధారణ కార్మికులు. స్వయం ఉపాధి పొందిన వారు మొత్తం రేటు 2021-22లో 55.8 శాతం, 2020-21లో 55.6 శాతం నుంచి 2022-23లో 57.3 శాతానికి పెరిగింది. 2017-18, 2018-19లో ఇది దాదాపు 52 శాతంగా ఉంది.

"స్వయం ఉపాధిలో గ్రామీణ ప్రాంతాల్లో సొంతంగా పని చేసే రైతులు, చేనేత కార్మికులు, కుమ్మరులు వంటి వారి స్వంత పని చేసుకునేవారు ఎక్కువగా ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో రెడ్ వాలాలు, రేలే వాలాలు, కబాడీలు, బార్బర్‌లు, టైలర్లు, విక్రేతలు, వీధిలో పని చేసేవారు ఉన్నారు. మొత్తం శ్రామికశక్తిలో స్వయం ఉపాధి పొందే వాటా పెరుగుతోంది. దానిలో ఎక్కువ పెరుగుదల జీతం చెల్లించని కుటుంబ కార్మికులు, గ్రామీణ ప్రాంతాల్లో స్వంత పని చేసేవారు ఉన్నారు" అని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఇన్‌ఫార్మల్ సెక్టార్ అండ్ లేబర్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా అన్నారు. "ఒక సాధారణ కార్మికుడు జీతం పొందుతాడు, స్వయం ఉపాధిలో చెల్లించని కుటుంబ కార్మికులు ఏమీ పొందలేరు. గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేసే వారు, పంట పూర్తయినప్పుడు, వారు దానిని విక్రయించినప్పుడు ఏదైనా సంపాదిస్తారు"అని అన్నారు. మంచి పని, వేతనాలు లేకపోవడం వల్ల ప్రజలు స్వయం ఉపాధిని ఎంచుకుంటున్నారని ఆయన తెలిపారు.

గృహాల్లో పనిచేసె వారి శాతం 2021-22లో 17.5 శాతం, 2020-21లో 17.3 శాతం నుండి 2022-23లో 18.3 శాతానికి పెరిగింది. ఐదేండ్లలో ఆర్థిక వ్యవస్థలో తీవ్ర మందగమనం పెరిగింది. 2022-23లో తయారీ రంగంలో పనిచేస్తున్న వారి శాతం 11.4 శాతం, ఇది 2021-22లో 11.6 శాతం వద్ద కొంతమేర ఎక్కువగా ఉంది. 2022-23లో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారి శాతం 13 శాతం. ఇది 2021-22, 2020-21లో వరుసగా 12.4 శాతం, 12.1 శాతం.

వాణిజ్యం, హెూటల్, రెస్టారెంట్ రంగంలో పనిచేస్తున్న వారు 2020 నుంచి 2023 వరకు దాదాపు 12 శాతం వద్ద నిలిచిపోయారు.

రవాణా, నిల్వ, సమాచార రంగాలలో పని చేస్తున్న వారి శాతంలో ఇదే విధమైన ధోరణిని గమనించవచ్చు, ఇక్కడ కేవలం 5 శాతం మంది మాత్రమే పనిచేస్తున్నారు. దేశంలో పట్టణ ప్రాంతాల్లో ఎటువంటి నిర్దిష్ట సామాజిక భద్రతా ప్రయోజనాలకు అర్హత లేని సాధారణ వేతనం/జీతం పొందే ఉద్యోగుల 2020-21లో 50.1శాతం నుండి 2022-23లో 49.4 శాతానికి తగ్గింది.

ముస్లిం సమాజంలో మాత్రం ఎల్ఎఫ్పిఆర్, డబ్ల్యూపిఆర్ పడిపోయింది. ముస్లింలకు, ఎల్ఎఫ్పిఆర్ 2020-21లో 35.5 శాతం, 2021-22లో 35.1 శాతంగా ఉంది. 2022-23లో ఇది 32.5 శాతానికి తగ్గింది. అదేవిధంగా, ముస్లింల డబ్ల్యూపిఆర్ 2020-21లో 33.9 శాతం 2021-22లో 33.5 శాతంగా ఉంది. 2022-23లో ఇది 32.5 శాతానికి తగ్గింది.

ద్రోహం చేసిన కుటుంబానికి టికెట్

- కాంగ్రెస్‌లో ఉదయపూర్ డిక్లరేషన్ ఏమైంది
- నామినేషన్ గడువులోపు తన నిర్ణయం
- మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

నిరంతరం కాంగ్రెస్ పార్టీని ఓడించడమే పనిగా పెట్టుకుని.. శాసనమండలి పక్షాన్ని సైతం బీఆర్ఎస్‌లో విలీనం చేసి పార్టీకి ద్రోహం చేసిన దామోదర్‌రెడ్డి కుటుంబానికి టికెట్ కేటాయించడంపై మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశా.. అయినా టికెట్ కేటాయించకపోవడం అన్యాయం.. దీనికి టీపీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పార్టీ ఇచ్చిన పిలుపులను విజయవంతం చేయడంతోపాటు రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేసిన తనను కాదని మరొకరికి ఎలా టికెట్ కేటాయిస్తారని ప్రశ్నించారు. టికెట్ కేటాయింపులో ఉదయపూర్ డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సర్వేల పేరుతో రాష్ట్ర నాయకత్వం టికెట్ కేటాయించడం సరికాదన్నారు. తాను కష్టపడితే ఇతరులకు టికెట్ ఎలా కేటాయిస్తారని, వారికి ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు. సర్వే పేరుతో తనకు నమ్మకద్రోహం చేశారని, ఎక్కడ సర్వే చేశారో స్పష్టం చేయాలని అన్నారు. తాను ఎప్పుడూ సొంత నిర్ణయం తీసుకోలేదని, కార్యకర్తల అభిప్రాయం మేరకే పని చేస్తానని, నామినేషన్ గడువులోపు తన వైఖరిని స్పష్టం చేస్తానని తెలిపారు. తనను బుజ్జగించేందుకు వచ్చిన మాణిక్యం ఠాక్రే, జానారెడ్డి, చిన్నారెడ్డి లాంటి నాయకులకు తన బాధను వివరించానన్నారు.

ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి, వివిధ మండలాల అధ్యక్షులు కోటయ్య లక్ష్మయ్య, మిద్దె రాములు, అర్జునయ్య, పాండు, నిజాం సత్యం, భీముడు, అహ్మద్ పాషా తదితరులు ఉన్నారు.

చివరి భూములకు నీరందించాలి

- కొందరి స్వార్థంతో కాల్వలకు గండ్లు
- గణపవరం వద్ద రైతుల ధర్నా



నవతెలంగాణ-కోదాడరూరల్

సాగర్ ఎడమ కాలువ నీరు చివరి పంట భూముల వరకు అందించాలని రైతులు ధర్నా చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని గణపవరం క్రాస్‌రోడ్ వద్ద మేళ్లచెర్వుకు వెళ్లే ప్రధాన రహదారిపై సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గణపవరం రామలక్ష్మీపురం ఎర్రవరం, బీక్యాతండా, ఎర్రవరం గ్రామాల పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. కొంతమంది స్వార్థంతో కాల్వలకు గండ్లు పెట్టుకొని చివరి భూములకు నీరు రాకుండా చేస్తున్నారన్నారు. దీంతో ఎంతో కష్టపడి సాగు చేసిన పైర్లు కండ్ల ముందే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం గ్రామం వరకు చుక్క నీరు రావడం లేదని, సాగర్ నీరు వదిలి వారం రోజులవుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. కెనాల్‌కు నీటిని అధికంగా వదలాలని రైతులు కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు బ్రమధు, సుమన్‌రెడ్డి, అన్నెం అంజిరెడ్డి, వేమూరిమధురెడ్డి, బచ్చయ్య, లక్ష్మయ్య, రాధాకష్ణ, ధనమూర్తి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మరో 29 మందికి బీఆర్ఎస్ బీ-ఫామ్‌లు

- సీఎం కేసీఆర్ చేతుల మీదుగా అందజేత
- మొత్తం 98కి చేరిన సంఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి సోమవారం మరో 29 మంది అభ్యర్థులు బీ-ఫామ్‌లను అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ వారందరికీ వాటిని అందజేశారు. దీంతో ఆ పార్టీ నుంచి ఇప్పటి వరకూ మొత్తం బీ-ఫామ్‌లు అందుకున్న వారి సంఖ్య 98 చేరింది.

సోమవారం బీ-ఫామ్‌లు అందుకున్న వారు...

1. కల్వకుంట్ల సంజయ్
2. డాక్టర్ ఎమ్.సంజయ్ కుమార్
3. కొప్పుల ఈశ్వర్
4. కోరుకంటి చందర్
5. పుట్ట మధు
6. చింత ప్రభాకర్
7. చామకూర మల్లారెడ్డి
8. కేపీ వివేకానంద్
9. మాధవరం కష్ణారావు
10. మంచిరెడ్డి కిషన్ రెడ్డి
11. పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి
12. టి. ప్రకాశ్ గౌడ్
13. కాలె యాదయ్య
14. కొప్పుల మహేశ్ రెడ్డి
15. మెతుకు ఆనంద్
16. ముఠా గోపాల్
17. కాలేరు వెంకటేశ్
18. దానం నాగేందర్
19. మాగంటి గోపీనాథ్
20. టి. పద్మారావు
21. లాస్య నందిత
22. గొంగిడి సునీత
23. శానంపూడి సైదిరెడ్డి
24. డి.ఎస్.రెడ్యానాయక్
25. బానోత్ శంకర్ నాయక్
26. చల్లా ధర్మారెడ్డి
27. ఆరూరి రమేశ్
28. గండ్రవెంకట రమణారెడ్డి
29. మాణిక్‌రావు

1000వ రోజుకు చేరిన బీఈఎంఎల్ ఆందోళన



తిరువనంతపురం : భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేరళలోని పాలక్కడ్‌లో చేపట్టిన ఆందోళన 1000వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో కంజికోడ్ యూనిట్‌లోని ఉద్యోగులు తమ నిరసన వ్యూహాలను సమీక్షించనున్నారు. సైనిక వాహనాలు, మెట్రో కోచ్‌లు మరియు మైనింగ్ వాహనాల తయారీకి బీఈఎంఎల్ ప్రసిద్ధి చెందింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ. 56,000 కోట్ల విలువైన మినీ రత్న కంపెనీని రూ. 2,000 కోట్ల కంటే తక్కువ మొత్తానికి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నదని కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. బీఈఎంఎల్‌లో 54.03శాతంగా ఉన్న ప్రభుత్వ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 26శాతం ఉపసంహరించుకుంటునట్టు కేంద్ర ప్రభుత్వం 2021 జనవరిలో ప్రకటించింది. ప్రకటన వెలువడినప్పటి నుంచి కంపెనీలోని నాలుగు యూనిట్లలోని కార్మికులు (కంజికోడ్ (కేరళ), కోలార్ గోల్డ్ ఫీల్డ్ (కర్నాటక), మైసూరు (కర్నాటక), బెంగళూరు (కర్నాటక) ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. దేశ రక్షణ మరియు దేశీయ రైలు రవాణా వ్యవస్థ మరియు మైనింగ్ పరిశ్రమతో సహా ఇతర కీలక రంగాలకు బీఈఎంఎల్ చాలా కీలకమైనదని వారు పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను కోసం చేస్తున్న తన నిరసన పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, తక్షణమే ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

భారీగా నగలు, నగదు పట్టివేత

నవతెలంగాణ- విలేకరులు

ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం భారీగా నగలు, నగదు, ఇతర వస్తువులు పట్టుబడ్డాయి. రంగారెడ్డి జిల్లా మాదాపూర్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ల పరిధిలో మాదాపూర్ జోన్ ఎస్ఓటీ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలు, నగదు పట్టుబడ్డాయి. ఎలాంటి పత్రాలు లేకుండా బషీర్‌బాగ్‌లోని ఓ నగల షాపు నుంచి వాహనంలో ఇక్కడికి అరు పెట్టెలలో తరలిస్తున్న 17 కిలోల బంగారం, 17 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా మియాపూర్ చౌరస్తాలో అల్విన్ కాలనీ చౌరస్తా వద్ద రూ.14 లక్షలు పట్టుకున్నారు. తనిఖీల్లో దొరికిన బంగారం, వెండి, నగదును ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్టు మియాపూర్ సీఐ ప్రేమ్ కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ వద్ద తనిఖీల్లో రూ.32.39 లక్షలు పట్టుబడ్డాయి. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.10.39లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో రెండు ద్విచక్ర వాహ నాలు, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కవాడీగూడ ఎన్టీసీపీ బిల్డింగ్ సమీపంలో నార్త్ జోన్ టాస్క్‌ఫోర్సు, గాంధీనగర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో కియా కారులో రూ.2కోట్ల 9లక్షలను పోలీసులు గుర్తించారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదుతోపాటు కారు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. ఆరుగురిని అరెస్టు చేసినట్టు డీసీపీ పి.రాధాకిషన్‌రావు తెలిపారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాళ్లూరి సినిమా థియేటర్ రోడ్డులో ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి వద్ద రూ.30లక్షలను పోలీసులు సీజ్ చేశారు. వనస్థలిపురంలో ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు రూ.29.40 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

కరీంనగర్‌లో రూ.2.36 కోట్లు పట్టివేత

కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ వద్ద ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు చేపట్టిన వాహన తనిఖీల్లో 'రైటర్ సేఫ్ గార్డ్ ప్రయివేట్ లిమిటెడ్' వ్యాన్‌లో సరైన ఆధారాలు లేని రూ.2కోట్ల 36లక్షల 48,494 పట్టుకున్నారు. వాటిని రిటర్నింగ్ అధికారి సమక్షంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్టు సీపీ సుబ్బారాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.2,84,67,452 పట్టుకున్నట్టు వివరించారు.

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్గేట్ వద్ద ఆదివారం సాయంత్రం నలుగురి నుంచి రూ.కోటి 82 లక్షలను పోలీసులు సీజ్ చేశారు. నగదును నల్లగొండలోని ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసినట్టు సబ్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తెలిపారు.

గోదావరిలో స్నానానికి దిగి..ఇద్దరు మృతి

నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరిలో ఆదివారం స్నానానికి దిగి గల్లంతై ఇద్దరు మృతిచెందారు. కాళేశ్వరం ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలుక రంగధాంపేటకు చెందిన కోసం లక్ష్మి నారాయణ, అనారోగ్యంతో బాధ పడుతున్న భార్య సుశీలతోపాటు కొడుకు రామేశ్వర్(18), అదే గ్రామానికి చెందిన (దేవరతూలె..) చిలుముల సురేష్ (32)తో కలిసి శనివారం కాళేశ్వరం చేరుకున్నారు. ఆదివారం ఉదయం సురేష్, రామేశ్వర్ గోదారిలో స్నాన ఘాట్ వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. వారి కోసం గోదావరి పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం స్థానిక జాలర్లలకు నదిలో తేలిన మృతదేహాలు కనబడగా పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వారి సహాయంతో ఇద్దరి మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం కోసం సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహారాష్ట్రలో రైలు ప్రమాదం.. ఐదు కోచ్‌లు దగ్ధం

మహారాష్ట్ర : మహారాష్ట్రలో అహ్మద్ నగర్ నుంచి అష్టికి వెళ్లే సబర్బన్ ట్రైన్ అగ్నిప్రమాదానికి గురైంది. రైలులోని 5 కోచులకు మంటలు అంటుకున్నాయని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలు వ్యాపించడానికి ముందే రైలులోని ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముందుగా గార్డ్ సైడ్ బ్రేక్ వ్యాన్‌లో మంటలు చెలరేగినట్టు తెలిపారు. వెంటనే పక్కనే ఉన్న నాలుగు కోచులకు మంటలు వేగంగా వ్యాపించాయనీ, మంటలు చుట్టుముట్టే ముందే బయటపడ్డామని తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా నివారించారు.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com





పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం...

నేహా శర్మ, సౌమ్య జగన్నాథ్... ఈ ఇద్దరు తల్లులు కరోనా సమయంలో తమ పిల్లల స్క్రీన్ సమయాన్ని చూసి ఆందోళన చెందారు. దాని నుండి పిల్లల్ని కాపాడుకోవడం కోసం ఎంతో ప్రయత్నించారు. ఆ ఆలోచనతోనే ఆడియో కంటెంట్ కోసం వోబుల్ అనే ఓటీటీ ప్లాట్‌ఫారమ్ ప్రారంభించారు. తద్వారా పిల్లల కోసం ఉజ్వల భవిష్యత్తును రూపొందిస్తున్నారు. నాలుగేండ్ల నుండి పదేండ్ల మధ్య వయసు గల పిల్లల కోసం ఆడియో కథనాలు, గేమ్ షోలు, సంగీతం వంటి ఆడియోలు వినిపిస్తున్నారు. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

నాలుగేండ్ల మైరా తన హెడ్‌ఫోన్స్‌తో కూర్చుని, ఆడియో కథలు వినడంలో మునిగిపోయింది. అలాగే డ్రాయింగ్‌కు రంగులు వేయడం ప్రారంభించింది. తాను విన్న ఆడియో కథల్ని పేపర్‌పై కూడా రాస్తుంది. దీన్ని చూసిన ఆమె తల్లి జస్ప్రీత్ కౌర్‌కు తన బిడ్డకు సరైన మార్గాన్ని ఎంపిక చేసుకున్నందుకు ఆనందించింది. మైరా గత రెండు నెలలుగా ఆడియో కథనాలు, గేమ్ షోలు, సంగీతం వంటి యాక్టివిటీలతో నిండిన ఆడియో ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అయిన Vobbleని ఉపయోగిస్తోంది. 'ఈ కథలు వినడానికి,



కార్యకలాపాలు చేయడానికి మా అమ్మాయి ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటుంది. దీనివల్ల తను ఫోన్, వీడియో గేమ్స్‌తో గడిపే సమయాన్ని కూడా తగ్గించింది' అని కౌర్ అంటున్నారు. నేహా శర్మ, సౌమ్య జగన్నాథ్ కలిసి 2022లో ప్రారంభించిన ఈ Vobble పిల్లల కోసం 1,000 నిమిషాల కంటే ఎక్కువ కంటెంట్‌ని కలిగి ఉంది. ఒక ఏడాదిలోనే బెంగళూరుకు చెందిన ఈ కంపెనీ ఆగస్టు నుండి 200 మంది చందాదారులతో రూ. 6 లక్షల ఆదాయాన్ని పొందింది. 'ఈ ఆలోచన పిల్లల దృష్టిని స్క్రీన్ నుండి ధ్వనికి మార్చడం, వారి ఊహ, సృజనాత్మకతను ప్రేరేపించింది' అని నేహా చెప్పారు.

స్క్రీన్ సమయాన్ని తగ్గించడం

ప్రతి నెల Vobble హార్పర్ కాలిన్స్ ఇండియా, అమర్ చిత్ర కథ, స్కొలాస్టిక్ తులికాతో పాటు ఇతర ప్రచురణల నుండి 250 నిమిషాల కంటెంట్ తీసుకుంటారు. మరో 50 నిమిషాలు ఇంట్లో తయారు చేసిన కంటెంట్‌ను దానికి జోడిస్తారు. 'ఈ పబ్లికేషన్‌లు 0-30శాతం మధ్య ఉంటాయి. కొన్ని సందర్భాల్లో మేము క్విడ్ ప్రోకో అమరికను ఏర్పాటు చేస్తాం. దీనిలో మేము ఆ ప్రచురణ నుండి కొత్త కంటెంట్‌ని సృష్టిస్తాం. వారు మా ఆడియో కంటెంట్‌ను Vobble బ్రాండింగ్ కింద ఉపయోగించుకోవచ్చు' అని నేహా వివరించారు. మొదట తల్లిదండ్రులు Vobbleలో వారి పిల్లల ప్రొఫైల్‌ని నింపుతారు. పిల్లలు ఆడియోను ఎంత సేపు వింటున్నారో అందులో నమోదు చేస్తారు. దీని ఆధారంగా ప్లాట్‌ఫారమ్ పిల్లల వయసును నిర్ణయిస్తుంది. హోమ్ పేజీలో వయసుకి తగిన కంటెంట్‌ను మాత్రమే చూపుతుంది. 'ప్రతి కంటెంట్ పీస్‌కి దాని ముందు పేర్కొన్న వయసు కూడా ఉంటుంది. పిల్లల కోసం సరైన కంటెంట్‌ను క్యూరేట్ చేయడానికి మాకు నిపుణుల ప్యానెల్ ఉంది' అని ఆమె జోడించారు.

కొత్త కంటెంట్ అందిస్తుంది



Vobble కంటెంట్‌ను నమ్మదగినదిగా చేయడానికి పిల్లలచే ఈ ఆడియో కథనాలను రికార్డ్ చేయిస్తారు. వారి తల్లిదండ్రులకు డబ్బు ఎంత చెల్లించాలో చూపడంతో పాటు Vobble హాంపర్‌లను అందిస్తుంది. ఆరేండ్ల కూతురు ఉన్న మధుమిత మాట్లాడుతూ తన కుమార్తెకు వాయిస్ యాక్టింగ్‌ని ప్రయత్నించడం కొత్త మార్గమని చెప్పింది. 'స్టూడియోలో తనను తాను సెటప్ చేసుకోవడం, మైక్‌లో సరిగ్గా మాట్లాడటం, అద్భుతమైన సాంకేతిక నిపుణులతో రికార్డింగ్ పరికరాలను ఉపయోగిస్తూ ఎన్నో నైపుణ్యాలను నేర్చుకుంది. దీన్ని మా పాప చాలా ఆనందిస్తుంది. అంతేకాదు తన సొంత కథలను యాప్‌లో పదే పదే వినడానికి ఇష్టపడుతుంది. ఇంకా తన కథలను అందులో రికార్డ్ చేయడానికి ఉత్సాహంగా ఉంది' అని ఆమె జతచేస్తుంది. 'వినడం అనేది చాలా మంచి లక్షణం. ఆడియోలు వింటూ పిల్లలు కంటెంట్‌లో మునిగి పోతారు. Vobble కూడా క్రమం తప్పకుండా కొత్త కంటెంట్‌ని అందిస్తుంది. కాబట్టి లాంగ్ కార్ రైడ్‌ల సమయంలో పిల్లలు వినడానికి కొత్త కథనాలు అందులో ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి. Vobble ఆడియో కంటెంట్ కావాలనే 10 నిమిషాల గరిష్ఠ వ్యవధితో చిన్నదిగా రూపొందించబడిందని నేహా చెప్తున్నారు. పిల్లల ఆసక్తిని గమనించి ఓ ఆలోచనతో ఇది రూపొందించబడింది. పిల్లలు ఆడియో కంటెంట్‌ను వినడం ప్రారంభించి వాటిని వినడానికి ఆసక్తి చూపుతున్నట్టు మేము గమనించాము. కాబట్టి దాన్ని దృష్టిలో ఉంచుకుని మా ప్లాట్‌ఫారమ్‌లోని కంటెంట్ వ్యవధిని పెంచుతుంటాము' అని ఆమె జతచేస్తున్నారు.

ఎలా మొదలైంది?

నేహా, సౌమ్య ఇరుగుపొరుగువారు. అతి తక్కువ కాలంలోనే వారి పిల్లలు కూడా సన్నిహితులయ్యారు. నేహా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ స్టడీస్ ఫ్యాకల్టీ నుండి ఎంబీఏ చేశారు. సౌమ్య మిచిగాన్ విశ్వవిద్యాలయం నుండి న్యూరోసైన్స్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆమె సృష్టి మణిపాల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్, డిజైన్ అండ్ టెక్నాలజీ నుండి ఆట, విద్యపై దృష్టి సారించే మానవ-కేంద్రీకృత రూపకల్పనలో నైపుణ్యాన్ని కలిగి ఉంది. మహమ్మారి సమయంలో ఈ ఇద్దరు తల్లులు తమ పిల్లల స్క్రీన్ సమయం పెరగడం గురించి ఆందోళన చెందారు. పరిష్కారాల కోసం తీవ్రంగా వెతికారు, కానీ ప్రయోజనం లేదు. దాంతో సెప్టెంబర్ 2022లో Vobbleని ప్రారంభించడానికి వారు తమ ఉద్యోగాలను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు. 'దేశంలో పోడ్‌కాస్ట్ మార్కెట్ పుంజుకుంటుంది. అయితే మా వద్ద పిల్లల కోసం తగినంత ఆడియో ప్లాట్‌ఫారమ్‌లు గానీ కంటెంట్ గానీ లేవు. ఈ రకమైన ఆడియో కంటెంట్ యుఎస్‌లో ప్రజాదరణ పొందుతోంది. దాన్ని మన దేశంలోకి తీసుకురావాలని అనుకున్నాము. భారతదేశం, సింగపూర్‌కు చెందిన కుటుంబ సభ్యులు, స్నేహితుల నుండి వచ్చిన ఫీడ్‌బ్యాక్ మాకు చాలా సహాయపడింది అని నేహా వివరించారు.

ఆరు నెలలు ఉచితం

ప్రస్తుతం కంపెనీ రూ. 3,500 విలువైన స్టార్టర్ ప్యాక్‌ను అందిస్తుంది. ఇందులో ఆరు నెలల ఉచిత ఆడియో కంటెంట్‌తో పేరెంట్ నియంత్రిత యాప్, సురక్షితంగా వినడం కోసం 90 dB క్యాప్ చేయబడిన వాల్యూమ్ లిమిటర్‌లతో కూడిన పిల్లలకు అనుకూలంగా ఉండే హెడ్‌ఫోన్‌లు, రెండు యాక్టివిటీ పుస్తకాలు ఉంటాయి. Vobble త్వరలో తక్కువ ధరతో మూడు నెలల సబ్‌స్క్రిప్షన్ ప్యాక్‌తో రాబోతుందని నేహా పంచుకున్నారు. అధిక ధరపై సందేహం వ్యక్తం చేసిన కౌర్ గత రెండు నెలలుగా వీటిని ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ఇది డబ్బు కన్నా విలువైనదని గుర్తించారు. ప్రస్తుతానికి Vobble బ్లూమ్ ఫౌండర్స్ ఫండ్, యుఎస్, భారతదేశానికి చెందిన టెక్ ఏంజెల్ వ్యవస్థాపకులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల నుండి 400,000 డాలర్లను సేకరించింది. ప్రస్తుతం కంపెనీ స్టార్టర్ ప్యాక్‌ను అందిస్తోంది. ఇందులో 200 మంది సభ్యులు ఉన్నారు. అయితే రాబోయే నెలల్లో సాధారణ సబ్‌స్క్రిప్షన్‌లు, బాక్స్ సబ్‌స్క్రిప్షన్‌లు రెండింటినీ ప్రవేశపెట్టాలని వ్యవస్థాపకులు ప్లాన్ చేస్తున్నారు. తమ బాక్స్‌ను 10,000 మందికి విక్రయించాలని, 2024 చివరి నాటికి లక్ష కంటే ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్ బేస్‌ను పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'సృజనాత్మకతను పెంపొందించడం, ఉత్సుకతను రేకెత్తించడం ద్వారా పిల్లల స్క్రీన్ సమయాన్ని తగ్గించడానికి ఆడియో కంటెంట్ విలువైన పరిష్కారాన్ని ఇది అందిస్తుంది. దీనికోసం Vobble కచ్చితమైన లక్ష్యంగా పెట్టుకుంది' నేహా జతచేస్తున్నారు.

మా ఆసక్తులు ఒకటే

వోబుల్ 2023 ఆగస్టులో డబ్బు సంపాదించడం ప్రారంభించింది. వారి భర్తలు ఇద్దరూ వ్యాపారవేత్తలు కాబట్టి వారి నుండి కొన్ని నైపుణ్యాలను నేర్చుకున్నారు. 'మా ఇద్దరికీ ఒకే విధమైన ఆసక్తులు ఉన్నాయి. కానీ మా నైపుణ్యం, స్వభావం కాస్త భిన్నంగా ఉంటాయి. నేను ఆపరేషన్, మార్కెటింగ్, ఫైనాన్స్‌ను నిర్వహిస్తాను. సౌమ్య కంటెంట్ సృష్టి, ఉత్పత్తితో సహా సృజనాత్మక భాగాలను చూసుకుంటుంది. ఇలా మేమిద్దరం కలిసి మనసు పెట్టి ఈ వ్యాపారం ప్రారంభించాం' అంటూ నేహా తన మాటలు ముగించారు.



సుప్రీంకోర్టుకు ప్రబీర్, అమిత్

(మొదటిపేజీ తరువాయి)

ధర్మాసనం పిటిషన్ కాపీలను సర్క్యులేట్ చేయవలసిందిగా పుర్కాయస్థ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను కోరింది. అత్యవసర విచారణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది."ఇది న్యూస్‌క్లిక్ విషయం. జర్నలిస్టులు పోలీసుల అదుపులో ఉన్నారు. ఇక్కడ నిందితుల్లో ఒకరు 75 ఏండ్ల వృద్ధుడు" అని సిబల్ పేర్కొన్నారు. కఠినమైన ఉపా ప్రకారం నిర్బంధ సమయంలో పోలీసులు రాతపూర్వక ఆధారాలను అందించాల్సిన అవసరం లేదని ఢిల్లీ హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చింది. అరెస్టు చేయడానికి గల కారణాలను రాతపూర్వకంగ ఇవ్వాలన్న పుర్కాయస్థ, చక్రవర్తి వాదనను తిరస్కరించింది.

ఆడబిడ్డ చనిపోతే ఆరోపణలా?

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌దీ కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు తెలంగాణ దశ, దిశ మార్చే సమయం వచ్చిందన్నారు. నీళ్లు జగన్ రెడ్డి తీసుకుపోయారు.. నిధులు కృష్ణారెడ్డి తీసుకుపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆపదలో ఉన్న సమయంలో పార్టీని కాపాడిన రామ్మోహన్ రెడ్డికి మొదటి విడతలోనే టికెట్ కేటాయించినట్టు తెలిపారు. కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. సమావేశంలో వికారాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, డీసీసీ అధ్యక్షులు, పరిగి అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి చంద్రశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండె చప్పుడు ఆపలేం..

(మొదటిపేజీ తరువాయి)

26 వారాలకు పైగా వయసు ఉన్న పిండాన్ని తొలగించడానికి మహిళను అనుమతించాలా వద్దా అనే విషయంలో సుప్రీంకోర్టు గందరగోళానికి గురయింది. ముందుగా ఈ పిటీషన్ విచారించి ఎయిమ్స్ వైద్యులు ఈ నెల 6న ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నెల 9న గర్భవిచ్ఛిత్తికి సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ నెల 10న ఎయిమ్స్ వైద్యుల్లో ఒకరు పిండం బతికే అవకాశం ఉందని సుప్రీంకోర్టుకు ఈమెయిల్ చేశారు. గర్భవిచ్ఛిత్తికి వ్యతిరేకంగా కేంద్రం కూడా పిటీషన్ వేసింది. దీనిపై ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయంతో తీర్పు ఇచ్చింది. తుది తీర్పు కోసం ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ధర్మాసనం ముందుకు ఈ పిటీషన్ వచ్చింది. గర్భవిచ్ఛితికి అనుమతి నిరాకరిస్తూ సుప్రీంకోర్టు సోమవారం తుది తీర్పు ఇచ్చింది.

బంగాళాఖాతంలో కలిపేయండి..

(మొదటిపేజీ తరువాయి)

ముంచేందుకు మాత్రం కబ్జా కాలమ్ పెడతరా.." అని ప్రశ్నించారు. కౌలుకు ఇచ్చుడంటే, కిరాయికి ఇచ్చుడేనని తెలిపారు. రైతులు కష్టాలు పడొద్దని ఎవరి భూమి వారి పేరిట ఉండేలా 'ధరణి'ని ఏర్పాటు చేశామన్నారు. కేసీఆర్ బతికున్నంత వరకు లౌకికవాదం వీడమని స్పష్టం చేశారు.

జనగామ జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీ ప్రతిపాదిత మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో జనగామ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే.. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తును రైతులకు అందించామని, మూడు గంటలు కరెంటు ఇస్తే చాలని కాంగ్రెసోళ్లు చెబుతున్నారన్నారు. ఉద్యమ సమయంలో జనగామ జిల్లా పరిస్థితి ఘోరంగా వుండేదని, కిలోమీటర్ల దూరానికి వెళ్లి సాగు, తాగునీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక జనగామ ప్రాంతానికి మల్లన్నసాగర్ ద్వారా సాగు, తాగు నీరందిస్తున్నామన్నారు. బచ్చన్నపేట చెరువు ఇప్పుడు ఎప్పుడు చూసినా నిండుగా ఉంటుందని అధికారులు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చెబుతుంటే సంతోషంగా ఉందని చెప్పారు. హైదరాబాద్-వరంగల్ మధ్య రెండు ఎకనామిక్ గ్రోత్ కారిడార్లు ఏర్పాటు చేయాలని భావించడం వల్లే జనగామ, భువనగిరి రెండింటిని జిల్లాలుగా చేశామని తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో అద్భుతమైన ప్రగతి వస్తుందన్నారు.బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం, దళిత బంధును ఎట్టిపరిస్థితిల్లోనూ కొనసాగిస్తామన్నారు. రాష్ట్రంలో ఐటీ పారిశ్రామిక అభివృద్ధి బ్రహ్మాండంగా జరుగుతుందని తెలిపారు. పదేండ్లలో రాష్ట్రంలో ఒక్క మత కల్లోలం కూడా లేదన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలు ఒకే రోజు వస్తే ముస్లిం మత పెద్దలతో కూర్చొని నిర్ణయం తీసుకొని ఒకరోజు తరువాత పండుగలు నిర్వహించుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో మత సామరస్యానికి ఇది నిదర్శనమన్నారు. మల్లన్నసాగర్ రైతులకు నెత్తి మీద కుండలాగుందని, దాని నుంచి తపాస్‌పల్లికి లింకు కలపనున్నామని, దాంతో ఎక్కడ కరువు వచ్చినా జనగామకు కరువు రాదని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు కేవలం ఉమ్మడి వరంగల్ జిల్లా కోసమేనన్నారు. అద్భుతమైన ప్రజా మ్యానిఫెస్టోను ప్రకటించామన్నారు. జనగామలో మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉన్నందున, దీనితోపాటు నర్సింగ్ కాలేజీ, పారా మెడికల్ కాలేజీలు కూడా వస్తాయన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన ఇంట్లోనే ఉంటారని, ఆయన్ను దీవించి లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌లో 'పొన్నాల' చేరిక

సీఎం కేసీఆర్ సమక్షంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు మాజీ మున్సిపల్ చైర్మెన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీజేపీ కౌన్సిలర్ శ్రీనివాస్, వారి అనుచరులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సభలో మంత్రి సత్యవతిరాథోడ్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, జడ్పీ చైర్మెన్ పి. సంపత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, డాక్టర్ టి. రాజయ్య, నాయకులు బోడకుంటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ జమున, నాగపురి రాజలింగం, మండల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి జిల్లాకే యాదాద్రి ఒక బంగారు తునక

యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి వరుస విజయాలతో అద్భుతంగా ముందుకు పోతున్నారని, ఈ ఎన్నికల్లోనూ 50వేల మెజార్టీతో గెలిపించుకోవాలని తెలిపారు. కరువు ప్రాంతమైన భువనగిరిలో రెండు మూడు చిన్న కాలువల పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. వాటిని పూర్తి చేయిస్తామన్నారు. యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని నూతన కట్టడాలతో అత్యద్భుతంగా నిర్మించుకున్నామని, అది రాష్ట్రానికే బంగారు తునక అన్నారు. బస్వాపురం నరసింహ ప్రాజెక్టు 98శాతం పూర్తయిందని, మిగతా పనులూ పూర్తిచేసుకుని తన ఆధ్వర్యంలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పరిపాలనలో పురుడుపోసుకున్న అరాచక శక్తులను.. బీఆర్ఎస్ ప్రభుత్వం కూకటివేళ్లతో పెకిలించి పారేసిందన్నారు. రైతుల భూముల మీద రైతులకే హక్కులు కలిగించే విధంగా ధరణి వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. వీఆర్వో, గిర్దావర్, తహసీల్దార్ పేరిట తమ భూముల రిజిస్ట్రేషన్ నమోదు కోసం రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటన్నింటినీ తొలగించడంతోపాటు ఒకరి భూములు మీద మరొకరు అజమాయిషీ ఉండకుండా చేస్తామన్నారు. ఎంతో కష్టపడి రైతులు వ్యవసాయ భూమిని సమకూర్చుకుంటే ఆ భూమిలో కబ్జాకాలమ్ (కౌలు) పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు ఆగమాగం కావద్దని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టి.. వాస్తవాన్ని గుర్తించి ఆలోచించి ఓటు వేయాలని కోరారు. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న భువనగిరికి స్పెషల్ ఐటీ పార్కు, ఇండస్ట్రియల్ పార్కు తెచ్చే బాధ్యత తనదేనని తెలిపారు. భూముల ధరలు పెరిగి రైతులు ప్రజలు సంతోషపడుతున్నారని తెలిపారు. కారు గుర్తుకే ఓటు వేయాలని జై తెలంగాణ అంటూ సభికులతో నినాదాలు చేయించారు. సభలో ప్రభుత్వ విప్ సునీత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జెడ్పీచైర్మెన్ సందీప్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, గొంగిడి మహేందర్ రెడ్డి, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, బూడిది భిక్షమయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొలుపుల అమరేందర్, గ్రంథాలయ సంస్థల జిల్లా అధ్యక్షులు జడల అమరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో చీకటి కాలం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు, జర్నలిస్టులు నిర్భయంగా పనిచేసేందుకు, జీవించే పరిస్థితులను కల్పించేందుకు జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును వివిధ సంఘాలు సంయుక్తంగా అభ్యర్థించాయి. "ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభానికి సంకెళ్లు వేసిన చీకటి కాలం దేశంలో నెలకొంది. రహస్యంగా ఇప్పుడు అదే పరిస్థితిని అనుభవిస్తున్నారు. జర్నలిస్టులకు వ్యతిరేకంగా క్రూరమైన చట్టాలు ఎక్కువగా ఉపయోగించబడుతున్నాయి. వారిలో ఎక్కువ మంది ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు" అని లేఖలో పేర్కొన్నాయి. "ఇటీవల ఇలాంటి కేసుల్లో జర్నలిస్టుల ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హార్డ్ డ్రైవ్‌లు స్వాధీనం చేసుకున్నారు. జర్నలిస్టులకు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద జైలుశిక్ష విధిస్తున్నారు. ప్రజాస్వామ్యం మనుగడకు, పురోగమనానికి స్వేచ్ఛా మీడియా అవసరం. దేశంలో అత్యున్నత రాజ్యాంగ హోదా కలిగి ఉన్న రాష్ట్రపతి పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు జోక్యం చేసుకోవాలి" అని కోరారు. సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి న్యూఢిల్లీ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్, ప్రెస్ అసోసియేషన్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, కెయూడబ్ల్యూజే, డిజిపబ్, ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్, వెటరన్ జర్నలిస్ట్ గ్రూప్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్‌లు సంయుక్తంగా లేఖ రాశాయి. న్యూస్‌క్లిక్‌పై కేంద్ర ప్రభుత్వ దాడికి నిరసనగా ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిరసన సభ, ధర్నా నిర్వహించింది. ప్లకార్డులు చేబూని నిరసన హోరెత్తించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రేమశంకర్ ఝా, సతీష్ జాకబ్, నీనా వ్యాస్, సుజాత మధోక్, ఎంకే వేణు, పరంజోయ్ ఠాకుర్తా, కేయూడబ్ల్యూజే ఢిల్లీ యూనిట్ కార్యదర్శి ధనసుమోద్ మాట్లాడారు.

మంత్రిగారూ... సాక్ష్యాలివిగో...

(మొదటిపేజీ తరువాయి)

పొందుపర్చడం గమనార్హం. గ్రూప్-2 వాయిదా, డీఎస్సీ వాయిదా పడిన నేపథ్యంలో ప్రవళిక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె మరణం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలపైనా ప్రభావం చూపే పరిస్థితి తలెత్తింది. ఇంత క్లిష్టమైన సమయంలో మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఆ మాటలు ఆయన మాటల్లోనే 'ప్రవళిక ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు చెప్పారు. అది తెలుసుకోకుండా ప్రతిపక్షాలు హడావుడి చేశాయి. ఆమె ఆత్మహత్యపై చర్చ జరిగి వాట్సాప్ చాట్ బయటికి వస్తే ఆమె కుటుంబం పరువు పోదా?. అసలు ఆ అమ్మాయి గ్రూప్స్‌కే దరఖాస్తు చేయలేదంటున్నారు. తెలుసుకోండి మీరు. రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే ట్వీట్ చేస్తారు. కనీసం ఆ సమాచారం?, నిజమా కాదా? అని తెలుసుకోకుండా ధ్రువీకరించుకోకుండా ఒక అమ్మాయి మరణం పట్ల ఇంత దిగజారుడుతనంతో రాజకీయం చేయడం కరెక్టా?. ఓట్లు, రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయి. దేశానికి ప్రధాని అవుతానని కలలు కనేవారు, మాట్లాడే ముందు ఆలోచించాలి కదా?. జాగ్రత్తగా ట్వీట్ చేయాలి.'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. దీనిపై నిరుద్యోగులు, ఓయూ జేఏసీ నాయకులు, కొన్ని మీడియా సంస్థలు ముఖ్యంగా సోషల్ మీడియాలో మంత్రి వ్యాఖ్యలు అబద్ధమని తేలిపోయిందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండి, బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి కనీస సమాచారం తెలుసుకోకుండా మాట్లాడ్డాన్ని చాలా మంది తప్పుపడుతున్నారు. అయితే ఆయన తెలుసుకోకుండా మాట్లాడ్డమే కాకుండా రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ట్వీట్లపై స్పందించడం, ఆమె మరణాన్ని దిగజారుడుతనంతో రాజకీయం చేయడంపై వ్యాఖ్యానించడం సరైంది కాదంటున్నారు. ప్రవళిక కుటుంబానికి మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పాలనీ, ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనీ, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్లు వస్తున్నాయి.

మణిపూర్ మండుతుంటే..ఇజ్రాయిల్ వైపు మోడీ చూపు

(మొదటిపేజీ తరువాయి)

కుకి వర్గాల మధ్య ఘర్షణలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నారు..మహిళలను లైంగిక వేధింపులకు గురిచేశారు..చిన్నారులను చిదిమేశారని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇంత జరిగినా మణిపూర్‌ను సందర్శించడం ముఖ్యమనే విషయాన్ని ప్రధాని మోడీ గుర్తించలేదని అన్నారు. మేలో మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లినప్పటి నుంచి ఇంతవరకూ ప్రధాని మోడీ ఆ రాష్ట్రాన్ని ఇప్పటివరకూ సందర్శించకపోవడం సిగ్గుచేటని రాహుల్ చెప్పారు.

బీఆర్ఎస్‌కు దళిత బంధుగండం?

(మొదటిపేజీ తరువాయి)

ఫైనల్ లిస్టు చేరింది. కానీ ప్రభుత్వం నిధులు మాత్రం విడుదల చేయకుండా జాప్యం చేసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని సర్కారుకు తెలిసి కూడా దీన్ని పెండింగ్‌లో పెట్టింది?. ఎందుకు? నిధుల లేమీ కారణమా?.. ఒకవేళ రెండో లిస్టు ఇస్తే చాలా మంది రాని వాళ్ల నుంచి వ్యతిరేకత వస్తుందనా?. దీంతో ఇది పెండింగ్‌లో పెట్టడమే మేలనుకున్నారా?. ఇత్యాది అనుమానాలు, ప్రశ్నలు లబ్దిదారుల్లో వ్యక్తమవుతున్నాయి.

బీఆర్ఎస్‌పై గుర్రు..

పథకం ప్రవేశపెట్టి సరిగ్గా నేటికి 26 నెల్లయింది. ప్రభుత్వం కొండంత ప్రచారం చేసుకుంది. ఇచ్చింది మాత్రం 38,323 మందికి మాత్రమే. ఆ తరువాత ఈ ఏడాది బడ్జెట్లో ప్రభుత్వం ఘనంగా రూ.17,700 కోట్లు కేటాయించింది. నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1,29,800 మందికి ఈ ఏడాది పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించింది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో ఒక్కరంటే ఒక్కరికి కూడా దళిత బంధు పథకాన్ని అమలు చేయలేదు. పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారా అని లబ్దిదారులు ఎదురుచూస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. తృణమో..ఫణమో అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమర్పించుకుని లబ్దిపొందాలని ఆశపడ్డారు. కానీ..ప్రభుత్వం వ్యూహాత్మకంగానే సాధారణ ఎన్నికల వరకు సాగదీసిందని వాపోతున్నారు. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థులపై దళితులు గుర్రుగా ఉన్నారని తెలుస్తున్నది.

సీఎం మాటలు నీటి మూటలేనా?

సీఎం కేసీఆర్ దళితులను మభ్యపెట్టేందుకు మాయ మాటలు చెబుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దళిత బంధు పథకంపై ఖమ్మం బీఆర్ఎస్ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతున్నాయి. 'దళిత జాతి బిడ్డలు ఎవరి కోసం వివక్ష అనుభవించాలి. ఎన్నేళ్లు అనుభవించాలి. అందుకే పుట్టింది తెలంగాణలో దళితబంధు పథకం. భారత దళిత జాతికి నేను పిలుపు ఇస్తున్నా. తెలంగాణ దళిత బంధు పథకాన్ని ఏడాదికి 25 లక్షల కుటుంబాల చొప్పున దేశమంతా అమలు చేయాలి. మీరు చేయకపోతే మేం చేసి చూపిస్తాం' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే పథకం అమలుకు చిత్తశుద్ధిని ప్రదర్శించకుండా.. దేశవ్యాప్తంగా అమలు చేస్తామని బీరాలు పలికారు. ఇదే ఇప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అభ్యర్థులకు గండంగా మారింది.

ఆరంభ శూరత్వమే..

ఉప ఎన్నిక నేపథ్యంలో 2021 జూలైలో హుజూరాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు పథకాన్ని ప్రారంభించారు. ఆ నియోజకవర్గంలో అప్పట్లో సంతృప్త స్థాయిలో అందరికీ అమలు చేశారు. అదే ఏడాది ఆగస్టులో సీఎం దత్తత గ్రామమైన వాసాలమర్రిలోనూ 75 మందికి అందించారు. ఆ తర్వాత, రాష్ట్రం నాలుగు దిశల్లో అమలు పేరిట ఖమ్మం, సూర్యాపేట, నాగర్ కర్నూల్, కామారెడ్డి జిల్లాలోని ఎస్సీ నియోజక వర్గాలైన మధిరలోని చింతకానికి రూ.100 కోట్లు, తుంగతుర్తిలోని తిరుమలగిరి మండలానికి రూ.50 కోట్లు, అచ్చంపేటలోని చారగొండ మండలానికి రూ.50 కోట్లు, జుక్కల్‌లోని నిజాంసాగర్ మండలానికి రూ.50 కోట్ల చొప్పున ఆయా జిల్లాల కలెక్టర్ల అకౌంటుకు బదిలీ చేసింది. దీంతో ఆయా మండలాల్లో మొత్తం 4,808 మందికి పథకం అందింది. అనంతరం, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో దశల వారీగా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కానీ ఎక్కడా అమలు చేయలేకపోయారు.

త్రిశంకు స్వర్గంలో బాక్సింగ్!

- 2028 ఒలింపిక్స్ జాబితాలో దక్కని చోటు
- తుది నిర్ణయానికి మరింత సమయం



నవతెలంగాణ-ముంబయి

అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్య (ఐబీఏ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఉన్నతాధికారుల నడుమ వివాదం 'బాక్సర్ల'పై పడింది. రష్యాకు చెందిన ఉమర్ క్రెమ్లెవ్ అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఉమర్ ఐబీఏను నడిపిస్తున్న తీరు, పరిపాలన, ఆర్థిక లావాదేవీలు సహా పారదర్శక టోర్నీల నిర్వహణ పట్ల అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఐఓసీ సూచనలు బేఖాతరు చేస్తూ ఉమర్ సైతం ఏకపక్షంగానే దూసుకెళ్తున్నారు. ఇటు ఐఓసీ ఉన్నతాధికారులు సైతం ఆటను పక్కనపెట్టి.. ఉమర్‌ను దారికితీసుకొచ్చే దారులను వెతుకుతున్నారు. అందులో భాగంగానే 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ క్రీడల జాబితాలో బాక్సింగ్‌కు చోటు దక్కలేదు. సోమవారం ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్‌లో ఐఓసీ సెషన్ ముగియగా.. 2028 లాస్ ఏంజిల్స్ క్రీడల జాబితాకు ఇక్కడ ఆమోదం లభించింది. అయితే, 1920 నుంచి ఒలింపిక్స్‌లో రెగ్యులర్ క్రీడగా కొనసాగుతున్న బాక్సింగ్‌కు చోటు లభించలేదు. బాక్సింగ్‌ను 'హోల్డ్‌లో ఉంచినట్టు' ఐఓసీ అధికారి ప్రతినిధి వెల్లడించారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు చోటు దక్కింది. కానీ ఒలింపిక్స్‌కు బాక్సర్లను ఐబీఏ నిర్వహించిన టోర్నీల నుంచి ఎంపిక చేయటం లేదు. ఐఓసీ యంత్రాంగం ప్రత్యేకంగా ఎంపిక చేసిన టోర్నీలు, నిర్వహించిన టోర్నీల ద్వారా బాక్సర్లను పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపిక చేస్తున్నారు. 'లాస్ ఏంజిల్స్ 2028 స్పోర్ట్స్ ప్రోగ్రామ్‌కు సంబంధించి బాక్సింగ్‌పై నిర్ణయాన్ని ప్రస్తుతానికి పక్కనపెట్టాం. దీనిపై ఐఓసీ సెషన్లో ఎటువంటి చర్చ జరగలేదు. ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు గొప్ప చరిత్ర ఉంది. అమెరికాకు దిగ్గజ బాక్సర్ల వారసత్వం ఉంది. 2028 ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌ను చూసేందుకు ఐఓసీ, అమెరికా ఇష్టపడతాయి. ఐఓసీకి బాక్సింగ్‌తో, బాక్సర్లతో ఎటువంటి సమస్య లేదు. బాక్సింగ్ సమాఖ్యను నడిపిస్తున్న గవర్నింగ్ బాడీతోనే సమస్య ఎదుర్కొంటున్నాం. మరో బాక్సింగ్ సమాఖ్యకు ఐఓసీ గుర్తింపు ఇవ్వలేదు. ఇప్పటికిప్పుడు దీనిపై నిర్ణయం తీసుకోలేదు. కాలం సమాధానం ఇస్తుందని ఆశిస్తున్నామని' లాస్ ఏంజిల్స్ 2028 చైర్మెన్ కాసీ వాసెర్‌మాన్ తెలిపారు.



లాస్ ఏంజిల్స్‌లో క్రికెట్‌కు చోటు

2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ ప్రోగ్రామ్‌లో క్రికెట్‌కు అధికారికంగా చోటు లభించింది. సోమవారం ముంబయిలో సమావేశమైన ఐఓసీ సెషన్ లాస్ ఏంజిల్స్ స్పోర్ట్స్ ప్రోగ్రామ్‌కు ఆమోద ముద్ర వేసింది. క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రోస్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, స్క్వాష్‌లకు క్రీడల జాబితాలో చోటు దక్కింది. 2028 ఆతిథ్య నగరం సిఫారసుల మేరకు ఈ ఐదు క్రీడలను జాబితాలో చేర్చారు. ఈ అంశంలో ఓటింగ్ నిర్వహించగా ఇద్దరు వ్యతిరేకంగా, మిగతా సభ్యులు అనుకూలంగా ఓటేశారు. మెన్స్, ఉమెన్స్ విభాగాల్లో టీ20 ఫార్మాట్‌లో ఆరు జట్లతో కూడిన టోర్నీని ఐసీసీ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కటంపై ఐసీసీ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది.

హ్యాట్రిక్‌పై సఫారీ గురి

- నెదర్లాండ్స్‌తో పోరు నేడు
- ఐసీసీ ప్రపంచకప్



ధర్మశాల (హిమాచల్‌ప్రదేశ్) : తొలి రెండు మ్యాచుల్లో తిరుగులేని విజయాలు (శ్రీలంక, ఆస్ట్రేలియా) సాధించిన జట్టు దక్షిణాఫ్రికా. హైదరాబాద్ వేదికగా ఆడిన రెండు మ్యాచుల్లో (పాకిస్థాన్, న్యూజిలాండ్) పరాజయం పాలైన జట్టు నెదర్లాండ్స్. భీకర ఫామ్‌లో ఉన్న దక్షిణాఫ్రికా సహజంగానే డచ్ జట్టును పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సఫారీకి షాక్ ఇచ్చిన నెదర్లాండ్స్.. ఆ జట్టు టోర్నీ ముందంజ వేయకుండా అడ్డుకుంది. దీంతో సూపర్ ఫామ్‌లో ఉన్నప్పటికీ, వరుస విజయాల జోరుమీదు ఉన్నప్పటికీ నేడు ప్రపంచకప్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను పసికూనగా తీసుకునే పరిస్థితిలో సఫారీలు కనిపించటం లేదు. ధర్మశాల వేదికగా నేడు దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ తలపడనుండగా.. సఫారీలు గ్రూప్ దశలో హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. నెదర్లాండ్స్ బౌలింగ్ విభాగం నిలకడగా మెప్పిస్తున్నా.. ఆ జట్టు బ్యాటర్లు అంచనాలను అందుకోవటం లేదు. ప్రపంచ శ్రేణి బౌలర్లను ఎదుర్కొని పరుగులు సాధించటంలో విఫలమవుతున్నారు. మరోవైపు సఫారీ బ్యాటర్లు, బౌలర్లు భీకర ఫామ్‌లో ఉన్నారు. క్వింటన్ డికాక్, ఎడెన్ మార్క్‌రామ్, వాన్‌డర్ డుసెన్‌లు ధనాధన్ దంచికొడుతున్నారు. నేడు ధర్మశాలలో మరోసారి డచ్ ఝలక్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా.. జోరుమీదున్న సఫారీలు ఏకపక్ష విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ మ్యాచ్ నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానుంది.

గులాబీ వర్సెస్ కమలం

- రసవత్తరంగా హెచ్‌సీఏ ఎన్నికలు
- అధ్యక్ష రేసులో జగన్ ముందంజ



నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఆఫీస్ బేరర్ల పదవులకు శుక్రవారమే ఓటింగ్ కావటంతో ఎన్నికల్లో విజయం కోసం ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. నాలుగు ప్యానల్స్ హెచ్‌సీఏ ఎన్నికల బరిలో నిలువగా.. ప్రధానంగా పోటీ గులాబీ వర్సెస్ కమలంగా కనిపిస్తోంది. అధికార భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) మద్దతుతో జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఏఐ) ప్రధాన కార్యదర్శి అర్శినపల్లి జగన్‌మోహన్ రావు అధ్యక్ష పదవి కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. మరోవైపు భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి చెందిన కీలక నేత, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు వివేక్ వెంకటస్వామి తన ప్యానల్‌ను రేసులో నిలిపారు. దీంతో హెచ్‌సీఏ ఎన్నికల్లో ఈ రెండు ప్యానల్స్ నడుమే ప్రధానంగా పోటీ కనిపిస్తుంది.

ముందంజలో జగన్! : హెచ్‌సీఏ అధ్యక్ష పదవి రేసులో జగన్‌మోహన్ రావు ముందంజలో కొనసాగుతున్నట్టు తెలుస్తుంది. శుక్రవారం జరుగనున్న ఎన్నికల్లో 173 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సాధారణ మెజారిటీ సాధించేందుకు 87 ఓట్లు అవసరం. హెచ్‌సీఏ ఓటర్ల జాబితాలో 48 మంది ఇన్‌స్టిట్యూషన్స్, 9 జిల్లాల అసోసియేషన్లు, 15 మంది అంతర్జాతీయ క్రికెటర్లు ఉన్నారు. ప్రభుత్వం సూచనల మేరకు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవటం ఇన్‌స్టిట్యూషన్స్‌కు సంప్రదాయంగా వస్తోంది. జిల్లా క్రికెట్ సంఘాలు సైతం అదే కోవలో ఉన్నాయి. ప్రభుత్వంలో ఇద్దరు కీలక మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీశ్ రావు సహా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అండదండలు జగన్‌మోహన్‌రావుకు ఉన్నాయి. దీంతో 101 క్లబ్ సెక్రటరీలలో అధిక శాతం మంది జగన్ ప్యానల్‌తో టచ్‌లో ఉన్నారని సమాచారం. జాతీయ హ్యాండ్‌బాల్ సంఘంలో నిర్వివాద విజయాలు, ప్రభుత్వం అండతో హెచ్‌సీఏకు పూర్వ వైభవం తీసుకొస్తారనే అంశాలు జగన్‌మోహన్‌రావును రేసులో ముందంజలో నిలుపుతున్నాయి. మాజీ క్రికెటర్లు శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్‌లు ఓ ప్యానల్‌తో ముందుకొచ్చినా.. ఏండ్లుగా ఏలుతున్న పెద్దలు ఇప్పుడు కొత్తగా ఏం చేస్తారనే పెదవి విరుపులు హెచ్‌సీఏ వర్గాల్లో వినిపిస్తున్నాయి!.

ఆసీస్‌కు ఓ విజయం

- శ్రీలంకపై 5 వికెట్లతో గెలుపు
- రాణించిన జంపా, కమిన్స్
- ఐసీసీ 2023 ప్రపంచకప్

నవతెలంగాణ-లక్నో



ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాకు ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. సోమవారం లక్నోలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో శ్రీలంకపై ఆస్ట్రేలియాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆసీస్ హ్యాట్రిక్ పరాజయం నుంచి తప్పించుకోగా.. లంకేయులకు ముచ్చటగా మూడో ఓటమి తప్పలేదు. 210 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ మిచెల్ మార్ష్ (52, 51 బంతుల్లో 9 ఫోర్లు), జోశ్ ఇంగ్లిశ్ (58, 59 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. గ్లెన్ మాక్స్‌వెల్, మార్నస్ లబుషేన్ (40, 60 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 209 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్లు నిశాంక (61, 67 బంతుల్లో 8 ఫోర్లు), కుశాల్ పెరీరా (78, 82 బంతుల్లో 12 ఫోర్లు) అర్థ సెంచరీలతో మెరిసినా.. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. 52 పరుగులకే చివరి 9 వికెట్లు చేజార్చుకున్న శ్రీలంక భారీ మూల్యం చెల్లించుకుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆస్ట్రేలియాకు ఇది తొలి విజయం కాగా, శ్రీలంకకు ఇది మూడో ఓటమి.

శ్రీలంక టపటపా : తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఓపెనర్ల దూకుడుతో భారీ స్కోరు దిశగా సాగింది. పెరీరా (78), నిశాంక (61) తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఫామ్‌లో ఉన్న కుశాల్ మెండిస్ (9), సదీర సమరవిక్రమ (8) నిరాశపరచటంతో శ్రీలంక కథ అడ్డం తిరిగింది. ఆసీస్ స్పిన్నర్ జంపా వలలో చిక్కుకున్న మిడిల్ ఆర్డర్.. పేకమేడలా కుప్పకూలింది. చివరి 9 వికెట్లను లంకేయులు 52 పరుగులకే కోల్పోయారు. 43.3 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యారు. మిడిల్ ఆర్డర్‌లో అసలంక (25) ఒక్కడే రెండెంకల స్కోరు అందుకున్నాడు. కమిన్స్, స్టార్క్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. జంపా (4/47) నాలుగు వికెట్లతో మాయ చేశాడు.

ఆడుతూ పాడుతూ : స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. డెవిడ్ వార్నర్ (11), స్టీవ్ స్మిత్ (0) నిరాశపరిచినా.. మిచెల్ మార్ష్ (52), జోశ్ ఇంగ్లిశ్ (58), లబుషేన్ (40), మాక్స్‌వెల్ (31 నాటౌట్, 21 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (20 నాటౌట్, 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరవటంతో 35.2 ఓవర్లలోనే ఆసీస్ లాంఛనం ముగించింది. శ్రీలంక బౌలర్లలో మధుశంక (3/38) రాణించాడు.

ప్రణయ్‌కి గాయం

- 3 వారాలు ఆటకు దూరం
- నేటి నుంచి డెన్మార్క్ ఓపెన్



ఒడెన్సె (డెన్మార్క్) : భారత బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారుడు, ఆసియా క్రీడల పతక విజేత హెచ్.ఎస్ ప్రణయ్ గాయం బారిన పడ్డాడు. ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల పురుషుల సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ప్రణయ్.. 41 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ సయ్యద్ మోడీ తర్వాత ఆ ఘనత సాధించిన భారత షట్లర్‌గా నిలిచాడు. మెన్స్ జట్టు విభాగం ఫైనల్స్‌కు గాయం కారణంగా దూరమైన ప్రణయ్.. మెన్స్ సింగిల్స్‌లో వెన్ను నొప్పితోనే బరిలో నిలిచాడు. వెన్నునొప్పి కారణంగా రానున్న కీలక టోర్నీలకు ప్రణయ్ దూరం కానున్నాడు. 'ఈ నెల ఏ టోర్నీలో ఆడలేను. ఎంఆర్ఐ స్కాన్ నివేదిక సైతం వచ్చింది. 2-3 వారాలు విశ్రాంతి అవసరమని సూచించారు. డెన్మార్క్, ఫ్రాన్స్ ఓపెన్ నుంచి వైదొలుగుతున్నాను. విరామం తీసుకుని, ఆ తర్వాత రిహాబిలిటేషన్ మొదలుపెడతాను' అని హెచ్.ఎస్ ప్రణయ్ తెలిపాడు. ప్రణయ్ తప్పుకోగా.. యువ షట్లర్ లక్ష్యసేన్, మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్‌లు మెన్స్ సింగిల్స్ విభాగంలో టైటిల్ ఆశలతో బరిలోకి దిగనున్నారు. డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ.. ట్రెసా జాలీ, పుల్లెల గాయత్రి జంట బరిలో నిలిచాయి. మహిళల సింగిల్స్‌లో పి.వి సింధు సైతం ఫామ్ అందుకునేందుకు ఎదురుచూస్తుంది. ఇటీవల ఆర్కిటిక్ ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన సింధు.. బిడబ్ల్యూఎఫ్ 750 సూపర్ టోర్నీలో సత్తా చాటాలని భావిస్తుంది. డెన్మార్క్ ఓపెన్ నేటి నుంచి ఆరంభం కానుండగా.. బుధవారం నుంచి ప్రధాన మ్యాచులు జరుగుతాయి.

స్థానిక క్రికెటర్లకు అవకాశాలు

'క్రికెట్ ఫస్ట్' హెచ్‌సీఏ ప్యానల్ హామీ

నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) జట్లలో స్థానిక క్రికెటర్లకు మాత్రమే అవకాశాలు కల్పిస్తామని, స్థానికేతరులు హెచ్‌సీఏ తరఫున బరిలోకి దిగే సంస్కృతికి చరమగీతం పాడుతామని 'క్రికెట్ ఫస్ట్' హెచ్‌సీఏ పోల్ ప్యానల్ ప్రకటించింది. 'జట్ల ఎంపికకు పదో తరగతి సర్టిఫికెట్‌ను ప్రామాణికంగా తీసుకుంటాం. తెలంగాణలో ఎస్ఎస్‌సీ చదివిన వారిని స్థానికులుగా పరిగణిస్తాం. ఇతరులు ఇక్కడ ఆడాలంటే కనీసం ఐదేండ్ల పాటు క్లబ్, జోనల్ క్రికెట్‌లో ఆడాలనే నిబంధనలు తీసుకొస్తామని' హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు అర్షద్ అయూబ్ తెలిపారు. ఈ నెల 20న జరుగనున్న హెచ్‌సీఏ ఎన్నికల్లో ఆ ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా అమర్‌నాథ్, ఉపాధ్యక్షుడిగా జి. శ్రీనివాస రావు, కార్యదర్శిగా ఆర్. దేవరాజ్, కోశాధికారిగా సి. సంజీవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా చిట్టి శ్రీధర్, కౌన్సిలర్‌గా సునీల్ కుమార్ పోటీ చేస్తున్నారు. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి శేషు నారాయణ సహా ఇతర క్రికెటర్లు ఈ ప్యానల్‌కు మద్దతుగా నిలుస్తున్నారు.

నవచిత్రం

మెప్పించే టైగర్..



రేణు దేశాయ్, అభిషేక్ అగర్వాల్, వంశీ, రవితేజ

రవితేజ, దర్శకుడు వంశీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ క్రేజీ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టైగర్ నాగేశ్వరరావు'.
ఈ సినిమా ఈనెల 20న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించింది.
ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ, 'వంశీ ఈ కథ చెప్పినపుడు చాలా ఎగ్జైట్ అయ్యాను. ఈ సినిమా మిమ్మల్ని గట్టిగా అలరిస్తుందని నమ్ముతున్నాను. అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీపడకుండా తీశారు. జీవి ప్రకాష్ మ్యూజిక్‌కి చాలా థ్రిల్ ఫీలౌతారు. సౌండ్ థియేటర్‌లో ఎలా ఉంటుందో చూడటానికి ఎదురుచూస్తున్నా. వంశీ సినిమాని అద్భుతంగా చేశాడు. అది ప్రేక్షకులు కూడా చూస్తారు' అని తెలిపారు. 'ఈ సినిమా జర్నీ పూర్తి కావడంపై నాకు డిఫరెంట్ ఫీలింగ్ ఉంది. వంశీతో నాలుగేళ్ల జర్నీ. మమ్మల్ని నమ్మిన రవితేజకి ధన్యవాదాలు' అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు.
దర్శకుడు వంశీ మాట్లాడుతూ,'ఇది నాకు చాలా గొప్ప మూమెంట్. ఇది రవితేజ వలనే సాధ్య పడింది. విజయేంద్ర ప్రసాద్ కాల్ చేసిన ప్రత్యేకంగా ప్రశంసించడం ఆనందంగా ఉంది. సినిమా చూశాను. మీరు అనుకునే దాని కంటే మించి ఉంటుంది. మీరు చూసిన ప్రతి సెకండ్ బయటికి వచ్చి మళ్ళీ చూడాలని అనుకుంటారు. తెలుగు చిత్ర పరిశ్రమలో 'టైగర్ నాగేశ్వరరావు' బెస్ట్ ఫిల్మ్ అవుతుంది' అని తెలిపారు.


వక్కంతం వంశీ, ఎన్.సుధాకర్‌రెడ్డి, రాజశేఖర్

నితిన్ సినిమాలో రాజశేఖర్

హీరో నితిన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఎక్స్ ట్రా'. రైటర్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాకి సంబంధించి మేకర్స్ సోమవారం ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ చేశారు.
ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్న రాజశేఖర్ సోమవారం సెట్స్‌లోకి అడుగు పెట్టారు. ఈ సడెన్ సర్‌ప్రైజింగ్ అనౌన్స్మెంట్‌తో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. నితిన్ ఇందులో చాలా డిఫరెంట్‌గా కనిపించ బోతున్నారు. ఇదొక క్యారెక్టర్ బేస్డ్ స్టోరీ, కచ్చితంగా అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను మెప్పిస్తుందని డైరెక్టర్ వక్కంతం వంశీ తెలిపారు. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్యమూవీస్ అండ్ ఎంటర్ టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ మూవీని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

కొత్త వెంకీని చూస్తారు


వెంకటేష్

వెంకటేష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సైంధవ్'. సోమవారం మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ను లాంచ్ చేయడం ద్వారా ప్రమోషన్స్ ప్రారంభించారు.
వెంకటేష్ మాట్లాడుతూ,'ఒక ప్రత్యేకమైన కథ కోసం ఎదురుచూస్తున్నపుడు దర్శకుడు శైలేష్ ఈ కథ చెప్పారు. బలమైన ఎమోషన్, యాక్షన్‌కి స్కోప్ వున్న కథ ఇది. వెంటనే ఓకే చెప్పాను. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఇంటెన్స్ యాక్షన్, ఎమోషన్స్‌ని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. ఇందులో నా పాత్ర క్రేజీ అండ్ వైల్డ్‌గా ఉండబోతుంది.
అన్నీ ఎమోషన్స్ ఉంటాయి. ఫ్యామిలీ ఆడియన్స్ అందరికీ నచ్చుతుంది. ఇందులో కొత్త వెంకీని చూస్తారు. వెంకట్ ప్యాసినేట్ ప్రొడ్యూసర్. అందరికీ నచ్చే మంచి సినిమా తీయాలనే తపన ఆయనలో ఉంటుంది. జనవరి 13న సినిమా విడుదలౌతుంది. గతంలో 'చంటి, కలిసుందాం రా, లక్ష్మీ' సంక్రాంతికి వచ్చాయి. ఇప్పుడు మళ్ళీ 'సైంధవ్' వస్తోంది. పండగ రోజు తప్పకుండా ఒక మంచి సినిమాని ప్రేక్షకులు చూడబోతున్నారు' అని అన్నారు. దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ, 'వెంకటేష్ ప్రతిష్టాత్మక 75వ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం ఇచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. ఆయనకు పెద్ద హిట్ ఇవ్వాలనే సంకల్పంతో పని చేశాను. మా నిర్మాత వెంకట్‌కి కృతజ్ఞతలు. సినిమాకి కావాల్సినవి అన్నీ సమకూర్చారు. నవాజుద్దీన్ సిద్దిఖీకి తెలుగు చిత్ర పరిశ్రమలోకి స్వాగతం పలుకుతున్నాను. టీజర్‌లో చూసింది చిన్న గ్లింప్స్ మాత్రమే. సినిమాలో చాలా ఉంది' అని తెలిపారు. 'వెంకటేష్‌తో సినిమా చేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. 'సైంధవ్'తో నా కలనెరవేరినట్లయింది' అని వెంకట్ బోయనపల్లి అన్నారు.

థ్రిల్ చేసే అన్వేషి


ముఖేష్ గుప్తా, సిమ్రాన్ గుప్తా

విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో, హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'అన్వేషి'. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వి.జె.ఖన్నా దర్శకత్వంలో టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం నిర్మాత గణపతి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా జరిగిన వేడుకకు వరలక్ష్మి శరత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'నిర్మాతగా ఇదే మా తొలి చిత్రం. నా భార్య పేరు మీదనే బ్యానర్‌ని స్టార్ట్ చేశాను. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుంది. ఇదేం చిన్న సినిమా కాదు.. బాగానే ఖర్చు పెట్టి మేకింగ్ కోసం ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. మా డైరెక్టర్ వి.జె.ఖన్నా చక్కగా తెరకెక్కించాడు. నవంబర్ రెండో వారంలో సినిమాను రిలీజ్ చేస్తాం' అని నిర్మాత టి.గణపతి రెడ్డి చెప్పారు. దర్శకుడు వి.జె.ఖన్నా మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం డీప్ ఫారెస్ట్‌లోకి వెళ్లి షూట్ చేశాం. ప్రేమ్ రక్షిత్ ఇందులో ఓ పాటకు కొరియోగ్రఫీ అందించారు. చైతన్ భరద్వాజ్ బ్యూటీఫుల్ మ్యూజిక్ ఇచ్చారు' అని అన్నారు.

సరికొత్త కథతో నవాబ్


ముఖేష్ గుప్తా

హరిహర క్రియేషన్స్ బ్యానర్ పై ఆర్ఎం నిర్మాణ సారథ్యంలో రవి చరణ్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'నవాబ్'. ముఖేష్ గుప్తా, అనన్య నాగళ్ళ హీరో, హీరోయిన్‌లుగా నటిస్తున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.
ఈ చిత్రం ఒక డంప్ యార్డ్ చుట్టూ అల్లుకున్న కథ అని, ఆద్యంతం ఉత్కంఠ భరితమైన థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ని ప్రేక్షకుడికి 'నవాబ్' చిత్రం అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'నల్లమల' దర్శకుడు రవి చరణ్ తన రెండవ చిత్రంగా దీన్ని రూపొందించారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న ఈ చిత్రాన్ని ఎక్కడ కాంప్రమైజ్ అవ్వకుండా మేకర్స్ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా రేంజ్‌లో తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

భావోద్వేగాల దీపావళి


'దీపావళి' చిత్రంలో ఒక దృశ్యం

నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'. ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించారు. స్రవంతి మూవీస్ సంస్థలో 38వ సినిమా 'కిడ'. 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా కూడా ఇదే కావడం విశేషం. పూ రాము, కాళీ వెంకట్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసలు అందు కున్న చిత్రమిది. ఇప్పుడీ చిత్రాన్ని తెలుగులో 'దీపావళి'గా అనువదిస్తున్నారు. నవంబర్ 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
ఈ సందర్భంగా 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ, 'చెన్నై వెళ్ళినప్పుడు ఓ స్నేహితుడి ద్వారా ఐదు నిమిషాల పాటు ఈ సినిమా కథ విన్నా. వెంటనే కనెక్ట్ అయ్యాను. దర్శకుడు చెప్పిన పూర్తి కథ నచ్చడంతో ఓకే చేశా. ఏదైతే కథ చెప్పాడో అంతే అద్భుతంగా తెరకెక్కించాడు' అని తెలిపారు.
'తాతయ్య, మనవడు, ఓ మేకపిల్ల... మూడు పాత్రల మధ్య భావోద్వేగాలు 'దీపావళి'లో ప్రధానాంశం. తమిళనాడులో దీపావళిని సంబరంగా జరుపుతారు. నా చిన్నతనంలో మా అమ్మమ్మ, తాతయ్య దగ్గర పెరిగాను. బాల్యంలో జరిగిన సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తీశా. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లోని చిత్తూరు జిల్లాలోని ఓ గ్రామంలో కథ జరుగుతుంది. అన్ని భాషల ప్రేక్షకులకు ఎమోషన్స్ కనెక్ట్ అవుతాయి' అని చిత్ర దర్శకుడు ఆర్ఏ వెంకట్ తెలిపారు.

ప్రేక్షకులు ఊహించని మలుపులు


మిమో చక్రవర్తి, సశా ఛెత్రి

సీనియర్ బాలీవుడ్ హీరో మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి తెలుగు చలన చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్న సినిమా 'నేనెక్కడున్నా'. మాధవ్ కోదాడ దర్శకత్వం వహించారు. ఆయనకూ తొలి చిత్రమిది. ఈ చిత్రంలో ఎయిర్ టెల్ ఫేమ్ సశా ఛెత్రి కథానాయిక. కె.బి.ఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదలకు రెడీ అవుతున్న సందర్భంగా దర్శకుడు మాధవ్ కోదాడ మాట్లాడుతూ, 'జర్నలిజం, పాలిటిక్స్ నేపథ్యంలో తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. సశా ఛెత్రి, మిమో ఇద్దరూ జర్నలిస్ట్ పాత్రల్లో కనిపిస్తారు. ప్రేక్షకుల ఊహకు అందని మలుపులతో ఉత్కంఠభరితంగా సినిమా సాగుతుంది. మహిళలకు బాగా కనెక్ట్ అయ్యే విమెన్ ఓరియెంటెడ్ సినిమా ఇది. దాంతోపాటు జర్నలిజంపై రాజకీయాల ప్రభావం ఎలా ఉంటుందనేది సినిమాలో చూపించాం' అని అన్నారు.
'ముంబై, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చిత్రీకరణ చేశాం. స్టోరీ, మ్యూజిక్, విజువల్స్, డైరెక్షన్ మా సినిమాకు బలం. ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకత్వంలో రష్యన్ బెల్లీ డాన్సర్లతో చేసిన పబ్ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సినిమా ఫస్ట్ కాపీ రెడీ అయ్యింది. ఇటీవల సెన్సార్ పూర్తి చేశాం. నవంబర్ 17న తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం' అని నిర్మాత మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886